Website : www.saisadguruvani.org

'జన్మదిన' ప్రత్యేక సంచిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి

సంపుటి - 20 జనవరి, ఫిబ్రవరి, మార్చి - 2020 సంచిక - 1



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - పవర్‌సిటీ

## (2019 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ లో నిర్వహించిన కార్యక్రమాలు)



నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో ఈ పేజీ సమర్పించిన వారు :

**శ్రీ సాయి మాస్టర్ సేవా సంఘం**, శ్రీకాకుళం

**శ్రీ నరసింహ పట్నాయక్, శ్రీమతి స్వర్ణలత**, విజయనగరం

**శ్రీమతి & శ్రీ ఉషారాణి హరికృష్ణ పట్నాయక్**, శ్రీకాకుళం

**శ్రీమతి & శ్రీ ఆర్. రామలక్ష్మి, శ్రీనివాస రావు**, శ్రీకాకుళం

పూర్తి వివరములకు 23వ పేజీ చూడగలరు

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి


సంపుటి - 20 జనవరి, ఫిబ్రవరి, మార్చి - 2020 సంచిక - 1

**శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'జన్మదిన' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**

"పోటీలు, వంతులు, కీచులాటలు మానితే భగవంతుడు కాపాడతాడు" - శ్రీ శిరిడీ సాయిబాబా

## చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |


మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**


**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224, 9441467648

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**


## విషయ సూచిక


ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక... లోపలి కవర్ పేజీ
1. విషయసూచిక ............ 1
2. మా మాట ............ 2
3. సంక్రమణం ............ 4
4. నూతన సంవత్సర సందేశం ............ 5
5. నాలుగు స్తంభాలు ............ 6
6. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ............ 7
7. శ్రీగురు చరితామృతము ............ 9
8. పండుగలు - పర్వదినాలు ............ 11
9. అవధూత శ్రీ రామిరెడ్డి తాత ............ 12
10. ఒక్క క్షణం ............ 13
11. శ్రీ దక్షిణామూర్తి ............ 15
12. సమాధి చెంత - సమాధి స్థితి ............ 16
13. జిజ్ఞాస ............ 17
14. బాలవికాశం ............ 18
15. పూర్ణ అంతరంగాలు ............ 19
16. సంసార వృక్షం ............ 22
17. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ............ 23
18. మేము సహితం ............ 25
19. జన్మదిన శుభాకాంక్షలు ............ 26
20. స్ఫూర్తి ప్రధాత ............ 33
21. దీవెన ............ 34
22. అనుగ్రహమూర్తి ............ 35
23. ఆదర్శమూర్తి ............ 36
24. నిస్వార్థసేవ ............ 37
25. నిత్య జీవితంలో యోగసాధన ............ 38
26. శ్రీ త్రైలింగస్వామి ............ 39
27. జీవిత పాఠాలు ............ 40
28. మన సాంప్రదాయాలు ............ 41
29. అరచేతులు ............ 42
30. శ్రీ పెనుమత్స మహాయోగిని ............ 43
31. సిద్ధులు-వ్యాధుల ............ 44
32. తెలుసుకుందాము ............ 45
33. ఋణానుబంధం ............ 46
34. ట్రస్టు ప్రణాళిక ............ 47
35. ఏరిన ముత్యాలు ............ 48




# మా మాట - సంపాదకీయం

**పాఠకులకు, ప్రకటన కర్తలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు...**

నూతన శతాబ్దిలో 20వ వసంతములోకి అడుగిడుతున్న శుభసమయంలో మనందరి జీవితాలు నూతన కాంతితో నిండాలని, ఆ వెలుగు కిరణాలలో ఉజ్వలమైన భవితకై, ఉన్నత ఆశయసాధనకై ముందుకు సాగుతూ, ప్రతి ఒక్కరూ సుఖమయ ఆనందాలతో జీవితం గడపాలని, అందుకు జగద్గురువైన శ్రీ దత్తసాయి భరద్వాజుల కృపానుగ్రహం తోడవ్వాలని, కోరుకుంటూ, ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక శుభాకాంక్షలు.

కొందరు వ్యక్తుల కలయిక కుటుంబం, కొన్ని కుటుంబాల కలయిక సమాజం, కొన్ని సమాజముల కలయిక గ్రామం, కొన్ని గ్రామాల కలయిక పట్టణం, అలాగే రాష్ట్రం, దేశం, ప్రపంచం. "దేశమంటే మట్టి కాదు మనుష్యులోయ్" అన్నారు శ్రీ గురజాడ. ప్రపంచం మారాలి అంటే, మార్పు ముందు వ్యక్తితోనే ప్రారంభం కావాలి. ఎవరికి వారు ప్రక్కవారు బాగుండాలి అని భావించటము మాత్రమే కాకుండా, ఆ దిశగా ఆచరణ సాగిననాడు అందరమూ బాగుంటాము. శుభం చేకూరాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు చెప్పటం మంచిదే. ఆభావన ఆచరణాత్మకమైనప్పుడే నిజంగా శుభాన్ని చేకూర్చగలిగిన వారలమవుతాము. ప్రతిఒక్కరము శుభాన్ని పొందటానికి ఆదర్శముగా "చెట్టును చూసి నేర్చుకో" అన్నారు సాయి. సస్యశ్యామలమైన పుడమిలో విత్తిన బీజాన్ని శ్రద్ధా ఆశక్తులతో పరిరక్షించుకొని, సరియైన సమయములో నీరు, ఎరువు, క్రిమి సంహారకాలు అందజేస్తూ, కలుపు మొక్కలు రాకుండా చూసుకుంటూ పరిరక్షిస్తే, మొక్క మానై, మహావృక్షమై, పూలు, పండ్లు, నీడ, చివరకు తాను మరణిస్తూ కలప, కట్టెలు కూడ ప్రసాదిస్తుంది. పుడమితల్లి అట్టడుగు పొరలలోని నీటిని పీల్చుకొని, తాను ఎదగటానికి ప్రయత్నించిన చెట్టు, ఎదుగుతున్న కొద్దీ సాటి జీవులకు సహకారము అందిస్తుంది. మరి అన్నీ తెలిసిన మనిషి తాను ఎదగటానికి చేసే ప్రయత్నంలో సాటివారికి ఎంత వరకు సహాయమందిస్తున్నారు? కనీసం సహకారమన్నా చేస్తున్నారా? "చెట్టును చూసి నేర్చుకో"మని శ్రీసాయి చేసిన బోధలోని భావమదే!

"నేను బాగుండాలి" అని మాత్రమే అనుకోకుండా, "నేను కూడ బాగుండాలి" అని భావిస్తూ, తదనుగుణంగా ఆచరణ సాగిననాడు నిజంగా ఇతరులకు శ్రేయస్సును కలిగించిన వారలమే కాకుండా, మనకు కూడ శ్రేయస్సు ఒనకూర్చుకున్న వాళ్ళమవుతాము. సమాజములోని సాటివారి శ్రేయస్సుతో కూడి మన శ్రేయస్సు ఇమిడి ఉన్నదని గ్రహించిననాడు తదనుగుణముగా మన ప్రయత్నం సాగుతుంది. అందుకు అనుగుణముగా శ్రీ బాబా బోధలు ఆచరణీయము. "అసూయను జయించు, అవతలివాడు బాగుపడితే ఆమేలు మనమూ పొందటానికి ప్రయత్నిద్దాము. ఎవరైనా నీ దగ్గరకు వస్తే ఇవ్వ శక్యమైతే ఇవ్వు లేదా ఇప్పించు, ఇవ్వటం ఇష్టం లేకపోతే, ఇవ్వలేనని చెప్పు. అంతేగాని, హేళనచేయటం, అదిలించటము కూడదు" అన్నారు శ్రీసాయి. ఎవరి సేవను ఉచితంగా తీసుకోవద్దు. ఉదారంగా ప్రతిఫలమివ్వు. ఇది మన నియమం కావాలి.

"ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో. ఆకలిగొన్న వారికి అన్నం, వస్త్రాలు లేనివారికి వస్త్రాలు ఇవ్వు. భగవంతుడు సంతోషిస్తాడు. పనిచేయి, దేవుని నామం ఉచ్చరించు. సద్గ్రంథాలు చదువు, పోటీలు, వంతులు, కీచులాటలు మానితే భగవంతుడు కాపాడుతాడు, ఏపని చేయటానికి ఒప్పుకున్నా క్షుణ్ణంగా చేయి, సత్యాన్ని అంటిపెట్టుకో నీవెంట ఉంటాను, నీవు నాలో ఉన్నావు, నేను నీలో ఉన్నాను ఇదే భావన చేస్తూ ఉండు, భూమి విత్తనాన్ని ధరిస్తుంది, మేఘాలు వర్షిస్తాయి, సూర్యుడు వాటిని మొలిపిస్తాడు. విత్తనం మొలకెత్తినందుకు ఇవేవీ సంతోషించవు, మొలకెత్తనందుకు దుఃఖించవు. నీవూ అలానే ఉండు. ఇక దుఃఖమెక్కడిది? దుఃఖం లేకపోవటమే ముక్తి. సద్గురువును తెలుసుకోవటానికి ప్రయత్నం చేయి, లేకపోతే మానవజన్మకు ఎందుకొచ్చినట్లు, పిడకలు ఏరుకోవటానికా? సద్గురువు చెంత చేరిన తరువాత శాస్త్రషట్కంతోగాని, సాధన సంపత్తితోగాని పనిలేదు. అచంచలమైన విశ్వాసముతో గురువును అంటిపెట్టుకో, చివరికంటా వెంటనుండి గమ్యం చేరుస్తాను" అన్నారు శ్రీసాయి. ఇంకా ఎన్నో, ఎన్నెన్నో తన ఆచరణద్వారా, బోధలద్వారా, సూక్తులద్వారా, చర్యలద్వారా, చివరకు చిరునవ్వుద్వారా కూడ జగద్గురువైన శ్రీసాయి బోధించారు, బోధిస్తూనే ఉన్నారు. అలనాడు అవధూత 24 మంది గురువులను సేవించి, జ్ఞానం సముపార్జించానని అన్నారు. నేడు శ్రీసాయి మనకు "సహస్రముఖాలుగా, సహస్ర విధాలుగా బోధిస్తున్నారు. వినటం, చూడటం చేతకావాలి" అంటారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. శ్రీసాయి బోధించిన వాటిలో ఏఒక్క సూక్తి ఆచరించినా క్రమేపీ మన జీవితం వారి పరమైపోతుంది. "అసత్యం పలకను" అన్న ఒక్క నియమముతో హరిశ్చంద్రుడు సత్యహరిశ్చంద్రుడు అయిపోయినాడు. "నాగురించే వింటూ, నాగురించి చింతనచేస్తూ, నా లీలలు గానం చేస్తూ, నా చరిత్ర పారాయణ చేస్తూ, నాబోధలు ఆచరించేవారు ఇహపరాల గురించి ఆలోచించాల్సిన పనిలేదు. వారి కర్మ నశిస్తుంది, వారే నేనుగా మారిపోతారు"


అన్నారు ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాథుడు. ఎన్నో జన్మల పుణ్యం వలన అటువంటి సాటిలేని సద్గురువు చెంతకు మనం చేరేము. మన హృదయ క్షేత్రాలలో "సద్గురుభక్తి" అనే విత్తనం మొలకెత్తి, కాలంతోపాటు వృద్ధి చెందుతూ, అది అందించే ఫలపుష్పాదులు సాటివారితో కలసి ఆస్వాదించగలుగుతున్నామా లేదా అన్నది పరిశీలించుకొని, సరిచేసుకుంటూ సాగటం ద్వారా నిజమైన శ్రేయస్సును మనము పొందుతూ, సాటివారికి చేయూతనివ్వగలము అదే సాయి మననుంచి కోరే దక్షిణ. ఆ దిశగా సాగే ప్రతి ఒక్కరికీ శ్రీదత్తసాయి భరద్వాజులు తమ చేయూతనిస్తూ ముందుకు నడిపించాలని, మనసారా కోరుకుంటున్నాము.

"సాయి" అంటే చైతన్యం, విశ్వవ్యాపకుడైనవాడు, సకల దేవతా స్వరూపుడు, ప్రపంచంలోని అన్ని మతాలలో ఉత్కృష్టము ఉన్నతము అయిన స్థితిలోని, మహాత్ములందరూ, సకల జీవులలోను నేనే ఉన్నానని ప్రత్యక్ష నిరూపణ చేసి జగద్గురువై భాషిస్తున్నారు. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని భావించేవారు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అని చెప్పటమే కాకుండా, అలనాడు శ్రీకృష్ణుడు అర్జునుడికి మాత్రమే విశ్వమంతా తన రూపమేనని తెలియజేస్తే, నేడు జగద్గురువైన శ్రీసాయి ప్రతి ఒక్కరికీ దానిని ప్రత్యక్ష అనుభవం చేస్తున్నారు. ఏ దేవతను, ఏ మహాత్ముని చివరకు ఏ జీవిని ఆదరించినా, దూషించినా అది నాకే చెందుతుంది అని ప్రత్యక్ష నిరూపణ చేశారు శ్రీ శిరిడీసాయిబాబా. మానవులలోని సంకుచితత్వం, స్వార్ధం ప్రబలి అది ఆధ్యాత్మికతలో కూడ చోటు చేసుకుంటూ మాదేవుడు, మా మతం, మా జాతి, చివరకి మా గురువే గొప్పవాడు అనుకుంటూ, కలి ప్రభావానికి లోనై చరించేవారిని ఉద్ధరించటానికై, త్రిమూర్త్యాత్మకుడైన శ్రీ దత్తాత్రేయుడు, దేశకాలమాన పరిస్థితులను అనుసరించి శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహసరస్వతిస్వామి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ అక్కల్‌కోటస్వామి, శ్రీ శిరిడీసాయిబాబాగా అవతరించి, ప్రపంచమంతా వసుధైక కుటుంబముగా కలసి మెలసి జీవించమని, తన ఆచరణ ద్వారా బోధించటమే కాకుండా, సర్వులకు ప్రత్యక్ష అనుభవాన్ని ప్రసాదిస్తున్నారు. 1963 ఫిబ్రవరి 9వ తేదీ శ్రీసాయిసన్నిధిలో విశ్వచైతన్యానుభూతి అనుభవంలోకి వచ్చిన పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారు విశ్వరూపుడైన శ్రీసాయి స్వరూపులైన అవధూతలను, మహాత్ములను తాను దర్శించి, శ్రీసాయి విశ్వతత్వాన్ని సాయిభక్త కోటికి తెలిపి, నిర్దుష్టమైన శ్రీసాయిమార్గంలో పయనింప చేస్తూ, శ్రీసాయిమాస్టర్‌గా వినుతికెక్కేరు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. తుమ్మెద వివిధ పువ్వులయొక్క రూపు, రంగు, వాసనలను పట్టించుకొనకుండా అందులోని తేనె మాత్రమే గ్రహించినట్లు ఉత్తముడైన శిష్యుడు కూడ వివిధ గురువులనుండి తగురీతిన జ్ఞానం సముపార్జించాలని 'గురుగీతావాక్యం'. "సకల దేవతలలో గురువును, గురువులో సకలదేవతలను దర్శించాలని" శాస్త్రవాక్యం. 'గు' అంటే గుణానికి 'రు' అంటే రూపానికి, 'వు' అంటే అతీతుడై ఉన్నవాడు. గుణ, రూపాలకు అతీతుడై నిలచిన శ్రీసాయి చెంతకు అనేక మిషలతో చేరిన ప్రతి ఒక్కరూ శ్రీసాయి బోధలను ఆలకించి, ఆచరించిననాడే నిజంగా వారిని ఆరాధించిన వారలము అవుతాము. "నేను చెప్పిన పని చేయని వాడితో నాకేమి పని" అన్నారు శ్రీసాయి. వారు చూపిన బాటలో నడిచి, నేడు లక్షలాది మందికి మార్గదర్శకులైన "శ్రీభరద్వాజ" నామం మకుటంగా కూడిన "సద్గురువాణి" జగద్గురువు అయిన శ్రీసాయి విశ్వతత్వాన్ని, సర్వులతో పంచుకుంటూ, పెంచుకుంటూ సాగే అక్షరయజ్ఞ రూపమే "శ్రీ భరద్వాజ సద్గురువాణి". ఆదిశగా అడుగులు సాగుతూ, నేడు లక్షలాదిమంది సాయిభక్తులు అనేక విధాలుగా శ్రీసాయికృపకు పాత్రులవుతున్నారు. అందుకు సముద్రములో నీటిబిందువు వంటి అక్షర సహకార ప్రయత్నమే "శ్రీ భరద్వాజ సద్గురువాణి". ఆ దిశగా సాగే 'శ్రీభరద్వాజ సద్గురువాణి' ద్వారా ఆ యా సందర్భాలను అనుసరించి సాయి స్వరూపులైన అవధూత, మహాత్ముల బోధనలను, సూక్తులను మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తున్నాము.

శ్రీ సాయిమాస్టర్ స్ఫూర్తితో మేము చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నవారు, పొందిన మేలుకు ప్రతి ఫలంగా, కృతజ్ఞత పూర్వకంగా, స్వకార్యం, శ్రీసాయి కార్యం అన్న భావనతో ఇచ్చిన ప్రకటనలను పత్రికలో ప్రచురిస్తున్నాము. వీటన్నిటిని మించి, పాఠకుల దేవుళ్ళు అయిన మీ అందరి అండదండలు, ఆదరాభిమానములే మాకు అక్షర లక్షలు. మీ అందరి ఆదరాభిమానాలతో దినదినా ప్రవర్ధమానమవుతూ 20వ వసంతం లోనికి "శ్రీభరద్వాజ సద్గురువాణి" అడుగిడుతున్న శుభ సందర్భముగా "జన్మదిన ప్రత్యేక సంచిక"గా ఎక్కువ పేజీలతో, నూతన శీర్షికలతోపాటు, కొన్ని శీర్షికలలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నం ప్రారంభించాము. అవి మిమ్ములను అలరిస్తాయని ఆశిస్తూ, మా కొనసాగింపుకు మీ అమూల్యమైన రచనలతోపాటు, సలహాలు, సూచనలు అందజేయగలరని ఆశిస్తున్నాము.

"శ్రీ భరద్వాజ సద్గురువాణి" మీ హృదయవాణిగా తీర్చిదిద్దే విధముగా అహర్నిశలు మేము మావంతు కృషి చేస్తామని, దానికి మీ సలహా, సూచన పూర్వక ఆదరాభిమానాలు తోడవ్వాలని కోరుకుంటూ, మమ్ములను ఈ స్థితిలో నిలిపి, నిరంతరం నడిపిస్తున్న ఆది దంపతులైన సాయిమాస్టర్ పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ, దివ్య జనని శ్రీమతి అలివేలు మంగతాయారు పాదపద్మాలకు- మా హృదయ పూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకుంటూ...

**మహాశివరాత్రి మరియు తెలుగు నూతన సంవత్సరము**
**ఉగాది శ్రీ "శార్వరి" నామ సంవత్సర శుభాకాంక్షలతో**



సంపాదకులు — శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు
పబ్లిషర్ — శ్రీమతి వి.యస్. లక్ష్మీ

# సంక్రమణము

పండుగలు మన భారత జనజీవనంతో పెనవేసుకుని అల్లుకుపోయిన పరిమళాల పూలతీగలుగా చెప్పటంలో అతిశయం లేదు. మనం ఏటేటా సాంఘికంగా, సాంస్కృతికంగా, మతపరంగా, ఆధ్యాత్మికంగా పలు పండుగలు జరుపుకుంటున్నాము. ఇలా వేడుకలగా జరుపుకునే ఆ పండుగల్ని పూర్వులు నాలుగు విధాలుగా విభజించారు. ఇందు ప్రధమంగా చెప్పుకోదగ్గవి మహనీయుల, మహాత్ముల జయంతి, ఆరాధనోత్సవములకు సంబంధితమైనవి. ఉదాహరణకు శ్రీరామనవమి, శ్రీకృష్ణ జయంతి, భీష్మ ఏకాదశి, శ్రీ రామిరెడ్డి తాత, శ్రీ చివటం అమ్మ, శ్రీ వెంకయ్య స్వామి, శ్రీ పాకలపాటి గురువుగారు, ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారు, శ్రీ చీరాలస్వామి, శ్రీ అక్కలకోట స్వామిగార్ల ఆరాధనోత్సవాలు, జయంతులు మొదలైనవి.



ఋతు సంబంధిత కోవకు చెందినవి సంక్రాంతి, రథ సప్తమి మొదలైనవి. మూడవది శైవ, వైష్ణవ, శాక్తేయ మతాలకు చెందినవి, శివరాత్రి, వైకుంఠ ఏకాదశి, విజయదశమి ఇత్యాదులు. ఇక చివరిదైన నాల్గవ కోవకు పైనుదహరించినవి కాకుండా ఇతరమైన వన్నీ వస్తాయి. ఋతు సంబంధిత పండుగగా నిలిచే సంక్రాంతికి మన దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యత కలదు.

సంక్రాంతి ప్రకృతిలో కలిగే మార్పును సూచించే పండుగ. సూర్యుడు ధనుస్సు రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశించే శుభదినం. ఈ రోజున ఉత్తరాయణం ప్రారంభమై, స్వర్గ ద్వారాలు తెరువబడతాయనీ, ఉత్తరాయణ కాలంలో చనిపోయిన వారికి ఉత్తమ జన్మగానీ, ఉత్తమ లోకంగానీ, పరమపదంకానీ లభిస్తుందని ఇతిహాస పురాణాలు చాటి చెబుతున్నాయి.

మనదేశం సూర్యారాధక దేశం. వేదాల్లో, పురాణాలలో సూర్యుడిని భగవంతుడని వర్ణించారు. ఈ కారణంగా ఈయనను ప్రత్యక్ష దైవంగా భారతీయులు ఉదయం, మధ్యాహ్నం, సాయంవేళల్లో అర్ఘ్యం వదలి సూర్యుని ఆరాధిస్తారు. సంధ్యావందనం సూర్యారాధనని తెలుపుతుంది. సూర్యుని వేడియైన కిరణాలకు సాగరం, సరస్సులు, నదులు, తటాకాలు మున్నగువాటిలోని నీరు ఆవిరియై మేఘాలవుతాయి. ఆ మేఘాలకు చల్లగాలి సోకగానే వర్షం కురుస్తుంది. ఈ వర్షం వల్లనే తినేందుకు అన్నం, తాగేందుకు నీరు లభిస్తున్నాయి. సూర్యుడే లేకుండా ఉంటే ఈ ప్రపంచంలో ఎవ్వరికీ అన్నం లేదు. నీరు వుండదు. కనుక సూర్యుడు సకల జీవులకు ప్రాణదాతగా చెప్పక తప్పదు.

ఈ కారణంగా సూర్యుని సూర్యనారాయణుడని ఆరాధిస్తున్నాము. 'భా' అంటే ప్రకాశము లేక సూర్యుడు, 'రతం' అంటే క్రీడ. సూర్యోపాసనతో క్రీడించే దేశం గనుక మన దేశాన్ని 'భారతదేశం' అన్నారని చారిత్రకంగా ఆధారాలు తెలియపరుస్తున్నాయి. ఈ సూర్యోపాసనయే క్రమంగా ఆత్మోపాసనకు, ఆత్మక్రీడకు దారి తీస్తుంది.

ఆయనములు రెండింటిలోనూ దక్షిణాయనము కంటే ఉత్తరాయణము శ్రేష్ఠమైనది. అందుకు కారణం దేవతలకు దక్షిణాయనం రాత్రి, ఉత్తరాయనం పగలు. ఈ కారణంగా శుభకార్యాలను ఉత్తరాయణ కాలంలోనే ప్రారంభిస్తారు. దక్షిణాయనం దేవతలకు రాత్రి కనుక ఆ సమయంలో వారు నిద్రిస్తూవుంటారట. ఎవ్వరైనా పగటి వేళల మేల్కొని ఉండటము వల్ల ఆ సమయంలో శుభకార్యాలు చేయుట మంచిదని యజ్ఞయాగాదులు, దేవతా ప్రతిష్టలు, వివాహాలు, ఉపనయనాలు, వ్రతాలు మొదలైనవి నిర్వహిస్తారు. ఇలా చేయుట వల్ల దేవతల అనుగ్రహంతో శుభాశీస్సులు అంది మన కార్యకలాపాలు సఫలీకృతమవుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇంతటి శ్రేష్ఠతను రంగరించుకున్న ఉత్తరాయణ వేళలో మనం సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఎంతో శుభకరం.

మనలోని దుర్గుణాలనే కట్టెలను తగులబెట్టటమే భోగిమంట. శరీరమనే ధనుస్సును ఎక్కుపెట్టి, నామమనే అల్లెత్రాడును బిగించి, మనస్సనే బాణాన్ని సంధించి, దృష్టిని ఏకాగ్రము చేసి, నేను నాది అనే భావన వీడి సద్గురు పాదాల చెంత చేరడమే సంక్రమణము – సంక్రాంతి. స్వలాభాపేక్ష నశించి సద్గురువు సేవలో నిమగ్నమైన తరువాత ప్రయాణము ఊర్ధ్వగతిన సాగుతుంది, అదే ఉత్తరాయణము.

ఆదిశగా పయనించే ప్రతిఒక్కరికి తన చేయూత నిమ్మని సద్గురు శ్రీ సాయినారాయణుని ప్రార్థిస్తూ, భోగి మరియు మకర సంక్రాంతి శుభాకాంక్షలు ...

రచన : **శ్రీమతి వి. త్రిపుర సుందరి,** విశాఖపట్నం

# నూతన సంవత్సర సందేశం

ఏదో తెలియని అదృశ్యశక్తి ఈ విశ్వాన్ని కొన్ని ధర్మాలననుసరించి నడిపిస్తున్నదని నాస్తికులు కూడా అంగీకరిస్తారు. ఆ శక్తికెంతో తెలివి, సామర్థ్యము లేకుంటే ఈ విశ్వాన్నింత క్రమబద్ధంగా నడిపించగలదా? ఈ శక్తికి చైతన్యమే మూలధర్మమని, ఈ సృష్టి మూలమంతా ఆ చైతన్యరూపమేనని మతాలన్నీ అంగీకరిస్తాయి. శ్రీసాయి కూడా "ఏకం సత్ విప్రా బహుధావదంతి" అన్న వేదవాక్యానికి ప్రతీకయై తమ సమకాలీన మహాత్ములేగాక, గతకాలపు మహాత్ములు ముక్కోటి దేవతలు, సకల జీవులు, తుదకు జడ పదార్థం కూడా తమ రూపమేనని, తమకు ఆ చైతన్య రూపానికి తేడా లేదని స్పష్టం చేశారు. "గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మైశ్రీ గురవేనమః" అంటూ గురుగీత ఈ భావాన్నే మరింత ధృడపరచింది. శ్రీసాయి కూడా సృష్టిలోని ఏ జీవినాదరించినా, తన నాశ్రయించిన భక్తుల లౌకిక ఆధ్యాత్మిక శ్రేయస్సులకు తానే బాధ్యత వహిస్తానని వాగ్దానం చేశారు. ఆ కారణంగా సాటిజీవులకు తలపెట్టినకీడు, మన గురువుకు తగిలినట్లయి, అంతకు పదిరెట్లు దుఃఖాన్ని నెత్తిన వేసుకుంటారు. శ్రీసాయి లీలామృత పారాయణతో ఈ సత్యాలు హృదయగతమయ్యాక, మనమెలా దుఃఖాన్ని కోరుకోమో, ఆ దుఃఖానికి కారణమైన పాప కర్మాచరణకు కూడా పూనుకోము. కాలుతుందని తెలిసికూడా నిప్పులో చెయ్యిబెట్టే మూర్ఖుడుంటాడా? అకారణంగా ఈనాటి సుఖదుఃఖాలు, ఒకనాటి మన పుణ్యపాప కర్మల ఫలితాలేనని గుర్తించి, ప్రజలంతా సధర్మాచరణతో ప్రతిఒక్కరు పదిమందికోసం, పది మంది ప్రతి ఒక్కరికోసం శ్రమించాలి. ఆనాడన్ని మత సాంప్రదాయాలవారు, కలిసి మెలసి సోదరభావంతో మనగలుగుతారు. సమాజంలో సుఖదుఃఖాలు వర్ధిల్లుతాయి. అప్పుడది వసుధైక కుటుంబమవుతుంది. ఈ లక్ష్యాన్ని శ్రీసాయి తత్త్వ ప్రచారంతో సాధించేందుకు పూజ్య గురుదేవులు, శ్రీసాయిబాబాకాబేటా, పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు తన జీవితాన్నే త్యాగం చేశారు.



శ్రీ సాయి భక్తుల మనస్సులు, ప్రాపంచిక భావాల ప్రభావానికి లోనై కంచెలేనిచేనుల్లా ప్రమాదాలకు గురి అవుతున్నాయి. శ్రీ సాయి మనకందించిన ధర్మసూక్ష్మాలను మననం చేసుకుంటూ, జీవితాన్ని సరిదిద్దుకోకపోతే అనేక ప్రమాదాలకు గురి అవుతాము. "ప్రమదో మృత్యుః" అని కదా ఆర్షవాక్యము అందుకు పూజ్య గురుదేవులు భరద్వాజ మాస్టర్‌గారి "శ్రీ సాయి లీలామృతము", "శ్రీసాయి ప్రభోదామృతము'', ''దత్తావధూతల చరిత్రలు'' ఎంతో సహకరిస్తాయి. వెలుగుతున్న దీపానికి నూనె ఆధారమైట్లు, నడుస్తున్న జీవితాలకు శ్రీసాయిబోధే ఆధారం కావాలి.

ప్రతి సాయి భక్తుడు నిద్రలేవగనే ''నేను సద్గురు శ్రీసాయినాధుని భక్తుడను, పూర్వజన్మ పుణ్యవిశేషాన నాకు వారి సేవాభాగ్యం లభించింది. వారి కృపకు పాత్రుడనయ్యే విధంగా నా జీవితాన్ని చక్కదిద్దుకొని ధన్యత చెందుతాను" అని కృత నిశ్చయుడు కావాలి. శ్రీ గురుతత్త్వం, పాలలో వెన్నలా, ఈ సృష్టినంతా అంతర్లీనమైయుండి, మనకందిస్తున్న బోధను నిశితంగా గుర్తించకపోతే, నిరర్ధకులమవుతాము. మరొక జన్మ వృధాగా గడిచిపోతుంది. మనకండ్ల ఎదుటే ఎందరో స్నేహితులు, సన్నిహితులు కనుమరుగైపోతున్నారు. వాకిట్లో నిలిచిన భిక్షగాడు, దారినపోతున్న శవం, నెరసిన జుట్టు, ఊడినపండ్లు మందగించిన చూపు, జీవితంలో ఎదురైన భయంకర కష్టాలు, ప్రమాదాలు ఇలా ప్రతిదీ సద్గురువై నిలిచి మన కండ్లు తెరిపించాలి. మన అహంకారపు అడ్డుగోడల్ని కూల్చివేయాలి. వివేక వైరాగ్యాలతో పాటు మానవత్వపు విలువలు కూడా మనలో మేల్కొవాలి.

మనం ఎటువంటి సంకల్పం చేస్తామో, అటువంటి ఫలితాన్ని పొందుతామని పూజనీయ మాస్టర్‌గారన్నది గుర్తుంచుకొని సాటి భక్తులను సోదర ప్రేమతో చూడాలి. ఎదుటివారిని కించపరచి సంతోషపడే స్వభావం అత్యంత ప్రమాదకరము. ఏ మేరకు ఎదుటివారి మనస్సు కష్టపడుతుందో, అంతకు సమానమైన వ్యధను కల్గించే దుస్థితిలో చిక్కుకొని యాతననుభవిస్తాము. అందుకు రూ. 2 లు దాచిన శ్యామా అనుభవమే సాక్షి. సాటివారిని దూషిస్తుంటే ఆలకించినా దోషమే. అందరిలో నేనున్నానని సాయి మనకిచ్చిన అనుభవం మనకేమి నేర్పినట్లు. ఇటువంటి వారి స్వభావాన్ని శ్రీసాయి మలభక్షణ చేస్తున్న పందితో పోల్చారు. తాజుద్దీన్‌బాబా ఇలా అన్నారు. ''సారాయి త్రాగు, ఖురాన్ కాగితాలను తగులబెట్టు, కావాలంటే దేవాలయంలో నివసించు, కాని ఏ జీవి మనస్సును అణుమాత్రం గాయపరచకు".

అయితే "నేను శ్రద్ధగా శ్రీసాయిచరిత్ర పారాయణ చేస్తూ, శ్రీసాయి సేవలో ఉన్నానుగదా నాకేమి" అన్న ధీమాతో కొందరు సాయిభక్తులుండవచ్చు. కానీ శ్రీ సాయిచరిత్ర పారాయణతో సేవలతో మనకులభించే మనశ్శాంతి కేవలం తాత్కాలికమైనదే. ఇది శరీరాన్ని పీడిస్తున్న వ్యాధిని శక్తివంతమైన మందులతో నయం చేసుకోవటం లాంటిది. నిజమైన ఆరోగ్యం శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెరిగినప్పుడే కదా! అది శ్రీ సాయి చెప్పిన అనేక సూక్ష్మాంశాలపట్ల అప్రమత్తులమైనప్పుడే సాధ్యమవుతుంది. ఉదాహరణకు అనేక రకాలైన అహంకారాలతో మనం అతిశయమైన సాయిభక్తులమన్న భావన కూడా సాత్త్వికమైన అహంకారమే. ఇది

రక్తంలో కాన్సర్ వ్యాధి వంటిది. వ్యాధి లక్షణాలు ప్రమాదకరంగా మారినప్పుడే దీన్ని గుర్తించగలము. దీనివల్ల మనము ఇతరులను అంచనావేసి, వారికన్నా మనమధికులమన్న అపోహను మనకు తెలియకుండానే లోనికి ప్రవేశపెడ్తున్నాం. అంతటితో, సాధకులమనికూడా చెప్పుకోవటానికి అర్హత లేని మనం, ఎదుటివారి మనస్సు నొప్పించేందుకు ఏ మాత్రం జంకము. ఇది ఆధ్యాత్మిక పురోభివృద్ధికి మన కాళ్ళకు మనం వేసుకున్న బంగారు సంకెళ్ళు. సగుణ బ్రహ్మమైన ఆ సద్గురుని శక్తిముందు తలవంచుకొని వినమ్రులమై గడ్డిపరకలవలె వుండవలసిన మనం, ఈ అంతః శత్రువులకు లొంగి అందరిలో సాయిని స్మరించే సంస్కారాన్ని కోల్పోతాము. శ్రీ దాసగణు అంతటి సాయి భక్తుడే ఆరతిలో "అపనే మసజీద్‌కా ఝాడూ గణూహై" అంటే " నీ మసీదును తుడిచే చీపురు వంటివాడు ఈ గణు" అంటుంటే మనమెంత? ఆ కారణంగా పైన చెప్పిన వారి ప్రవర్తన "దేవతలు అడుగిడ జంకేచోట దయ్యాలు యధేచ్ఛగా తిరుగుతాయి" అన్నట్లు వుంటుంది. పూజ్యగురుదేవులు సత్సంగాల్లో, తరచు "లపోటా శంఖాన్ని" గూర్చి చెప్తుండేవారు. అది అడిగినవన్నీ ఇస్తానంటుందిట కానీ ఇవ్వదు. అట్లే మనం సాయిభక్తుల మంటుంటాం కాని సాయిబోధను ఆచరణలో పెట్టము. ఇటువంటి మాలిన్యంతో నలుగురిలో తిరగడం, "అంటువ్యాధి వున్నవాడు సమాజంలో తిరిగినంత ప్రమాదమని" మాస్టర్‌గారనే వారు. తెలియని అమాయక శిఖామణులు ఈ వ్యాధినంటించుకొని బలైపోతారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనమేముంటుంది. ఆ తర్వాత సాయి పలికే ప్రసక్తేలేదు. తన మాట పాటించని భక్తునితో శ్రీసాయి "నిన్ను నీ ఖర్మకు వదిలేస్తానని" అన్నారు. ఇందుకు నానాసాహెబ్ చందోర్కర్ అనుభవమే సాక్షి. ఒకసారి 'కళ్యాణ్'లో పేదరాలైన వృద్ధ బ్రాహ్మణ స్త్రీ నానా ఇంటికి భిక్షకు వచ్చింది. నానా భార్య ఆమెకు రెండు శేర్లు ధాన్యమిచ్చినా తృప్తిచెందక, నాలుగు శేర్లు ఇస్తేగాని అక్కడ నుండి వెళ్ళనని వేధించసాగింది. ఇదంతా గమనిస్తున్న నానా విసుగుచెంది "ఇచ్చింది తీసుకుపోతావా, జవానుచేత గెంటించమంటావా" అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. ఆ తర్వాత అతడు శిరిడీ వెళ్ళినప్పుడు సాయి బాబా ఎంతకూ అతనితో మాట్లాడలేదు. కారణమడిగితే "నీవు నేను చెప్పింది మరచిపోయావు ఆ పేదరాలు ఇంకా ఇవ్వమనికోరితే అంత కోపగించుకొని, నీ అధికారం చూపడమెందుకు? ఆ చెప్పేదేదో కొంచెం మర్యాదగా చెప్పవచ్చు గదా! "నేను చెప్పింది గుర్తుంచుకోని వారితో నేనెందుకు మాట్లాడాలి" అన్నారు.

అయితే అందరిలో ఈ సంస్కారం మేల్కొనేలోపల అజ్ఞానంతో మనలనెవరైనా నిందిస్తే మనం ఓర్పు వహించాలి. "ఎవరైనా మనపట్ల జంతువువలె ప్రవర్తిస్తే మనం కూడా వారిపట్ల అలానే ప్రవర్తించాలా ఏమి? మన ప్రవర్తన ద్వారా మనం మానవులమని నిరూపించుకుందాం" అని పూజనీయ మాస్టర్‌గారు చెప్పింది గుర్తుండాలి. తనకు అత్యంత ప్రియులెవరో శ్రీసాయి ఈ మాటల్లో స్పష్టంచేశారు. "ఇతరులు చేసే పనులకు వారిమీదే ప్రభావం వుంటుంది. నువ్వు చేసే పనులకు నీపై ప్రభావముంటుంది. నీ గురించి చెడుగా మాట్లాడితే చలించకు. వారి మాటలు నీకేమీ గుచ్చుకోవు గదా. ఎవరు నిందను, దూషణను ఓర్పుతో సహిస్తారో వారే నాకు అత్యంత ప్రియులు". ఆ కారణంగా శాంతి, సామరస్యాలను విస్తరింప చేయడానికే మనమంకిత మవ్వాలి.

మనంవేసే ప్రతి అడుగు, పలికే ప్రతిమాట, మనలను ఆ సద్గురు చంద్రుల కృపకు పాత్రులను చెయ్యాలి. అప్పుడే శ్రీసాయి భక్తుల మధ్య రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలుగాక పవిత్ర ప్రేమ, సామరస్యాలు నెలకుంటాయి. శ్రీసాయి భక్తులది వసుదైక కుటుంబ మవుతుంది. పూజ్య గురుదేవులు శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు శ్రీ శిరిడీసాయి సన్నిధిలో విశ్వచైతన్యానుభూతి పొందిన ఫిబ్రవరి 9వ తేదీనాడు, ఆయన బిడ్డలమైన మనమంతా ఈ ఆశయ సాధనకు పునరంకితమవుదాము.

"మనం ఎలా తరించాలి, ఇతరులు తరించటానికి ఎట్లా సహకరించాలి, అందుకు మనమేం చేయాలి" అనే ఆలోచనతో ముందుకు సాగుదాము.

ఆంగ్ల మరియు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

సౌజన్యం : **సద్గురుస్మృతులు**
రచన : **శ్రీ జె.వి. సుబ్బయ్యమాస్టారు**, ఒంగోలు

# నాలుగు స్తంభాలు

**1. విశ్వాసం :** వర్షాలు పడటం లేదని ఊర్లో వాళ్ళందరూ దేవుడిని ప్రార్థించటానికి గుడికి బయలుదేరేరు, వారిలో ఒకరు మాత్రం గొడుగు తీసుకుని బయలుదేరేరు. అదే విశ్వాసం అంటే.

**2. నమ్మకం :** తండ్రి చంటిబిడ్డను పైకి ఎగరవేసి పట్టుకుంటాడు, ఆ బిడ్డ భయంతో ఏడవదు, ఆనందంతో పక పకా నవ్వుతుంది, అదే అపారమైన నమ్మకం అంటే.

**3. ఆశ :** ఏ క్షణంలోనైనా మనం శాశ్వత నిద్రలోకి జారుతాము అని తెలుసు, కాని, నిద్రనుంచి మేల్కొటానికి రాత్రి పడుకోబోయే ముందు అలారం పెట్టుకొని మరీ పడుకుంటాము.

**4. ఆత్మవిశ్వాసం :** ఏది ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియదు కానీ, ఆయా పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాము, ముందుకు సాగుతాము, అదే ఆత్మ విశ్వాసం అంటే.

చేసే పనిమీద విశ్వాసం, చేయగలను అనే నమ్మకం, చేస్తే బాగుపడతాను అనే ఆశ, ఏమి జరిగినా దానిని ఎదుర్కోగలను అనే ఆత్మవిశ్వాసం అనే నాలుగు స్తంభాలు మానవ జీవిత సౌధానికి ఆధారము. అవి ఎంత లోతుగా దృఢంగా మనలో పాతుకొనిపోతాయో అంత ఉన్నతంగా జీవిత సౌధాన్ని నిర్మించగలము.

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

''అహాన్ని జయించని వారెవరు భగవంతుడిని దర్శించలేరు" అంటారు ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయిబాబా. అహం మనలో అనేక రూపాలలో అనేక విధాలుగా దాగి ఉంటుంది. దానిని గుర్తించి తొలగించవలసింది సద్గురువు మాత్రమే. అందుకు సంసిద్ధులైనప్పుడు మాత్రమే అది సఫలీకృతమవుతుంది. "నీవు నావైపు ఒక్కఅడుగు వేయి, పది అడుగులు వెంటనుండి నడిపిస్తాను" అని సాయి అనటంలోని ఔచిత్యం అదే. ఆఒక్క అడుగు కదలికే మన జీవితాన్ని అధః పాతాళానికా? అంతరిక్షం వైపుకా అన్నది నిర్ణయిస్తుంది. ఆ ఒక్క కదలిక, మనజన్మ సంస్కారాలు, కర్మ సంస్కారాలు, సాంగత్య ప్రభావం పైన ఆధారపడి ఉంటుంది. జీవిత గమనంపై సాంగత్య ప్రభావము ఎనలేనిది. "నీ స్నేహితుడి గురించి, నీవుచెప్పు నీగురించి నేను చెబుతాను" అన్న నానుడి దాని నుంచి వచ్చిందే. కలుపు మొక్కలు ఎక్కడైనా కనిపిస్తాయి, అందుబాటులో ఉంటాయి. గంధము చెట్లే అరుదుగా ఉంటాయి. దాని సమీపంలోని సామాన్య చెట్టు కూడ సుగంధ భరితమవుతుంది. అదే విధంగా సజ్జన సాంగత్యం లభించిన జీవితం సమధుర భరితమై, సాఫల్యం చెందుతుంది. అంతవరకు వెతుకులాటలో పెడదారిన పడి జీవితం వ్యర్థం కాకుండా ఉండటానికి, గత జన్మ మరియు నేటి కర్మ సంస్కారాలు కొంతవరకు సహకారి అవుతాయి.



ఆత్మజ్ఞానమునకై అడవిలోకి వెళ్ళిన నలుగురిని వారించి, "ఆహారము ఇస్తాను, నీళ్ళు ఇస్తాను, వెంట తోడు ఉండి దారిచూపుతాను అన్న కట్టెలుకొట్టుకునే వాడి వేషభాషలను చూసి తిరస్కరించి, అన్వేషణకై అడవిలోకి వెళ్ళి, దారితప్పి తిరిగి బయలుదేరిన ప్రదేశానికే తిరిగి వచ్చినప్పుడు కూడ, ఆ కట్టెలుకొట్టుకునే వ్యక్తి ఇవ్వచూపిన ఆతిథ్యాన్ని తన మిత్రులు తిరస్కరించి, కీకారణ్యములోనికి వెళ్ళినా బంజారాలోని ప్రేమతత్వాన్ని (గురుతత్వాన్ని) గ్రహించారు శ్రీసాయి. "జ్ఞానతృష్ణను తీర్చుకోవటమే కాకుండా, ఆ గురువును అచంచలంగా సేవించి, ఈ స్థితిని పొందేను" అని తన గురుసేవా వృత్తాంతములో శ్రీసాయి చెప్పటం ఇక్కడ గమనార్హం. సాటిలేని సద్గురు లభించినా, వారిని గుర్తించుకొని సేవించుకునే అవకాశం కలగాలి. అందుకు సజ్జన సాంగత్యం ఎంతో సహకరిస్తుంది. ఈ విషయం పూణేకు చెందిన పురుషోత్తంరావ్ అవస్తే జీవితం ప్రస్ఫుటముగా తెలియజేస్తుంది.

'గురువు' అంటే అజ్ఞానమనే చీకటి నుండి జ్ఞానమనే వెలుగు వైపుకు నడిపించేవాడు, 'గురువు' అంటే గుణానికి, రూపానికి అతీతమై ఉన్నవాడు అని శాస్త్రవాక్యం. బాల్యం నుండి వృద్ధాప్యం వరకు, జననం నుండి మరణం వరకు గురువు అనేక రూపాలలో అనేక విధాలుగా జీవితంలో ఎదురై నడిపిస్తారు. దానిని గుర్తెరిగి అవగాహనతో జీవించిననాడు, వేసే ప్రతి అడుగు అవగాహనతో ఆధ్యాత్మిక శిఖరం వైపు సాగుతుంది, లేదంటే జారుడు బల్లపై నడకలా సాగుతుంది.

తన చిన్నతనం నుంచి సజ్జన సాంగత్యం కలిగిన అవస్తే వయస్సుతోపాటు ఆధ్యాత్మిక చింతన కూడ పెంచుకున్నారు. అయితే తనలో అంతర్లీనముగా దాగిన అహం వలన శాస్త్ర వాఖ్యాలకు సంకుచితమైన అర్థాలను ఊహించుకుంటూ, సాధు సాంగత్యము వలన ఆధ్యాత్మిక ఉన్నతిని పొందాల్సిందిపోయి, తనకు తానే అవరోధం కల్పించుకుంటూ ఉండిపోయాడు. సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో అవతరించిన శ్రీశిరిడీసాయినాధుడు, "పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు అనేక మిషలమీద కార్యకారణ సంబంధముగా జీవులను తన దగ్గరకు లాగి, సంస్కరించి చివరికంటా ఉండి గమ్యం చేరుస్తానన్న" వాగ్దానాన్ని అనుసరించి, అవస్తేని తన అంకిత భక్తుడు, ఇండోర్ హైకోర్టులో జడ్జిగా పనిచేస్తున్న రేగే ద్వారా తన చెంతకు లాగటం జరిగింది. తన వృత్తిరీత్యా (గ్వాలియర్‌లో జడ్జిగా పనిచేసేవాడు అవస్తే) పరిచయమున్న రేగేను అనుకోకుండా ఒక రైలు ప్రయాణంలో కలసి, రేగే పదే పదే చెప్పటంతో అతనితోపాటు మొట్టమొదటిసారిగా శిరిడీ రావటం జరిగింది. మశీదులో అడుగిడిన అవస్తేను చూస్తూ "ఎవరీ పిచ్చివాడు" అని సాయి అనటంతో దిగ్భ్రాంతి చెందేడు అవస్తే. "వీడు చూడండి, ఎప్పుడు ఇక్కడికి వచ్చినా ఒంటరిగా రాడు, ఎవరో ఒకరిని వెంటతీసుకు వస్తాడు, నాదగ్గరకు రావటానికి రైలులో ప్రయాణించే వీరిద్దరినీ ఆంగ్ల సైనికాధికారి దించి వేయటానికి ప్రయత్నించాడు. నేను అతడిని వారించి, నాబిడ్డలిద్దరినీ ప్రయాణం కొనసాగించనీ అని చెప్పేను. అందుకే అందరినీ ఆ అధికారి రైలుపెట్టెలోంచి దించివేసినా, వీరిద్దరినీ ప్రయాణం చేయనిచ్చాడు. ప్రయాణంచేసేవాడు ఊరికే ఉండవచ్చు కదా! రాత్రంతా తను నిద్రపోలేదు, నన్ను నిద్రపోనీయలేదు. నాప్రక్కన చేరి బాబా, బాబా అని ఒకటే కేకలు" అంటూ రేగేను చూపుతూ అక్కడి భక్తులతో శ్రీసాయి చెప్పటముతో, సాయి యొక్క సర్వాంతర్యామి తత్వానికి సర్వవ్యాపకత్వానికి ఆశ్చర్య చకితుడైన అవస్తే, తనను పిచ్చివాడు

అని శ్రీసాయి అనటంలోని ఆంతర్యాన్ని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. అటుపిమ్మట సాయి అనుజ్ఞ తీసుకున్న రేగే, అవస్తేను తీసుకొని "శాల"గా పిలవబడుతూ, సాయి, ఆనతితో అతిథులకు భోజన సదుపాయము కలిగించే రాధాకృష్ణమాయి యింటికి వెళ్ళేడు. రాధాకృష్ణమాయి ఇచ్చిన ఆతిధ్యానికి, ప్రత్యేకించి, ఆమె ప్రశాంతవదనములో ప్రస్ఫుటముగా గోచరించే తేజస్సును చూసి, ఆధ్యాత్మిక సాధనలో పరిపక్వత చెందిన ఈమె ఒక సద్గురువు అని భావించాడు అవస్తే. అతనిలో ఆ భావన కలిగిన సమయంలోనే రాధాకృష్ణమాయి పూణేలో అవస్తే దర్శించిన మహాత్మురాలి గురించి, ఆమె చెప్పిన సాధన గురించి ప్రస్తావించగా, ఆశ్చర్యపోయిన అవస్తే "ఒకే గురువును సేవించిన తనను ఇకనుంచి గురుసోదరిగా భావిస్తానని" అన్నాడు. అందుకు కారణం, పూణే మహాత్మురాలు, చెప్పిన సాధనావిధానం మానివేసి అన్వేషణలో ఉన్నాడు తాను, రాధాకృష్ణమాయి పూణేలోని మహాత్మురాలు బోధనల గురించి ఆమె చేయించే సాధనా విధానము గురించే చెబుతున్నది. దానిని అధిగమించాలనేదే తన అన్వేషణ కనుక, సాధకురాలయిన ఈమె సద్గురువు కానేరదు, గురుసోదరి మాత్రమే అని భావిస్తూ, తక్షణమే తన భావాన్ని మార్చుకున్న అవస్తే ఆంతర్యాన్ని గ్రహించిన రాధాకృష్ణమాయి, చంచలమైన అతని భావాలను సరిచేయదలచి, "సరే ఇప్పుడు అంగీకరించకపోయినా ఫరవాలేదు, నేను చనిపోయిన తరువాత అయినా అంగీకరిస్తావా" అన్నది. అంగీకరించనన్నాడు అవస్తే. రాధాకృష్ణమాయి వెంటనే తాను చనిపోతున్నానని కేకవేసి నేలపైన చనిపోయినట్లుగా పడిపోయింది. ఆ సంఘటనతో అవస్తే ఆలోచనలో పడిపోయాడు. గతంలో పూణేలో జనం మధ్యలో పరివేష్టించి ఉన్న మహాత్మురాలు, తనను వెంటనే చెంతకు పిలచి దర్శన మివ్వాలని అనుకోగానే, ఆమె కూడ తాను చనిపోతున్నానని చెప్పి వెంటనే ముసుగుపెట్టి పడుకోవటం, అక్కడి జనం వెంటనే ఆ ప్రదేశం వీడిపోవటం, తక్షణమే ఆ మహాత్మురాలు లేచి, అవస్తేను దగ్గరకు పిలచి "నీకు దర్శనమివ్వటానికే అలాచేశాను" అని చెప్పిన సంఘటన రాధాకృష్ణమాయి చర్యతో జ్ఞప్తికి వచ్చింది అవస్తేకు. ఎంతసేవటికి రాధాకృష్ణమాయి లేవకపోవటంతో అతడు చిన్న పిల్ల వాడిలా కన్నీరు కారుస్తూ, తన వలన కదా ఆమె మరణించింది. ఆమెను ఎలాగయినా బ్రతికించాలని దృఢసంకల్పంతో గతంలో తనకు పూణేలోని మహాత్మురాలు ఉపదేశించిన పంచాక్షరీ మంత్రాన్ని, ఎట్టి పరిస్థితులలోను బయటకు ఉచ్చరించకూడదు అని ఆమె విధించిన నియమాన్ని కూడ విస్మరించి, బిగ్గరగా ఉచ్చరించాడు, అంతే కాకుండా గత 16 సంవత్సరాలుగా ఆ మంత్రాన్ని జపించటము ద్వారా తాను పొందిన పుణ్యఫలమంతా రాధాకృష్ణమాయిని బ్రతికించటానికి ధారపోస్తున్నాని సంకల్పం చేశాడు అవస్తే. అది జరిగిన మరుక్షణమే స్పృహలో నుంచి లేచినట్లుగా లేచి కూర్చొని, ప్రక్కన ఉన్న అవస్తేని చూస్తూ "చేసింది చాల్లే ఇక వెళ్ళి నీ పని చూసుకో వెళ్ళు" అన్నది రాధాకృష్ణమాయి. తన సంకల్పానికి ఆమె వెంటనే పునర్జీవం పొందినందుకు అవస్తే చాలా సంతోషించాడు, కొంత సమయం తరువాత మాయికి దూరంగా వచ్చి కూర్చొని, తన గురువు ఆజ్ఞను ఉల్లంఘించి పంచాక్షరీని బిగ్గరగా ఉచ్చరించటమే కాకుండా, 16 సంవత్సరాలపాటు ఆ మంత్రజపం వలన పొందిన పుణ్యాన్ని ధారపోసినందుకు అనేక విధాలుగా తనలో తాను పరితపించాడు అవస్తే. గురువు ఆజ్ఞను ధిక్కరించటము, మంత్రోపదేశం చేసిన గురువును వీడి శిరిడీ రావటం తాను చేసిన గురుద్రోహమని దానికి నిష్కృతి లేదని తీవ్రమయిన మనోవ్యాకులతకు లోనైన అవస్తే మతిస్థిమితం తప్పిన వాడిలా ప్రవర్తించసాగాడు. మనోనిశ్చలతను కోల్పోయిన అవస్తే ఒకే చోట పైకి చూస్తూ కూర్చుండిపోయాడు. అతని మనోనేత్రం ముందు ఒక్కొక్క దేవత వరుసగా కనిపించసాగారు. నిశ్చేష్టుడై పిచ్చి చూపుతో ఉన్న అవస్తేను, "చూసింది చాలు, ఇక ఆప్రదర్శన ముగించి, వెళ్ళి ప్రశాంతంగా పడుకో" అన్నది రాధాకృష్ణమాయి, ఆపిలుపుకు బాహ్యస్థితికి వచ్చి చిన్నపిల్లవాడిలాగా పడుకొని నిద్రపోయాడు అవస్తే. అటువంటి స్థితిలోనే అవస్తేకు రెండు రోజులు గడిచిపోయాయి. బాబాపై అపారమైన విశ్వాసం కల రేగే, అవస్తేను, ఆ అవస్థనుంచి బాబా మాత్రమే తప్పించగలరని భావిస్తూ, అతనికి పరిచర్య చేస్తూ ఉండిపోయాడు. ఒకరి తరువాత ఇంకొకరిని గురువుగా స్వీకరిస్తూ, వదలివేస్తూ నలుగురు గురువులపై అర్ధంలేని భయంతో, మనోవ్యాధితో చిక్కుపడిపోయిన అవస్తే చిత్తానికి శాంతిని ప్రసాదించి, మార్గం సుగమం చేయమనే భావంతో, అవస్తే మనస్సుకు సంకేతంగా ఒక దారానికి నాలుగు పువ్వులు ముడివేసి, ఆ చిక్కుని విడదీయమని తన అభ్యర్ధనగా ఒక భక్తుడితో బాబా వద్దకు ఆ దారాన్ని పంపేడు రేగే. అతని ద్వారా ఆ దారాన్ని అందుకున్న బాబా, పువ్వులను వాసన చూసి, ఆ దారాన్ని తిరిగి తెచ్చిన అతనికి ఇస్తూ, మర్మ గర్భంగా నవ్వుతూ "ఈ దారాన్ని తీసుకువెళ్ళు ఆ ముడి "శాల" (రాధాకృష్ణమాయి ఇల్లు) వద్దనే విడదీయబడాలి" అని చెప్పి రేగేకి ఆ దారం ఇచ్చి వేయమన్నారు బాబా. సాయి మాటలలోని ఆంతర్యాన్ని అర్ధం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ రేగే ఆ దారాన్ని అందుకున్నాడు. నిరంతరం అవస్తే చెంతనే ఉండిపోయిన రేగే, అతనికి నెమ్మదిగా ఎన్నో అనునయ మాటలు చెబుతూ, సాయి దివ్యత్వాన్ని గురించి ఒక్కొక్క విషయాన్ని అవస్తేకు చెప్పసాగేడు. మౌనంగా ఆలకించేవాడు అవస్తే. నెమ్మదిగా, సామాన్య స్థితికి వచ్చిన అవస్తే, గురువు అంటే సర్వాంతర్యామికదా! మరి అందరిలో ఉండి ఆయనే నడిపించాలి కదా! ఆమాట వాస్తవమయితే తన గురువు సాయిబాబాలో కూడ ఉండి నన్ను ఆశీర్వదించాలి. అందుకు తన కొక నిదర్శనం కావాలని, తాను ఇచ్చే అన్నం ముద్ద బాబా స్వీకరించాలి అప్పుడు సాయిబాబాలో కూడ నా గురువు నిండి ఉన్నాడని అంగీకరిస్తానని మనస్సులో భావించి, తాను భోజనం చేసే పళ్ళెం కింద ఒక అన్నం ముద్దను పిండంలాగా చేసి ఒకచోత్తో పట్టుకొని నెమ్మదిగా మశీదుకు బయలుదేరేడు అవస్తే.

అటు తరువాత జరిగిన అద్భుతమైన సంఘటనను దాని పర్యవసనాన్ని వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.






# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

భక్త జనోద్ధరణయే అవతార లక్ష్యంగా కలిగి, కలియుగములో రెండవ దత్తావతారమై శ్రీగురుడిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నృసింహసరస్వతి స్వామి, తన తీర్థయాత్రలో భాగముగా అనేక పుణ్య నదీనదములను, పుణ్యక్షేత్రాలను పావనం చేస్తూ వాసరబ్రహ్మేశ్వర క్షేత్రం చేరి, వారానికో, పక్షానికో ఒక్కపూట అన్నం తింటే మరణబాధ అనుభవించే ఉదరశూల రోగబాధితుడైన బ్రాహ్మణుడి చేత షడ్రశోపేతమయిన భోజనం చేయించి, తన మాట మాత్రం చేత అతని రోగ బాధను నివారణ చేశారు, తాను ఆ రోజు ఒక యవనరాజు చేతిలో సంహరింపబడబోతున్నప్పటికి, శ్రీ గురుడి ఆదేశము మేరకు ఆ బ్రాహ్మణుడితోపాటు వారి శిష్యులకు షడ్రశోపేతమైన విందు ఏర్పాటుచేయటమే కాకుండా, అత్యంత భక్తి శ్రద్ధలతో సకలోపచారాలతో పూజించి, సేవించిన, సాయందేవుడిని, తనపైగల అపారము, అచంచలమైన భక్తి విశ్వాసాలకు, సంప్రీతుడైన శ్రీగురుడు "నీ ప్రాణాలు తీయసంసిద్ధుడైన యవనరాజు చేతితోనే ఘనసత్కారము పొంది తిరిగి వస్తావు, అంతవరకు మేము ఇక్కడే ఉంటాము" అని ఆశీర్వదించి, అభయమివ్వగా, తగురీతిగానే తిరిగివచ్చి, తనకు పునర్జన్మ ప్రసాదించిన శ్రీగురుడి పాదాలపై వ్రాలి, తన శేష జీవితాన్ని శ్రీగురుడి సేవలో తరించాలని సాయందేవుడు కోరగా, "ఆత్మ సమర్పణ చేసుకున్న నీ అభీష్టం నెరవేరుతుంది, అయితే అది తక్షణమే కాదు, మేమొక దైవకార్యం మీద మా యాత్ర కొనసాగిస్తున్నాము, తిరిగి 16 సంవత్సరాల తర్వాత ఈ గ్రామానికి దగ్గరగా వస్తాము, అప్పుడు సకుటుంబముగా వచ్చి నీ అభీష్టము నెరవేర్చుకో, అంతవరకు, భగవత్ ప్రసాదితమైన నీ జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా నీ కుటుంబముతో గడుపుతూ, సుఖసంతోషాలతో జీవించమని, ఆశీర్వదించి, శ్రీగురుడు తన శిష్యులతో కలసి పాదచారియై అనేక పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ, వైద్యనాథక్షేత్రం చేరేరు.

అపథ్య భోజనముతో ఒక బ్రాహ్మణుడికి పునర్జన్మ ప్రసాదించటమే కాకుండా, మాటమాత్రంచేత యవనరాజు మనస్సును మార్చి సాయందేవుడికి ప్రాణరక్షణ చేసిన విషయము ఆనోట ఈనోట ప్రాకి, ఎళ్ళెడలా వెల్లడి కావటముతో శ్రీగురుడు తన తీర్థయాత్ర సాగించే మార్గములో తండోపతండాలుగా జనులు తరలి వచ్చేవారు. "యాత్రలో భాగముగా వైద్యనాథ క్షేత్రము చేరిన శ్రీగురుడు కొంతకాలము ఎవరికీ కనిపించకుండా గుప్తముగా ఉండదలచారు" అని సిద్ధయోగీంద్రులు తెలియజేయటముతో అంతవరకు శ్రీగురుచరితామృతాన్ని సిద్ధుల ద్వారా శ్రవణం చేస్తున్న నామధారకుడు "స్వామీ! నాకు ఒక చిన్న సందేహము, సకల జనోద్ధరణయే శ్రీగురుడి అవతార లక్ష్యం కదా! అటువంటప్పుడు వారు ఆ జనులకు కనిపించక గుప్తంగా ఉండదలచటములోని ఔచిత్యము ఏమిటో తెలియజేసి నా సందేహ నివృత్తి చేయమని", అడిగిన నామధారకుడి ఆర్తిని, ఆసక్తిని గ్రహించిన సిద్ధయోగి, చిరునవ్వుతో "నాయనా! నామధారకా! ఇంతవరకు ఇంతటి ఆసక్తితో శ్రీగురుచరిత్రను విశదీకరించమని అడిగిన వారు నాకు తారస పడలేదు. అత్యంత భక్తిశ్రద్ధలతో నీవు శ్రీగురుని కథలు అడుగుతుంటే వాటిని జ్ఞప్తికి తెచ్చుకొని, నీకు శ్రవణం చేయటము ద్వారా శ్రీగురుని లీలలు, తరచి, తరచి స్పురణకు తెచ్చుకునే మహద్భాగ్యం నాకు కలిగింది. అందుకు కారణమైన నీ సందేహాన్ని నాకు తెలినంత మేరకు విశదీకరిస్తాను సావధానచిత్తుడవై ఆలకించు" మని చెబుతూ శ్రీ సిద్ధయోగీంద్రులు, శ్రీగురుచరిత్రలో అంతర్భాగమైన 15వ అధ్యాయాన్ని చెప్పటం ప్రారంభించారు.

"పూర్వము దుష్ట క్షత్రీయులపైన పలుమార్లు దండెత్తి, వారిని ఓడించిన పరశురాముడు, వారి రాజ్య భూభాగమంతా బ్రాహ్మణులకు దానముచేసి, సహ్యాద్రి పర్వతానికి దక్షిణ దిక్కునగల కొంకణ దేశముచేరి, అక్కడ ఒకచోట ఏకాంతముగా తన తపస్సు కొనసాగించారు. అయితే ఆశలు ఉడగని బ్రాహ్మణులు కొందరు పరశురాముని చెంతచేరి, తమకు మరికొంత భూమి కావాలని పదే పదే కోరుతూ, వారి ఏకాంతమునకు భంగం కలిగించటముతో, వేసారిన పరశురాముడు పశ్చిమ సముద్రంలోనికి ప్రవేశించి, ఎవ్వరికీ కన్పించకుండా తన తపస్సును కొనసాగించుకున్నారు.

అదేవిధముగా తమకు అర్హత లేకున్నా అత్యాశతో తమ మనోరథములు నెరవేర్చమని అసంఖ్యాఖముగా శ్రీగురుని చెంతకు జనులు చేరేవారు. వారిలో సద్గురుని కృపార్హత కలిగిన సజ్జనులతోపాటుగా, దురాశాపరులైన ధూర్తులు కూడ ఉండేవారు. వారిలో ఆర్తి జనించటానికై శ్రీగురుడు వైద్యనాథక్షేత్రంలో కొంతకాలము గుప్తముగా ఉండదలచారు. అందుకని తనను

ఇంతవరకు ఆశ్రయించి సేవిస్తూ ఉన్న గృహస్తు, సన్యాస శిష్యులను చేరబిలచి "మేము కొంతకాలము గుప్తముగా మా అవతార కార్యక్రమాన్ని కొనసాగించదలచాము. కనుక మీరు తీర్థయాత్రలకు వెడలండి" అని పలికిన శ్రీగురునితో 'ఓ గురురాజా! కృపామూర్తీ, ఎన్నో జన్మల పుణ్యం వలన మాకు మీ సాంగత్యం లభించింది, మిమ్మలను అతిసన్నిహితముగా సేవించుకుంటూ, మీతో కలసి పవిత్ర పుణ్య నదీనదములను, తీర్థక్షేత్రాలను దర్శించుకొని, పునీతులమయ్యే మహద్భాగ్యం మాకు కలిగింది అంతేకాక మీతో కలసి కొనసాగించే ప్రయాణము, మాలోని ఆత్మజ్ఞాన సాధనకు ఎంతో ఉపకరించటమే కాకుండా, మీ దివ్యత్వాన్ని గ్రహించి మరింతగా మిమ్మలను సేవించుకునే అలభ్యమైన అవకాశాన్ని పొందే అదృష్టం మాకు కలిగింది. మాలోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలే జ్ఞానసూర్యుడివైన మీ వెలుగు కిరణాల ప్రసరణతో జీవన-యాత్రను కొనసాగించే మేము, ఒంటరి ప్రయాణం కొనసాగించగలమా! దారి తెన్నులు తెలియని మేము, తేజోమయుడవయిన మీ సన్నిధి విడిచి, చేసే ప్రయాణం అంధకారములో వెతుకులాట కాదా! ఓ కృపామూర్తీ, మీదర్శనం చేతనే సర్వతీర్థ క్షేత్రాలను, సప్త సముద్రాలను దర్శించి వాటిలో స్నానమాడిన పుణ్యఫలము లభించగలదని భావించి, సమస్త తీర్థములకు నెలవైన మీ పాదాలను ఆశ్రయించాము. అటువంటి గురుచరణారవిందములను వదిలి, మమ్మలను తీర్థయాత్రల నెపముతో మీకు దూరము చేయవద్దు. సర్వతీర్థ, పుణ్యక్షేత్రాలను మీ పాదస్పర్శతో పునీతము చేసి, పావన క్షేత్రముగా మార్చే మీ పాదద్వయాన్ని వీడి మేమెక్కడికి వెళ్ళగలము. సమీపములో గుప్త నిధి ఉంచుకొని, అడవులవెంట, అరణ్యముల వెంట, శిలల వెంట తిరుగులాట వెతుకులాట ఎందుకు ప్రభూ! ఫలవంతమైన వృక్షాన్ని వీడి ఫలాలకోసం నీడకోసం వేరొక చోటుకి పయనం తగునా, గురుదేవా! గురువే సకల దేవతా స్వరూపుడని, సమస్త తీర్థాలు, క్షేత్రాలు వారి పాదాలచెంత ఉంటాయని వేదశాస్త్రములు ఘోషిస్తుంటే, మిమ్మలను వీడి పొమ్మనటం మీకు న్యాయమా! కనుక దయతో మా విన్నపాన్ని మన్నించి, మీతో పాటే మా జీవిత యాత్ర కొనసాగించే అవకాశం కలిగించమని" ఆర్తితో చేతులు మోడ్చి దీనంగా అర్థిస్తున్న శిష్యులవైపు సాభిప్రాయముగా తేరిపారచూసిన శ్రీగురుడు అనునయంతో ఇలా అన్నారు.

మానవజీవితంలో, బాల్య, యవ్వన, కౌమార, వృద్ధాప్యము అనే నాలుగు దశలు వలే, బ్రహ్మచర్య, గృహస్తు, వానప్రస్త, సన్యాస ఆశ్రమములు అను నాలుగు కలవు. మానవ జీవిత దశలో ఈ నాలుగు ఒక క్రమ పద్ధతిలో సాగిననాడే మానవజన్మ సార్థకత కలిగి పరిపూర్ణత్వం ఏర్పడుతుంది. శాస్త్ర విధిని అనుసరించి, జీవనప్రయాణం కొనసాగించినప్పుడే జన్మసాఫల్యం కలుగుతుంది. పూర్వజన్మ సంస్కారము వలన ఎక్కడో ఒక్కరు మాత్రమే అల్పకాలములో అన్నింటిని అధికమించి, సంపూర్ణత్వముతో భాసిల్లగలరు. కారణ జన్ములైన వారిని ఆశ్రయించి సేవించటము ద్వారా, లభించిన జ్ఞాన భిక్షను సక్రమముగా సేవించినప్పుడే తరించగలరు. సామాన్యమైన పుట్టుక కలవారందరూ శాస్త్ర విధిని అనుసరించి, జీవించవలసిందే. అందుకు పూర్వీకులైన పెద్దలు ఏర్పరచిన శాస్త్ర రీతిన జీవించవలసిందే. పూర్వపుణ్యం వలన, సజ్జన సాంగత్యము, సాధు సంపర్కము, సద్గురు సేవ లభించినప్పుడు, త్వరతి గతిన ప్రయాణం కొనసాగించి, అల్పకాలములోనే గమ్యం చేరగలము. పూర్వజన్మ సంస్కారము, ఋణానుబంధము వలన మా చెంతచేరిన మీరు, నే చెప్పిన దానిని, ఆలకించి ఆచరించటము ద్వారా శాస్త్ర విధిననుసరించి జీవించిన వారలు అవ్వటమే కాకుండా, మా ప్రీతికి పాత్రులు కాగలరు. నిరంతరం మా సేవలో నిమగ్నమైన మీతోపాటు అత్యాశాపరులు, దురాశ గలవారు కూడ మాచెంత చేరి, లబ్దిపొందటానికై ప్రయత్నించెదరు. స్వార్థ పూరితమైన వారి ఆలోచనలకు స్వస్తి వాక్యము పలికి, వారిని ఆర్తులుగా మార్చి, చెంతచేర్చుకోవటానికి కూడ మేము ఎవరికి కనిపించకుండా, కొంతకాలము గుప్తముగా ఉండటము సరియైనది, కనుక నే చెప్పిన రీతిన మీరు యాత్ర చేయటము వలన అనతి కాలంలోనే మా ప్రత్యక్ష దర్శనము మీకు లభించగలదు" అంటూ వారికి హితము చెప్పిన శ్రీగురుడు, ముందుగా గృహస్తులైన శిష్యులను పిలచి, వారు అనుసరించవలసిన విధానాన్ని గురించి చెప్పటం ప్రారంభించారు.

ముందుగా గృహస్తు శిష్యులతో వారు ఆచరించవలసిన విధానాల గురించి శ్రీగురుడిలా బోధించారు. "పుట్టుకతో బ్రహ్మతత్వము ఆపాదించబడి, ఉపనయనాది సంస్కారముతో ద్విజుడైన బ్రహ్మచారి, (బ్రహ్మతో చరించువాడు) వేదాధ్యాయనము చేస్తూ భక్తి శ్రద్ధలతో గురువును సేవించాలి. బ్రహ్మచారికి పగలు నిద్ర కూడదు, భిక్షా వృత్తిలో జీవించాలి. ముందుగా తానుపొందిన ఆహారాన్ని గురువుకు సమర్పించి, ఆయన ఇచ్చిన శేషభుక్తాన్ని భుజిస్తూ విద్యావంతుడు కావాలి. వేదాధ్యాయనము సంపూర్ణమయిన పిమ్మట గురువుకు తగురీతిన దక్షిణ సమర్పించి, సమావర్తనహోమము చేయాలి. అటుపిమ్మట గురువుయొక్క ఆజ్ఞతో యోగ్యమైన కన్యను వివాహము చేసుకొనటము ద్వారా బ్రహ్మచర్య ఆశ్రమము నుండి, గృహస్తాశ్రమములోనికి ప్రవేశించిన అతడు, గృహస్తాశ్రమ ధర్మాలను అనుసరించి అతిధి అభ్యాగతులను, సాధు సత్పురుషులను, సన్యాసులను ఆదరిస్తూ, సేవిస్తూ, సహధర్మచారిణితో కూడి ధర్మబద్ధమైన జీవనం కొనసాగించాలి. పుత్రవంతుడైన గృహస్తు, తనయునకు తగురీతిన విద్యాబుద్ధులు నేర్పించి, యుక్తవయస్సుడైన పుత్రునికి సమస్త బాధ్యతలు, సర్వస్వమూ సమర్పించి భార్యతో కూడి తపస్సుకై అరణ్యానికి వెళ్ళాలి. వానప్రస్తాశ్రమములో భగవంతుని చింతనలో జీవితాన్ని గడుపుతూ, భార్య గతించిన పిమ్మటగాని, భార్య అనుమతితోగాని, సద్గురువు చెంత సన్యాసదీక్ష స్వీకరించి, సన్యాసాశ్రమములోనికి ప్రవేశించి, ఇక నుంచి తన జీవిత సరస్వమూ భగవత్ ప్రీతికొరకై జీవించాలి.

సన్యాస దీక్ష స్వీకించిన పిమ్మట కొంతకాలము తీర్థాటనము చేయటము వలన ఏకాగ్రచిత్తుడవుతాడు. సన్యాసి మూడు రాత్రులకు మించి ఒకేప్రదేశములో నివశించరాదు. తురీయాశ్రమము స్వీకరించినవారు, తప్పని సరిగా భూమండలముపై ఉన్న సమస్త తీర్థక్షేత్రాలను దర్శించవలెను. దానివలన వారికి నేత్ర, దేహశుద్ధి కలిగి మనస్సు స్థిరమవుతుంది. అటుపిమ్మట ఒకేప్రదేశములో స్థిర నివాసియై జీవించవచ్చును. కనుక గృహస్తులైన వారితోపాటు, సన్యాసము స్వీకరించిన మీరందరూ పుణ్యక్షేత్రాలను తీర్థక్షేత్రాలను సందర్శించి రండి, కొంతకాలము మేము ఈ వైద్యనాథక్షేత్రములో ఏకాంతముగా ఉండదలచాము. తిరిగి బహుధాన్య నామసంవత్సరములో మీకు శ్రీశైలములో మా ప్రత్యక్ష దర్శనము లభించగలదు" అని శ్రీగురుడు గృహస్తు శిష్యులను తీర్థయాత్రలకు వెడలమని ఆదేశించారు.

అది విన్న శిష్యులందరూ, శ్రీగురుని ముందు మోకరిల్లి, "మీ ఆజ్ఞ మాకు శిరోధార్యము మీ ఆజ్ఞకు బద్ధులమైన మేము మిమ్ములను వీడి యాత్రకు బయలుదేరతాము, ఇష్టాఅయిష్టాలను జయించి, గురువాక్యము అనుసరించి, చరించిన నాడే వారి కృపకు పాత్రులము కాగలము, కనుక ఓ గురుదేవా! మేము ఏ ఏ క్షేత్రములు దర్శించవలెనో, వాటి ప్రాశస్త్యము ఏమిటో అక్కడి విధివిధానాలు ఏమిటో మీ ద్వారా ఆలకించి, పయనమైనచో, మాయాత్ర సఫలీకృతమగునని మా విశ్వాసము. అంతే కాకుండా, మీరు వచించిన విషయాలను మననము చేసుకుంటూ ఆ యా క్షేత్రాలు దర్శించటము ద్వారా అధిక ఫలాన్ని పొందగలము. కనుక దయతో మాకు ఆ యా క్షేత్రముల ప్రాధాన్యత గురించి తెలియజేయమని" వేడుకున్న శిష్యులతో శ్రీగురుడు గృహస్తు, సన్యాస శిష్యులు దర్శించవలసిన పుణ్యతీర్థ క్షేత్రాల గురించి వివరించటము ప్రారంభించారు.

సర్వంసహచక్రవర్తి, త్రిమూర్త్యాత్మకుడు, శ్రీదత్తావతారుడైన శ్రీ నృసింహ సరస్వతి స్వామి ఆ యా పుణ్య తీర్థ క్షేత్రాలను, వాటి ప్రాశస్త్యాన్ని, కన్నులముందు దృశ్యమానముగా గోచరించే విధముగా వివరించిన ఆ అద్భుత మనోహర, మనోయాత్ర దర్శనం గురించి వచ్చేసంచికలో ప్రస్తావించుకుందాము.

## పండుగలు - పర్వదినాలు

### జనవరి - 2020

1. ఆంగ్లనూతన సంవత్సర ప్రత్యేక సత్సంగమము - పవర్‌సిటీ
6. ముక్కోటి ఏకాదశి
8. కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతిస్వామి ఆరాధనోత్సవము
12. స్వామి వివేకానంద జయంతి
14. భోగిపండుగ
15. మకర సంక్రాంతి - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
అవధూత శ్రీ మాలపిచ్చమ్మ ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
అవధూత శ్రీ కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
16. కనుమ - అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము
22. శ్రీ కొత్తలంకబాబా ఆరాధనోత్సవము
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి
30. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి
31. అవతార మెహర్‌బాబా ఆరాధనోత్సవము

### ఫిబ్రవరి

1&2 శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు 27వ వార్షికోత్సవము - పవర్‌సిటీ
5. భీష్మ ఏకాదశి
7,8&9 21వ శ్రీసాయిమాస్టర్ భక్తసమ్మేళనం
బెంగుళూరు - కర్ణాటక రాష్ట్రం
19. శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి (తేదీప్రకారం)
21. మహాశివరాత్రి
యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము - నర్సీపట్నం
25. అవతార శ్రీ మెహర్‌బాబా జయంతి

### మార్చి

9. హోళీపండుగ
20. అన్నమాచార్య వర్ధంతి
24. కొత్త (సర్వ) అమావాస్య
25. తెలుగు నూతన సంవత్సరము - ఉగాది
శ్రీ "శార్వరి" నామ సంవత్సరము
31. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)

### ఏప్రిల్

2. శ్రీరామనవమి
6. మహావీరజయంతి
7. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణోత్సవము
10. గుడ్‌ఫ్రై డే
12. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము (తేదీప్రకారం)
14. భగవాన్ శ్రీ రమణమహర్షి ఆరాధనోత్సవము
సాయిభక్త శ్రీ శివనేశన్‌స్వామి జయంతి
25. రంజాన్ నెల ప్రారంభం
26. అక్షయ తృతీయ - వైశాఖ శుద్ధ తదియ
శ్రీ సింహాచలనృసింహస్వామి నిజరూప దర్శనము - చందనోత్సవము - సింహాచలం, వైజాగ్

# అవధూత శ్రీరామిరెడ్డితాత

కర్నూలు జిల్లా కల్లూరులో కొలువుతీరి 'రామిరెడ్డితాత'గా రామావధూతగా భక్తులచే కొలువబడి, పూజింపబడిన అవధూత భక్తులపట్ల ప్రేమాభిమానములను కురిపిస్తూ, తాత తల్లిగా ఆదరిస్తూ భక్తులు కోరిననూ, కోరకున్ననూ వారి లౌకికపరమైన కష్టములను, సమస్యలనూ, కర్మలనూ తీసివేయడమే కాక, వారి ఆధ్యాత్మికోన్నతికి సరియైన మార్గము చూపించిన కరుణామూర్తి శ్రీరామిరెడ్డి తాత. పరిపూర్ణ అవధూత లక్షణములను సంపూర్ణముగా కలిగిన తాత శారీరధర్మములైన కాలకృత్యములను విధిగా పాటించేవారు కాదు. వారు ముఖము కడిగినా కడగకున్ననూ, స్నానమాచరించకున్ననూ ఒక సుగంధ పరిమళం నిత్యమూ వారి శరీరము నుండి వెలువడు చుండేది. అంతేకాక భక్తులను తృప్తిపరచుటకు ఒకేఒక్కరోజునందే పదిసార్లు భుజించగలిగిన తాత, ఊరికి ఏదైనా ఒక కష్టము దాపురించినపుడు గాని, ఎవరినైనా ఆపదనుంచి తప్పించవలసి వచ్చినప్పుడుగాని పదిరోజులైనాసరే అన్నపానీయములకు దూరముగా ఉండేవారు.



నిద్ర విషయములో కూడా తాత ఇదే పద్ధతిని అనుసరించేవారు. తాత తాను భగవంతుడినని ఎప్పుడూ చెప్పకుండా "ప్రభువు", (దైవము) అని తరచు చెపుతుండేవారు. అందరినీ రక్షించి కాపాడేది తాతే అయినప్పటికీ అది దైవము చేస్తున్న పనిగా చెప్పేవారు.

తన విషయము తానేదైనా చెప్పవలసి వచ్చినప్పుడు కూడా తాత వేరు, ఈ శరీరము వేరు అన్నట్లుగానే సంభాషించేవారు, అనగా ఎవరైనా తాతకు భోజనము పెట్టదలచిన తాతకు తినడం ఇష్టము లేకపోతే ''వాడు తిననంటున్నాడు'' అనేవారు. శ్రీరామిరెడ్డితాత బోధనావిధానము అత్యంత సులువుగను మధురముగను, సున్నితముగను ఉండెడిది. ఈ ఉపదేశములను ఒక్కొక్క అవధూత ఒక్కొక్క పద్ధతిద్వారా స్పష్టపరచేవారు. ఏ విధముగా బోధించినప్పటికీ ఆ విషయము సూటిగా భక్తుల హృదయాలలో హత్తుకుపోయి ఆ ఉపదేశములు వారికి అత్యంత ఉల్లాసమును, సంతోషమును కలిగించుచుండెడివి. ఈ విషయములో తాతగారు పాటించు పద్ధతి ఎంతో ఆహ్లాదముగా సాగేది. తాత తాను చెప్పదలచుకున్న విషయమును కానీ, భక్తుల వ్యవహారశైలి కానీ, ఆధ్యాత్మిక ఉన్నతిని కానీ పాటల రూపములో అత్యంత మృదుమధురముగా గానం చేసి భక్తుల సమస్యలకు పరిష్కారమును, వారు చేయు తప్పులకు జవాబులు వంటి అనేక సందేశములు ఆ పాటల ద్వారా తెలియపరచేవారు.

అవధూత అనగా దిక్కులకు ఆవల ఉన్నవాడు అని అర్థము కూడా కలదు. అందుకే అవధూతయైన రామిరెడ్డి తాత దిక్కులు, ఎల్లలు, హద్దులు లేకుండా ప్రపంచమంతా తానై నిలుచువాడు, ప్రకృతిని, పంచభూతములను నిలువరించగల సమర్ధుడు. ప్రాంతములతోనే కాక తాతకు భాషల విషయములో కూడా ఎటువంటి బేధమూ లేక అనేక భాషలను మాట్లాడేవారు. అంతేకాక తనను దర్శించిన భక్తులు ఏప్రాంతమువారైతే వారేమీ చెప్పకమునుపే వారిని వారి మాతృభాషలోనే పలుకరించి అబ్బురపరచేవారు. అంతేకాక ఒక్కొక్కసారి వారి పేర్లనూ, వారి ప్రాంతముల పేర్లనూ చెపుతూ పలకరించడం చూస్తే తాతగారి సర్వజ్ఞత అర్థమవుతుంది. తాన్నుదే తరింపచేయుట కొరకు కాబట్టి తాత భక్తులను తన వద్దకు రప్పించి వారి కష్టములను కడతేర్చేవారు.

తాతగారు సిగరెట్టు కానీ, బీడీకానీ తాగడం ద్వారా వారి బాధలను బాపేవారని భక్తుల నమ్మకము. అందుకనే తాతగారి వద్దకు ఎవ్వరు ఏ సమస్యతో వచ్చినా తాత ఒక బీడీనో, సిగరెట్టో తాగితే తమ సమస్య పరిష్కరింపబడినట్లు భావించేవారు. అంతేకాక తాతగారు కూడా ఊళ్ళో ఎవ్వరికే ఆపద సంభవింపబోతున్నా అపరిమితముగా బీడీలు కాల్చి పడేస్తుండేవారు.

అత్యంత కరుణామూర్తిగా వెలుగొందిన తాత ఎప్పుడు ఎవ్వరికి ఏ కష్టము వచ్చినా ఆదరించి అక్కున చేర్చుకునే వారు. అయితే తాత ఎంత కరుణామయుడో అంతకన్నా ఎక్కువ కాఠిన్యమూర్తి. భక్తుల చిన్న తప్పునైనా తాత ఉపేక్షించేవారు కారు. తాత ఎప్పుడూ "సిస్టమ్" అని అంటుండేవారు. అనగా ప్రతి మనిషి క్రమశిక్షణతో ఉండి ఎటువంటి తప్పులు, పొరపాట్లు చేయరాదని తాతభావము. వెల్లువలా తరలివచ్చు భక్తుల ఒరవడిని ఎప్పటికప్పుడు నిలవరిస్తూనే తన సహజస్థితియందు తాను ఉండెడివారు. నిరాడంబరముగా, నిష్కల్మషభక్తితో నిశ్శబ్దముగా చేయు ఆరాధనను గ్రహించి అనుగ్రహిస్తూ, తాత అట్టహాసములకు, ఆడంబరములకు ఎప్పుడూ అతీతుడుగానే ఉన్నారు.


తన కరుణా హృదయముతో, కృపాకటాక్షములతో భక్తుల పాపకర్మలను ధ్వంసము చేయుటయే కాక విశేషముగా లోక కళ్యాణ కార్యక్రమములు కావించుట ద్వారా సమాజములో ధర్మము ప్రతిష్ఠించి, శాంతి సౌఖ్యములు విరసిల్లేలా చేసి దేశ వ్యాప్తముగా భక్తుల బాధలు బాపి, వారి యోగక్షేమములు సదా పరిరక్షించే శ్రీరామిరెడ్డి తాత 15-1-1993 కనుమ రోజు తమ భౌతిక దేహం వీడి సృష్టిచైతన్యంలో నిలచారు. వారి భౌతిక శరీరాన్ని కల్లూరులోని వారి స్వగృహములోనే సమాధిచేసి దానిపై పాలరాతి విగ్రహం ప్రతిష్ఠించటము జరిగింది. నేడు ఆ నివాసము ఎందరో భక్తులకు ఆవాసమైనది.

స్వామి సమాధి మందిరం కర్నూలు జిల్లాలో కర్నూలు పట్టణము వెలుపల కల్లూరు గ్రామములో కలదు.



(జనవరి 16వ తేదీ (కనుమ) గురువారము రోజు అవధూత శ్రీరామిరెడ్డి తాత ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **అవధూత శ్రీరామిరెడ్డితాత జీవితచరిత్ర**

సేకరణ : **శ్రీమతి సిహెచ్, కృష్ణవేణి**, విశాఖపట్నం.




# ఒక్క క్షణం !

"సాయి అన్న నామాన్ని ఉచ్చరించినంత మాత్రాన సప్త సముద్రాల అవతల ఉన్నా నేను నిన్ను రక్షిస్తాను" అన్న సాయి అభయంకోరి నేడు లక్షలాది మంది సాయిని ఆశ్రయించి తమ కోరికలు కష్టాలు తీర్చుకుంటున్నారు. దానికి ప్రతిగా సాయిని అనేక రకాలుగా ఆరాధిస్తున్నా సాయి సంతృప్తి చెందటం లేదు. అందుకే సాయి అన్నారు "నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవాడు ఒక్కడు కూడ నాకు కనిపించ లేదు. నాకు శిష్యుడు అన్న తగ్గవాడు ఒక్కడు కూడ లేడు. నా దగ్గరకు వచ్చేవన్నీ చెల్లని నాణేలే" అని అయితే చలామణి అయ్యే నాణెంలాగా మారి సాయి సంతృప్తి పడేలా జీవించాలి అంటే ఏమిచేయాలి? వారి గురువును సాయి సేవించినట్లు మనము సాయిని సేవించాలి! సేవించగలమా? సాయికి వారి గురువు మొట్టమొదట బంజారా రూపములో ఎదురైనా గుర్తించారు. ఆ తరువాత తనవెంట తీసుకువెళ్ళి బావిలో ఐదుగంటల పాటు తల్లక్రిందులుగా వ్రేలాడ దీసినా ఆనందాన్నే అనుభవించి, గురువుపై గౌరవాన్ని పెంచుకున్నారు. ఆ తరువాత ఒక గృహలోకి తీసుకువెళ్ళి తాను ధ్యానస్థులై ఉండిపోతే ఆయనకు అవసరమైన ఆహారం నోటికి అందిస్తూ, ఆయన విసర్జించిన మలమూత్రాలు శుభ్రంచేస్తూ కన్నార్పకుండా తన గురువును చుస్తూ కేవలం వేపాకు తింటూ 12 సంవత్సరాలు గడిపేరు సాయినాధుడు, మరి మనము అంతలా సాయిని సేవించగలమా? మన ప్రయత్నము చేత సాధించ లేనిది పొందటానికి భగవంతుడినో, సద్గురువునో ఆశ్రయించి కోరికలు, కష్టాలు తీర్చుకుంటూ అవి తీరిన ఆనందంలో జీవితం గడుపుతూ రాబోయే కాలంలో ఉద్భవించబోయే కోరికల సౌధాలను నిర్మిస్తూ వాటి పరిష్కారము కొరకు ఎవరిని (భగవంతుడినా లేక లౌకిక వ్యక్తులనా?) ఆశ్రయించాలి అని ఆలోచిస్తూ, మానసికంగా శారీరకంగా అలసి పోయే మనము, సాయి సంతృప్తి పడేలా వారిని సేవించగలమా? సకల జనావళిని ఉద్ధరించటానికై తనకు తాను దత్తం చేసుకున్న త్రిమూర్తి అవతారము, దత్తాత్రేయ స్వరూపులయిన సాయి నాధుడు మనందరిపై అవాజ్యమైన ప్రేమతో అత్యంతసులభమైన మార్గము బోధించారు. "నా చరిత్ర గానమే నీకు శ్రేయస్కరము నా చరిత్ర పారాయణ చేసేవారు ఇహపరముల గురించి ఆలోచించాల్సిన అవసరము లేదు, వారికర్మ నశిస్తుంది. చివరకు వారే నేనుగా మారిపోతారు" అన్నారు సాయి. సాయి కృపను పొందటానికి, వారి అనుగ్రహానికి పాత్రులై ఉత్తమ స్థితి పొందటానికి రాజమార్గము చరిత్ర పారాయణ. అంతటి ప్రాముఖ్యత కలిగిన పారాయణను మొట్ట మొదట మనకు అందించినది హేమాద్రి పంత్‌గా ప్రసిద్ధి కెక్కిన అన్నాసాహెబ్ ధబోల్కర్ 'ఆనోట ఈనోట' అలవోకగా విన్నవి ఏర్చికూర్చి కలగాపులగము చేసి తన అభిప్రాయాలను జోడించి పాఠకులను ఉత్కంఠతో, సంభ్రమాశ్చర్యాలతో, ముంచెత్తే విధంగా సాయి చరిత్ర వ్రాయలేదు. అంత సాహసముచేయలేదు చరిత్ర వ్రాయటానికి అనుమతి వేడటానికై సాయి దగ్గరకు శ్యామాతో కలసి వెళతాడు హేమాద్రిపంత్, శ్యామా ద్వారా చరిత్ర వ్రాయటానికి అనుమతి వేడుతాడు. అందుకు సాయి అంటారు "నా చరిత్ర అతను వ్రాసేదేమిటి! అవసరమైనప్పుడు నా చరిత్ర నేనే అతని చేత వ్రాయిస్తాను అంతవరకు ఇక్కడ జరిగే సంఘటనలను సేకరించి డైరీలో వ్రాసి ఉంచమను, అంత కన్నా ముందు అతనిలోని అహంకారమును పెరికివేసుకోమను" అంటారు సాయి ఆ మాటకు హేమాద్రిపంత్‌తో పాటు శ్యామా కూడ ఆశ్చర్యపోతాడు. గౌరవ మేజిస్ట్రేటు పదవిలో గల హేమాద్రిపంత్ ఒక సామాన్య మానవుడిలా నడి రోడ్డుపై సాయి పాదాక్రాంతమైనాడే, తన స్నేహితులు, ఉన్నతోద్యోగులు అయిన నానాసాహెబ్ చందోర్కర్, దీక్షిత్‌లను కూడ వదలి కేవలము ఐదో క్లాసు వరకు చదివి ప్రాధమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే తనను గౌరవిస్తూ చరిత్ర వ్రాయటానికి అనుమతి వేడమని తనను అభ్యర్ధించిన హేమాద్రిపంత్‌లో అహంకారము ఎక్కడుందా అని ఆలోచనలో పడతారు శ్యామా.

**మనము గమనించలేనిది, సద్గురువు మాత్రమే గమనించ గలిగే విధముగా మనలో అహంకారము చోటుచేసుకొని ఉంటుంది.** అది తెలుసుకొని తొలగించుకొనే శక్తిని ప్రసాదించమని వేడుతూ చేతులు జోడించి వినమ్రుడై నిలబడతాడు హేమాద్రిపంత్.

నియమముగా పారాయణ చేస్తున్నామనో, పూజలు చేస్తున్నామనో, గురువారాలు తప్పని సరిగా ఎటువంటి పరిస్థితులలోనైనా ఉపవాసముంటున్నామనో, ప్రతి ఏడాది నియమముగా శిరిడీ వెళ్ళి వస్తున్నామనో, సాయి పై భక్తితో కలిగిన భావన క్రమేపీ నేను చేస్తున్నానుగా మారి, నేనేచేస్తున్నా అన్న భావంలోకి, అహంలోకి దించుతుంది. అందుకే సాయి సూక్తులలో ఎక్కువగా కనిపించేది నీలోని అహాన్ని చంపుకోమని. వినమ్రుడై సాయి ఎదుట నిలచిన హేమాద్రిపంత్‌కు తనలోని అహంకారాన్ని గుర్తించి తొలగించుకొనే అద్భుత సంఘటన ఒకటి జరిగింది ఆ సంఘటన ద్వారా సర్వవ్యాపియైన సద్గురువును గమనించే అద్భుత



అవకాశం ఒకటి హేమాద్రిపంత్‌కు కలిగింది. ఆ సన్నివేశంలో శ్యామాకూడ ఒక పాత్ర కావటం సాయిచేసిన చమత్కారం

ప్రతి ఆదివారము శిరిడీలో సంత జరుగుచుండేది ఆ కారణంగా చుట్టు ప్రక్కల పల్లె వాసులు కూడ శిరిడీ వచ్చి క్రయవిక్రయాలు జరుపుకొని వెళ్ళెడి వారు. ఆ రోజు సాయి సన్నిధి కూడ భక్తులతో కిటకిటలాడి పోయేది, ప్రత్యేకించి మధ్యాహ్న సమయానికి అత్యధికంగా ప్రజలు బాబా దగ్గరకు చేరేవారు. ఆదివారము సెలవు దినము కావటంతో నానాసాహెబ్ చందోర్కర్, దీక్షిత్, దాసగణు, హరి వినాయక్ సాఠే మొదలైన ఉద్యోగస్తులు కూడ సాయిసన్నిధి చేరేవారు. ఒక ఆదివారము నాడు భక్తులందరూ సాయిచుట్టూ మశీదులో ఆశీనులై ఉన్నారు. ఆ సమయంలో హేమాద్రిపంత్ బాబా పాదాలు ఒత్తుతూ, మనస్సులో నామ జపం చేసుకుంటున్నాడు. చుట్టూ, శ్యామా, దీక్షిత్, బూటీ మొదలైనవారు కుర్చొని ఉన్నారు. ఉన్నట్లుండి సాయి పాదాలు ఒత్తుతున్న హేమాద్రిపంత్ ధరించిన కోటు చేతిమడతలలో నుంచి శనగగింజలు క్రింద పడి బాబా పాదాల వద్దకు చేరినయ్యి, చుట్టూ ఉన్నవారు ఆశ్చర్యపోతూ, వెంటనే బాబా ప్రసాదంగా భావించి శనగ గింజలను ఏరుకోని తినేశారు. ఆ వెంటనే శ్యామా, హేమాద్రి పంత్‌తో "ఏమి అన్నాసాహెబ్! అందరూ కోటు జేబులో తినుబండారాలు దాచుకొని వస్తే నీవు చేతిమడతలలో దాచుకొని వచ్చావే, ఏది మరోసారి నీ చేయి విదుల్చు" అనగా హేమాద్రిపంత్ చేయి విదల్చగా మరికొన్ని శనగ గింజలు నేలరాలినయ్యి, అందరూ ఆశ్చర్యముతో శనగ గింజలు అక్కడకు ఎట్లు చేరినవా అని ఆలోచించుచున్నారు. ఆ సంఘటనకు ఆశ్చర్యపోవటం హేమాద్రిపంత్ వంతు అయింది. వెంటనే శ్యామా సాయితో "చూసేవా సాయి! హేమాద్రిపంత్ ఎంతటి టక్కరో జేబులో దాచుకుంటే మాకు తెలుస్తుందని, మా అందరికీ పెట్టాల్సివస్తుందని శనగ గింజలు కోటు మడతలో దాచుకోని వచ్చారు" అన్నారు. అందుకు సాయి "అవును అన్నాసాహెబ్(హేమాద్రిపంత్)కు ప్రతిది తానొక్కడే తినే దుర్గుణము కలదు, అందుకనే ఈ రోజు సంతలో శనగలు కొని తానొక్కడే తింటూ ఇక్కడకు వచ్చాడు, మిగిలినవి దాచి ఉంటాడు, ఇందులో ఆశ్చర్యమేమున్నది? అతని నైజము తెలిసినదే కదా!" అన్నారు సాయి. శ్యామా మాటలకే ఆశ్చర్య పోతున్న హేమాద్రిపంత్, శ్రీసాయి కూడ వత్తాసు పలకటంతో పట్టరాని కోపంతో "నేనెప్పుడు ఒంటరిగా ఏమి తినను, అందరి మాటలు విని, సాయి మీరు కూడ నాపై లేనిపోని నిందమోపుతున్నారు, ఇన్ని రోజుల నుంచి ఇక్కడకు వస్తున్నా నేను ఏనాడు సంతకు వెళ్ళలేదు. ఏమైన తీసుకురాదలచినచో ఇంటి దగ్గర నుండే తెస్తాను, అటువంటప్పుడు అసలు సంతకిపోని నేను శనగ గింజలు ఎట్లా కొన్నాను? ఎప్పుడు తిన్నాను? ఇతరులకు పెట్టకుండా ఎందుకుదాస్తాను? అయినా దగ్గరున్న వాళ్ళకు పెట్టకుండా దాచుకోని తినే గుణం నాకు లేదు పైగా నీకుపెట్టకుండా ఎప్పుడూ ఏమీ నేను తినలేదు కదా సాయి'' అన్నాడు హేమాద్రిపంత్. వెంటనే సాయి అతనిని అనునయిస్తున్నట్లు "అవును నీవన్నది నిజమే, నీవు ఎప్పుడు సంతకు పోనిమాట నిజమే, శనగ గింజలు కొనని మాట నిజమే, ఒకవేళ ఏదైనా తినుబండారము కొన్నా, ప్రక్కన ఎవరైనా ఉంటే వారికి పెట్టకుండా తినవు. నీవు తినే సమయానికి వారు నీ చెంత లేనపుడు వారికి నీవెట్లా పెట్టగలవు? మిగిలినవారి సంగతి వదిలివేయి. మరి నేను ఎప్పుడూ నీ చెంత లేనా! మరినాకు పెట్టకుండా ఎప్పుడు ఏమి తినలేదా? పోనీ కనీసం తినే సమయాన నన్ను స్మరించనైనా స్మరించావా! నేను అందరి లాంటివాడినేనా నీదృష్టిలో'' అన్నారు సాయి. ఒక్కసారిగా మాన్పడి పోయాడు హేమాద్రిపంత్, తాను సేకరిస్తున్న సాయి లీలల్లో సకల జీవ స్వరూపి అయిన సాయి సర్వాంతర్యామి తత్వాన్ని గమనించాను పైగా "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడనుకునేవాడు నన్నసలు చూడనట్లే నీవు చూసేదంతా కలసి నేను" అని శ్రీసాయి బోధించారు! ఒక హోలి పండగ నాడు భోజనానికి మీ ఇంటికి వస్తానని కలలో చెప్పిన సాయి, అలా ఫోటో రూపంలో వచ్చి, తనకు తన ఫోటోకు కూడ బేధము లేదని నిరూపించారే, అహంతో అదీ మరచానే, సర్వవేళల ఇంట్లో ఫోటో రూపంలో, జేబులో ఫోటో రూపంలో, వేలికి ఉంగరం రూపంలో అనేక రూపాలలో సాయి నాతోనే ఉన్నాడే, నిజంగా నేను ఆహారము స్వీకరిస్తున్న ప్రతిసారి సాయిని స్మరిస్తున్నానా, పైగా "నీవు చూసేదంతా కలసి నేను" అని చెప్పటమే కాక సకల జీవులలో తానున్నానని సాయి నిరూపించారే, మరి సాటి జీవులు నా చెంత లేనిదెప్పుడు వాటికి ఎప్పుడయిన అర్పించానా! సాయి గురించి నాకు బాగా తెలుసు అనుకున్నాను గాని, నిరంతరము అనేక రూపాలలో నా చుట్టూ, నాతో, చివరకు నాలో ఉన్న శ్రీ సాయిని కూడ గమనించలేకపోయినానే, అందుకే సాయి, చరిత్ర వ్రాసే ముందే నాలోని అహాన్ని తొలగించుకోమంది! దయామయా! కృపాసాగరా! ఎంత అద్భుతమయ్యా నీ బోధ, ఒంటరిగా తెలియజేస్తే నా ఒక్కరికే తెలుస్తుంది, నలుగురిలో బోధించటం ద్వారా ఆ బోధ వారి వారి సంస్కారాలననుసరించి, వారికి బోధ పడటమే కాక, నాలో ఏమూలో దాగిఉన్న అహాన్ని పైకి లేపి చివరికంటా పూర్తిగా తొలగించటమే నీవు చేసే పని. నిరంతరము నీ కృపానుగ్రహము పొందుతూ నీవు చేసే బోధలను అర్ధంచేసుకొనిఆచరణలో పెట్టే శక్తిని ప్రసాదించు సాయి"అంటూ సాయి పాదాలు అంటేడు హేమాద్రిపంత్.

సాయి విగ్రహరూపంలో గుడిలోనే ఉన్నాడు అని అనుకునే వారికి, ఫోటో రూపంలో పూజగదిలో మాత్రమే ఉన్నాడు అని అనుకుంటూ సాయి పేరును స్మరిస్తూనే, సర్వహీన కార్యాలను చేసే ప్రతి ఒక్కరికి సాయి చేసిన బోధ అది, సర్వకాల సర్వావస్థల యందు మీతో ఉండి మీరు చేస్తున్నవి నేను గమనిస్తున్నాను నా పేరు స్మరించే ముందు అది గుర్తుంచుకోమని సాయి చేసిన

హెచ్చరిక అది. ఆబోధ ఒక్క హేమాద్రిపంత్‌కు మాత్రమే కాదు, అతనిని నిమిత్తమాత్రుడిగా చేసుకొని శ్రీసాయి మనందరికీ చేసిన బోధ. అష్టోతరములో సర్వాంతర్యామినే నమః, సర్వవ్యాపినే నమః అని రోజూ చదువుతాము, కాని గుర్తెరిగి జీవించమని సాయి బోధ. "నాకు అర్పించకుండా ఎవరు ఏమీ తినరో వారికి నేను బానిసను, అన్ని జీవులలో నేనే ఉన్నాను, వాటిని ఆదరించినా, ఈసడించినా నాకే చెందుతుంది" అన్నారు జగద్గురువు అయిన శ్రీసాయిబాబా. ఒక ముద్ద ఆహారం మననోటిలోకి వెళుతుంది అంటే అనేక జీవుల సమిష్టి సహకారం.

అది గుర్తెరిగి కృతజ్ఞతతో, నీవు ఏమితిన్నా ముందు ఒక పిడికెడు బయటవిడిచి పెట్టిరా, తద్వారా నీవు లక్షలాది మందిని సత్కరించినట్లే అన్నారు శ్రీసాయి. ఇక నుంచి ఏమి తినబోతున్నా, త్రాగబోతున్నా ఒక్కక్షణం శ్రీసాయిని స్మరించి, ఆపనికి ఉపక్రమిద్దాము. "సర్వ భూత హితే రతే" అనే శ్రీసాయి బోధను ఆచరణకు ఉపక్రమించే ప్రతి ఒక్కరికీ శ్రీసాయి తన చేయూతనిచ్చి ముందుకు నడిపించమని ప్రార్థిస్తూ..

నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

**- వి.వి.పూర్ణచంద్రరావు**

# శ్రీ దక్షిణామూర్తి

బ్రహ్మ జగత్సృష్ట్యాదిలో తన మానస పుత్రులగు సనకసనందనాదులను చూచి, సృష్టిక్రమంలో నియోగిస్తే వారు దానియందు విరక్తులై నిరాకరించి సుర, మునిగణ పరివృతులై నందనవనమందుండి జ్ఞానోపదేశం చేసేవారెవరని యోచిస్తుంటే, నారదుడు వచ్చి "బ్రహ్మ కన్న బ్రహ్మోపదేశకర్త లెవరున్నారు? పోదాం బయలుదేరండి'' అన్నాడు. సరే మంచిదని దేవతాసమూహంతో కదలి సత్యలోకానికి వచ్చారు. బ్రహ్మకెదురుగా సమీపంలో కూర్చుని, వాణి వీణ వాయిస్తూ పాడుతున్నది. "ఆహాహా!" అంటూ ఆనందంతో తల ఊపుతూ తాళం వేస్తున్నాడు బ్రహ్మ. ఆడదాని పాటకామోదించే అయ్యగారు ఆధ్యాత్మికతత్వం ఏమి బోధిస్తాడని వారంతా యోచిస్తుంటే "పదండి వైకుంఠానికి" అన్నాడు నారదుడు. వారదేమని యోచింపక వైకుంఠానికి నడిచారు. లోపలి సౌధంలో ఉన్నాడు ప్రభువు. చొరవగలవాడు గదా నారదుడు, "చూచి వస్తానుండండి" అని చొచ్చుకొని లోపలకు వెళ్ళాడు. రవంతలో తిరిగివస్తే "ఏమయ్యా!" అన్నారు వీరు. "అక్కడ సరస్వతీ అమ్మవారు తాకకుండా కూర్చుని పాడుతుంటే, ఇక్కడ పక్కలోనే కూర్చుని పాదాలొత్తుతున్నది. ఇది మరీ అన్యాయం. కాంతాకటాక్ష పాశాల్లో కట్టుబడ్డ ఈ సంసారి మాత్రం మనకేం సహాయం చేస్తాడు? ఈ పట్నం, ఈ వైభవం చూడండి ఎట్లాగున్నదో, చాలునిక శంకరుని ఆశ్రయిద్దాం రండి" అన్నాడు నారదుడు.



అంతా హిమాచాలాభిముఖులై నడిచారు. కైలాస పర్వతం చూచి, గంపంత ఆశతో అంతా ఎక్కారు, నిండు సభలో శంకరుడు అర్ధనారీశ్వరుడై తాండవనృత్యం చేస్తున్నాడక్కడ. విష్ణువు దుబుకు దుబుకంటూ ఢోలు వాయిస్తుంటే, బ్రహ్మ తాళం వేస్తున్నాడు. వీరది చూచి, "అవ్వ!' అని నోరు మూసుకొని, "ఓహో! ఇతడూ స్త్రీ లోలుడే. బ్రహ్మ స్త్రీని తాకకుండా ఉంటే, విష్ణువు తాకుతూ ఉన్నాడు. ఈయన శరీరంలోనే ఇముడ్చుకున్నాడు, ఇంకా ఘోరం చాలు చాల"ని చక్కాపోయినారు. శంకరుడది గ్రహించి "అయ్యో! స్త్రీలతో కలసి ఉన్నంతనే జ్ఞానరహితులని తలచి ముమ్మూర్తులను తిరస్కరించారే! ఏమి భ్రమ! తీవ్ర జిజ్ఞాసా పరులైన వీరికిక బోధించువారెవరు?" అని చింతించి, తపస్సనే నెపంతో పార్వతిని పంపి, దయామయుడైన శంకరుడు ఆ సనకసనందనాదులు పోయే మార్గమధ్యమందు మానససరోవరోత్తమ భాగంలో ఉన్న వట వృక్షం క్రింద దక్షిణామూర్తిగా, యువకుడై చిన్ముద్రతో, దక్షిణాభిముఖంగా కూర్చున్నాడు.

ఈ కథ శివరహస్యం, దశమాంక ద్వితీయాధ్యాయంలో దక్షిణామూర్తి ప్రాదుర్భావం అన్న శీర్షికలో ఉన్నది. దక్షిణామూర్తి ప్రాదుర్భావమంటే వారి పుట్టుక, అసలు వారికి పుట్టుక ఏది? శివుని పంచమూర్తులలో అదొకటి. మౌనముద్రతో దక్షిణాభిముఖంగా కూర్చున్నారన్నమాట. అంతరార్థం, ఆ మూర్తినే సూచిస్తుంది. దక్షిణామూర్తి అష్టకంలో వర్ణించింది అంతా ఆ మూర్తినే. శ్రీ, దక్షిణ, అమూర్తి. 'శ్రీ' అంటే మాయాశక్తి. 'దక్షిణ' అంటే సమర్థుడైన అని ఒక అర్థం. దక్షిణ భాగమైన హృదయమందని ఒక అర్థం. 'అమూర్తి' అంటే మూర్తి లేనివాడు అని అర్థం. "జగత్సృష్టికర్తయైన బ్రహ్మమానసపుత్రులగు సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులనబడు నలుగురు జగత్సృష్టాది కార్యములకై, తాము సృజింపబడినది తండ్రివలన విని, దానియందు విరక్తిగలవారై, ఉపశాంతినపేక్షించి, అది తెలుపగలవారిని వెదుకుచు బోవగా, ఆ తీవ్ర జిజ్ఞాసువుల యందు పరమ కారణ్యము కలిగి, సాక్షాత్ పరమేశ్వరుడు దక్షిణామూర్తిగా, మౌనమైన స్వస్థితితో వటవృక్షము క్రింద చిన్ముద్రాంకితుడై యుండుట గాంచి, వారు అయస్కాంత సమీపమున ఇనుమువలె ఆకర్షింపబడి వారి సన్నిధిలో ఉండిపోయిరి.

(ఫిబ్రవరి 21వ తేదీ శుక్రవారము మహాశివరాత్రి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి వై. సాయిశిరీష**, బెంగుళూరు

# సమాధిచెంత - సమాధి స్థితి

1963వ సంవత్సరము ఫిబ్రవరి నెల 9వ తేదీ, తూర్పుదిక్కున వెలుగు రేఖలు విచ్చుకొనే సమయంలో గాఢ సుషుప్తిలోంచి లోకం మేలుకొంటున్న సుప్రభాతవేళ.

అనుభవమే తన భాషగా, అరవయేళ్ళ తన దివ్యలీలా ప్రబోధంతో, తన పాదస్పర్శతో, ఉచ్ఛ్వాస నిశ్వాసలతో శిరిడీ నేలనూ, గాలిని నిత్య శుద్ధ మొనర్చిన సాయినాథుడు అమరుడై తన దేహ ధాతువుల ద్వారా అనుక్షణము లోకపావనములైన అనుగ్రహ వీక్షణాలను, జ్ఞాన కిరణాలను ప్రసాదించి మాస్టరుగారికిచ్చిన దివ్యానుభవమే ఈనాడు మనందరినీ కలిపింది. ఇంతకూ ఆ అనుభవమేమిటో వారి మాటల్లో.......



"ఆ ఉదయం తీవ్రమైన ఆకలితో మెలకువ వచ్చింది. తొందరగా ముఖం కడుక్కొని ఫలహారం చెయ్యడానికి మద్రాసు హోటలుకు బయలుదేరాను. సమాధి మందిరం ముందుగా వెళ్తూ, ఉదయ హారతి అయిపోయి వుండటం వల్ల మందిరం అంతా నిర్మానుష్యంగా ఉండటము గమనించాను. నా దృష్టి, జీవకళతో కళకళలాడుతున్న విగ్రహం మీద పడడంతో దానిని పరీక్షగా కొంతసేపు గమనించాలని కుతూహలం కలిగింది. వెంటనే మందిరంలో ప్రవేశించి విగ్రహం కేసి చూశాను. కొద్దిక్షణాలలో నా దృష్టి విగ్రహం ముఖం మీద నిలిచింది. ఆ విగ్రహంలో వ్యక్తమైన ముఖకవళికల నుండి శ్రీసాయి యొక్క మనస్తత్వాన్ని అర్థం చేసుకోజూచాను. అప్పుడు వారి దృష్టి ఎవరి మీదా పడక, అంతర్ముఖమై, ఏదో అతీతమైన స్థితిలో వున్నట్లు నాకు తోచింది. 'ఆస్థితి ఎటువంటిదై వుండవచ్చు?' అని గమనిస్తుండగా కొంతసేపటికి నాకొక భావం కలిగింది. 'ఆస్థితిలో ఆయనకు సృష్టి తననుంచి అన్యంగా తోచి వుండదు. ఆయన తాను శరీర పరిమితుడనన్న భావాన్ని విస్మరించి, ఈ చరాచర విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంలో సంకల్ప మాత్రంగా వున్నదో ఆ చైతన్యంతో తాదాత్మ్యం చెంది వుండవచ్చు' అనిపించింది. ఈ భావాలు నాలో కేవలం యోచనలుగా కాక ఒకానొక అతీతమైన అనుభవాన్ని మేల్కొల్పాయి. 'ఆ మహత్తర చైతన్యంతో తాదాత్మ్యాన్ననుభవించటం ఎంత అద్భుతంగా వుంటుందో గదా! ఆ మహత్తర చైతన్యంలో ఉద్భవించిన సంకల్పమే ఈ జగత్తైతే, నేను కూడా ఆ సంకల్పంలో భాగమే కదా! ఈ శిరిడీ గ్రామము, సమాధి మందిరము, నాచుట్టూ వున్న భక్తులూ, ఆ సంకల్పంలోని భాగమే కదా! అంతేగాక నాలో కలిగే ఈ భావాలు ఇప్పుడు నాకు గోచరించేదంతా ఆ సంకల్పంలోని భాగమే అయిన నాలోని భావాలు! ఎంత చిత్రం!!' అనిపించింది. అప్పుడు ఇవి మామూలు భావాలుగా కాక ఒక చిత్రమైన అనుభూతిగా నా హృదయాన్ని కలచివేశాయి. అప్పుడు నా లోపల బయట ఏమి జరుగుతున్నదో నాకేమీ తెలియలేదు. అయినప్పటికీ ఒక అనిర్వచనీయమైన అనుభవాన్ని నేను స్పష్టంగా పొందుతున్నాను. ఆ కారణంగా బాబా చైతన్యం సర్వవ్యాపకమనీ, సర్వజ్ఞమని తోచింది. బాబా తత్వమే, నా తత్వమని తెలియగానే కళ్ళు మూతపడి ఒక వింతైన ఆనందంతో గొప్ప పులకింత కల్గి మనస్సు ఆ భావంలో నిలచిపోయింది."

అంతే, ఆ అనుభవంతో వారి జీవనగతి ఒక్కసారిగా మారిపోయింది. వారి నమ్మకాలలో మార్పు వచ్చింది. అంతవరకూ ఈ అనంత సృష్టికి ఒకానొక దివ్యశక్తి ఆధారమని, చైతన్యం దాని లక్షణమని, తమలోని దైవమనే భావానికదే ఆధారమని మాస్టరుగారు నమ్మేవారు. మానవుడు కృషితో తపస్సుతో తన చైతన్యస్థాయిని అధిగమించాలనేది వారి భావం. అంతే కాదు సాధన ఎవరికి వారు చేసి సాధించవలసిందే.

అందుకనే శిరిడీ వెళ్ళకముందు "శ్రీ సాయిబాబా గొప్ప వారే. అయితే ఏం? వారు తపస్సు చేసి అంతవారయ్యారు. మనమూ తపస్సు చేస్తే అలానే కావచ్చు. అంతేగాని వారి కాళ్ళమీద పడటం వల్ల ఉపయోగమేముంటుంది" అని వాదించే వారు.

ఆ అనుభవం తర్వాత మహాత్ములు ఎంతో ప్రభావ సంపన్నులని, కేవలం ఒక స్పర్శతో, చూపుతో భావంతో సమాధి నుండి కూడా మహత్తర దివ్యత్వాన్ని ప్రసాదించ గలరని అనుభవాని కొచ్చింది. అంతవరకున్న భావాలు ఎంత అర్థం లేనివో స్పష్టమైంది. అపుడాయన దివ్యత్వానికి శరణాగతులయ్యారు.

మాస్టరు గారి అనుమానానికి తావేలేని అనుభవం ప్రసాదించారు శ్రీ సాయి. వారే తానుగా మారిపోయిన మహత్తర దివ్యానుభవమది. నిజానికి దానికి మాటలే లేవు; భాష చాలదు. అనుభవానికొచ్చిన అక్షర సత్యమది. ఈ అనుభవం తర్వాత వారి బాహ్య, అంతరాల్లో గొప్పమార్పు వచ్చింది. కన్నులలో గొప్ప వెలుగు, ముఖంలో ప్రసన్నత, వారి సన్నిధిలో గొప్ప శాంతి, అందరికీ అనుభవమయ్యేది. ఎదుటి వారి అంతరంగం స్పష్టంగా అర్థమయ్యేది. ఎంతటి క్లిష్ట సమస్యకైనా తృటిలో పరిష్కారం తోచేది. ఆ తర్వాత అదే అన్నిటికంటే శ్రేష్ఠమని నిరూపణయ్యేది. ఎంత ఆహారం తిన్నా జీర్ణమయ్యేది. ఏంతినకున్నా నీరసం ఉండేదికాదు. ఎన్నిరోజులు నిద్రలేకున్నా ఎంత శ్రమచేసినా అలసిపోవటం ఉండేదికాదు.

సజాతీయ భావపరంపరయే ధ్యానం కనుక ఆ భావపరంపరలనే అలలు, అంతరంగంలో లయించినపుడు కలిగే అనుభూతియే ''సమాధిస్థితి'' అని, సాధనలో, పరిపక్వత సిద్ధించటమని శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి వంటి వారు బోధించారు. మాస్టారుగారు పొందినది ఆ సమాధిస్థితే.

సౌజన్యం: **'సన్నిధి'** వ్యాసకర్త : **శ్రీ అల్లు భాస్కరరెడ్డి,** నెల్లూరు

# జిజ్ఞాస

శ్రీరామకృష్ణ పరమహంస వివిధ సందర్భాలలో భక్తుల సందేహ నివృత్తికై అందించిన జ్ఞానామృతాన్ని ఫిబ్రవరి 19వ తేదీ శ్రీరామకృష్ణ పరమహంస జయంతి సందర్భముగా శ్రీ రామకృష్ణ బోధామృతం సౌజన్యంతో మీకందిస్తున్నాము.

– సంపాదకుడు

**ప్రశ్న : మాయ అంటే ఏమిటి?**

**పరమహంస :** ఆధ్యాత్మిక పురోగతికి అడ్డం వచ్చే కామమే – మాయ అంటే. భగవంతునిలో విద్యామాయ, అవిద్యామాయ రెండూ ఉన్నాయి. విద్యామాయ భగవదున్ముఖం చేస్తుంది. అవిద్యా మాయ పక్కకు తీసుకుపోతుంది. జ్ఞానం, భక్తి, వివేకం, దయ ఇవన్నీ విద్యామాయ లక్షణాలు. వాటి సహాయంవల్లే మానవుడు మాధవుణ్ణి చేరుకోగలడు.



భగవంతుని కోరేవాళ్ళు, ఆధ్యాత్మిక సాధనల్లో పురోభివృద్ధి కోరేవాళ్ళు కామినీకాంచనాల పాశాలనుంచి జాగ్రత్తపడాలి. కాకపోతే వాళ్లు విముక్తి పొందలేరు. 'కామినీ – కాంచనాలు' ప్రపంచాన్నంతా పాపంలో ముంచివేసినాయి. స్త్రీని దివ్యజననీ స్వరూపమనే దృష్టితో చూస్తే పాశాలు నశిస్తాయి. 'కామినీ – కాంచన' తృష్ణ అంతరించే వరకు భగవంతుణ్ణి దర్శించలేం. డబ్బు ఎవరికి బానిసో అతడే నిజమైన మానవుడు. కాని డబ్బును సరిగా ఉపయోగించటం తెలియని వారు మానవులని పిలవటానికే అనర్హులు.

**ప్రశ్న : 'అహంకారం' అంటే ఏమిటి? దానిని జయించటము ఎట్లా?**

**పరమహంస :** అహంకారం రెండు రకాలు. ఒకటి పక్వాహంకారం. రెండవది అపక్వాహంకారం. నాది అనేది ఏదీ లేదు. నేను చూసేది, వినేది, భావించేది, చివరకు శరీరం కూడ నాది కాదు. నేను శుద్ధుణ్ణి, బుద్ధుణ్ణి, ముక్తుణ్ణి అనే భావాలు 'పక్వాహంకారం' వల్ల కలుగుతాయి. 'ఇది నాయిల్లు', 'ఇది నాబిడ్డ', 'ఈమె నా భార్య' అనేటువంటి భావాలు అపక్వాహంకారం వల్ల వస్తాయి.

'నేను' తొలగిపోయి, 'నువ్వు' అనేదానికి చోటు యివ్వాలి. మానవుడికి ఆధ్యాత్మిక ప్రబోధం కలిగేవరకు ఇది సాధ్యం కాదు.

**ప్రశ్న : గ్రంథపారాయణ ఎలా చేయాలి?**

**పరమహంస :** గ్రంథం అంటే పుణ్య గ్రంథం మాత్రమే కాదు. అది సాధారణంగా 'గ్రంథ' (ముడి) కూడ అవుతుంది.సత్యాన్ని దర్శించాలనే ఆకాంక్షతో గర్వాన్ని విడిచిపెట్టి అధ్యయనం చెయ్యకపోతే కేవల గ్రంథపఠనం అనేది పాండిత్యానికి, ఆవిర్భావానికి, అహంకారానికి చోటిచ్చి, మనస్సుకు భారమౌతుంది. అది అనేకమైన ముడులతో సమానం.

దేనివల్ల భగవంతుని తెలుసుకుంటామో అది ఉత్తమజ్ఞానం. పవిత్ర గ్రంథాలు, వేదాంతం, తర్కం, వ్యాకరణం, మొదలైనవి ఉత్తమజ్ఞానాన్ని కల్గించినప్పుడే అవి మంచివి.

**ప్రశ్న : ప్రపంచంలో ఎలా జీవించాలి?**

**పరమహంస :** చేతికి నూనె రాచుకొని పనసపండు ఒలిస్తే, దాని పాలజిగురు నీ చేతులను అంటుకొని, యిబ్బంది కల్గించదు. పరమాత్మజ్ఞానంలో రక్షణ కలిగించుకొని, భోగభాగ్యాలమధ్య నివసిస్తే అవి నిన్నేవిధంగాను బాధించవు.

సూదంటురాయి సూది ఉత్తరదిశనే సూచిస్తుంది. అందువల్ల ప్రయాణం చేసే పడవలు దారి తప్పవు. హృదయం భగవంతునివైపు తిరిగి వున్నంత వరకు సంసారసాగరంలో కొట్టుకొనిపోడు.

**ప్రశ్న : ఆధ్యాత్మిక జీవనం సాగించటానికి దోహదం చేసేవి ఏవి?**

**పరమహంస :** కర్రతో అంచెలు కట్టకుండా భవన నిర్మాణం చెయ్యడం అసాధ్యం. పని పూర్తయిన తర్వాత దాని అవసరాన్ని ఎవరూ పట్టించుకోరు. అదేవిధంగా ప్రారంభ దశలో విగ్రహారాధన అవసరంగాని తదుపరి కాదు.

ఆవు శరీరంలో రక్తం ద్వారా పాలు, దాని శరీరమంతా వ్యాపించి వున్నాయి. కాని దాని చెవులనుగాని, కొమ్ములనుగాని పితకటంవల్ల పాలు యివ్వలేవు. దాని పొదుగులోనుండే పాలు వస్తాయి. అదేవిధంగా భగవంతుణ్ణి అన్నిచోట్ల చూడలేవు. ప్రాచీనకాలంనుండి భక్తుల ఆధ్యాత్మిక సాధనలవల్ల, వారి జీవితాలవల్ల నిండిన పుణ్యదేవాలయాల్లో భగవంతుడు అధికంగా ప్రస్ఫుటమౌతాడు.


కొలిమి ఊదుతూ కమ్మరవాడు నిప్పును ప్రజ్వలింపజేస్తునట్లు, సజ్జన సాంగత్యంతో మనస్సును పవిత్రంగాను, ప్రకాశవంతంగాను వుంచాలి.

'నామం' కూడ ఆధ్యాత్మిక జీవనానికి సహకరిస్తుంది. సత్యభామ తన నగలన్నింటితోనూ భగవంతుని తూచలేకపోయింది. కాని రుక్మిణి కృష్ణనామంతో, తులసి దళాన్ని త్రాసు రెండవవైపు వేసి తూచగలిగింది.

భగవంతుణ్ణి దర్శించాలంటే, భగవన్నామ జపంలో పూర్తి విశ్వాసముంచు. నిత్యానిత్య వివేకం కూడ చెయ్యి. భక్తితో భగవన్నామాన్ని కీర్తించు. కొండంత దూదిమీద పడే ఒక నిప్పురవ్వ దాన్ని భస్మం చేసినట్లు, భగవన్నామంవల్ల పాపపర్వతం మటుమాయం అవుతుంది.

# బాల వికాసం - సత్యమేవజయతే

ఒక ఊళ్ళో ఒక ఆవు ఉండేది. అది అందరితో చాలా మంచిగా, కలహించుకోకుండా, యజమాని మెప్పినట్లు నడుచుకుంటూ సాధు జంతువుగా నమ్మకంగా ఉండేది. ఒకరోజు అది అడవిలో మేతమేస్తుండగా, బాగా ఆకలితో అటు వచ్చిన పులి కంట బడింది. పులి ఎంతో అందంగా బలంగా నిగ నిగ లాడుతున్న ఆవుచూడగానే అప్పటివరకు పులికి ఉన్న ఆకలి ఒక్కసారిగా విజృంభించి ఆవుపైకి దూకబోయింది. ఇది గమనించిన ఆవు "ఆగు ఆగు పులిరాజ నేను చెప్పేమాటలు కొంచెం ఆలకించు... నాకు ఇంటి వద్ద చంటి దూడ ఉంది అది ఇంకా లోకం గురించి పూర్తిగా తెలుసుకోలేదు నేను ఈ పూట దాని ఆకలైనా తీర్చలేదు నీవు దయ తలిస్తే, నేను వెళ్ళి నా బిడ్డకి కడుపు నిండా పాలిచ్చి వస్తాను" అని వేడుకుంది. "ఓహో ఎంత నమ్మకంగా పలుకుతున్నావు, చేతికి దొరికిన ఆహారాన్ని వదలడానికి నేనేమన్న పిచ్చిదాన్నా, చాలా ఆకలిమీదున్నాను నీ మాయమాటలకి పడిపోయి నిన్ను వదుల్తా ననుకున్నావా" అన్నది ఆకలితో ఉన్న పులి. "నన్ను నమ్ము నేనెప్పుడూ అసత్యమాడలేదు. నువ్వుదయతలిస్తే వెళ్ళి నా బిడ్డకి కడుపునిండా పాలు ఇచ్చివస్తాను. నిన్ను మోసగించి నేను బతకగలనా, అయినా ఆ అసత్యపు జీవితం నాకు ఏల ఆకలితో అలమటిస్తున్న నీకు ఆకలి తీర్చడం కన్నా పుణ్యకార్యముందా నన్ను నమ్ము" అన్న ఆవు మాటలలోని సత్యాన్ని గ్రహించదలచిన పులి "సరే వెల్లు కాని మళ్ళీ తిరిగిరాకపోయావో ఈ రోజుకాకపోయినా మరునాడు నువ్వు నాకు చిక్కకపోవు అప్పుడు కసితీరా చంపుతాను" అన్న పులి మాటలకు సంతోషించిన ఆవు, త్వరితగతిన తన నివాసం చేరుకొని, తన బిడ్డకి కడుపునిండా పాలిచ్చి "బిడ్డా ఇదే నా ఆఖరిచూపు. మంచి దానిగా మసులుకో, బుద్ధిమంతురాలుగా యజమానికి సహకరించు, తోటి వారితో సఖ్యంగా ఉండు గొడవలొద్దు. జీవితంలో ఎప్పుడూ అబద్ధం ఆడరాదు, సత్యాన్నే పలుకు అది నీకు మేలు చేస్తుంది. అందరిలోకి మంచిదానవుగా పేరు తెచ్చుకో జీవితాన్ని సార్థకం చేసుకో " అని హితము చెప్పి అడవికి బయలుదేరింది. అడవిలో ఆవు రాకకోసం అసహనంగా ఎదురుచూస్తున్న పులి, దూరంగా ఆవు రావడం కనిపించి ఆశ్చర్యపోయింది. "ఆహా ఈ ఆవు ఎంత నమ్మకమైనది. అన్న మాట ప్రకారం నాకు ఆహారంగా అడవికి తిరిగి వస్తుంది. తన ప్రాణం కంటే ఇచ్చిన మాట ముఖ్యం అని అన్న ఈ ఆవు ఎంత గొప్పది. ఇలాంటి సత్యవచనురాలిని చంపితే నాకు పాపం తప్పదు" అనుకుంది. ఆవు దగ్గరకి రాగానే "ఓ మహోత్తమురాల నువ్వు ఎంత సత్యవచనురాలివి ఇచ్చిన మాటకోసం ప్రాణాలు లెక్కచేయక నాకు ఆహారమవడానికి వచ్చిన నిన్ను చంపితే నాకు మహా పాపం



చుట్టుకుంటింది. నిన్ను హేళన చేసినందుకు నన్ను మన్నించు నా అకలి ఈ రోజు కాకపోతే రేపు ఏదో విధంగా తీర్చుకుంటాను నువ్వు ఇంటికి పోయి నీ బిడ్డతో హాయిగా జీవించు అంది. ఆవు సంతోషంగా ఇంటికి చేరి తన బిడ్డతో కలకాలం హాయిగా జీవించింది.

"సత్యమేవజయతే" అబద్ధం ఆపదనుంచి తాత్కాలికంగా కాపాడగలుగుతుందేమో గాని, అపాయానికి దారితీస్తుంది. అందుకని అబద్ధంతో తాత్కాలిక ఉపశమనంకంటే సత్యం చెబుతూ, జీవించటము సరియైనది. సత్యవంతుడైన హరిశ్చంద్రుడు, ఎన్ని కష్టాలు, నష్టాలు, బాధలు వచ్చిన అబద్ధాన్ని ఆశ్రయించక, సత్యాన్ని అంటిపెట్టుకొనటం ద్వారా పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహానికి పాత్రడయ్యి, సత్యహరిశ్చంద్రుడిగా చరిత్రలో నిలచిపోయాడు. "నీవు సత్యాన్ని అంటిపెట్టుకో నీవెంట నేను ఉంటాను" అన్నారు శ్రీ శిరిడీసాయిబాబా.


సేకరణ : **శ్రీమతి కె. సాయి ప్రత్యూష**, గోవా

# ఒక్కసారి వెనక్కి చూడు

1. తల్లిదండ్రులు భూమ్మీద వున్న ప్రత్యక్ష దైవాలు
2. తల్లిదండ్రులకు సేవచేస్తే, భగవంతునికి సేవ చేసుకున్నట్లే.
3. ఏ ప్రేమ అయినా, తల్లితండ్రుల ప్రేమముందు దిగదుడుపే.
4. మానవజన్మ అనే గొప్ప అవకాశాన్ని ఇచ్చింది తల్లి దండ్రులే.
5. తల్లిదండ్రులను చూడకపోతే, పిల్లలకూ అశాంతే.
6. మనమెక్కడ వుంటే అక్కడే మన దగ్గరే మన అమ్మానాన్నల్ని మనతోనే ఉంచుకుందాం.
7. నిన్ను కనాలని పూజలు చేశారు ఎన్నోరాళ్లకు, నీవే రాయై వారి గుండెలు ముక్కలు చేయకు.
8. ధనంపోతే పొందవచ్చు, తల్లిదండ్రులు దొరకరు.
9. గోరుముద్దలు కొసరి కొసరి పెట్టి పెంచారు నిన్ను, అమృతం నీకందించినవారి పైనే విషం కక్కకు.
10. అమృతం కురిసే ఆ అమ్మ కళ్ళనే అశ్రువులతో తడపకు.
11. తడిసిన చోటే నడుంవాల్చి, పొడిగా ఉంచారు నిన్ను.
12. లక్షలు కోట్లు గడించినా, దీటేనా అవి తల్లిదండ్రులకు, గర్వంతో వీగకు.
13. వేరందరినీ మరచిపోయినా, మాతాపితరులను మరువకు.
14. పరమహితైషులు వారేనని మరువకు మరువకు. ప్రేమమూర్తులను ఆదరించు, వారే తల్లి, తండ్రి, గురువు, దైవము. వారు నీ దగ్గర నుండి గౌరవము కోరుకుంటారు కాని ధనమును కోరరు.

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయి సృజన**, బెంగుళూరు

# పూర్ణ అంతరంగాలు



సాయిస్వరూప పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి పాదాల చెంత వ్యాస రచయిత

జీవులు పుణ్యం చేస్తే స్వర్గానికి వెళ్ళి సుఖం అనుభవిస్తాయి, పాపం చేస్తే నరకానికి వెళ్ళి కష్టాలు అనుభవిస్తాయి. అవి తీరిన వెంటనే గతజన్మ సంస్కారాలను అనుసరించి మరల, అనేక రూపాలలో జన్మించవలసిందే. అట్లుకాక జన్మ సార్ధకత చెందించుకొని, మోక్షపదగామియైనదానిని పొందే అద్భుతమైన అవకాశం ఒక్క మానవజన్మలో మాత్రమే ఉంది. అందుకనే మోక్షానికి ముఖద్వారం మానవజన్మ అంటారు. దేవతలు సహితం మానవజన్మ కోసం ఎదురుచూస్తుంటారు. పాపపుణ్యాలను రెండింటినీ క్షయం చేసుకునే అద్భుత వేదిక–సాధనం మానవజన్మ. ఎన్నో వేల జన్మల తరువాతగాని ఉత్తమమైన మానవ జన్మ లభించదు. అటువంటి "మానవజన్మలో బ్రాహ్మణజన్మ మంచిది, మరల అందులో పురుషజన్మ ఉన్నతమైనది, అయితే వీటన్నింటికీ మించి సద్గురువు చెంతకు చేరిన వారి జన్మయే అత్యున్నతమయినది'' అంటారు, శ్రీ సాయిసచ్చరిత్రలో శ్రీసాయిచరిత్రకారకుడైన హేమాద్రిపంత్. తన కుల, మత, జాతి ఏమిటో తెలియనీయకుండా, షోడశ కళలు సంపూర్ణమైన 16 సంవత్సరాల బాలుడిగా శిరిడీలో ప్రకటమైన త్రిమూర్తి స్వరూపము శ్రీదత్తావతారుడైన శ్రీసాయిబాబా "ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమైన మార్గంవైపు నడిపిస్తాడు" అని అభయమిచ్చారు, అంటే బ్రహ్మతత్త్వం ఎరిగి, తగురీతిన జీవించే ప్రతివారు బ్రాహ్మణులే అని శ్రీసాయిబోధ. నిత్యకర్మానుష్టానములో భాగముగా అగ్నిహోత్రమునకు ప్రతిరూపముగా ధుని, త్రికాల సంధ్యలకు ప్రతీకగా సంధ్యాసమయములలో హరతులు, తన సన్నిధిలో ప్రవేశ పెట్టి, వాటి భావాన్ని గ్రహించి, ఆచరించటము ద్వారా మోక్షపదగామియై చరించి, జన్మరాహిత్యం పొందవచ్చని తెలియజేయటమే కాకుండా, "నా దగ్గరకు వచ్చిన ప్రతి జీవిని ఉద్ధరించి, చివరికంటా ఉండి భగవంతుడికి అప్పచెబుతాను" అన్నారు ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీసాయి. తన వలెనే బాహ్యరూపాన్ని ఇచ్చిన, భగవంతుడి ఉనికిని తెలుసుకోవటానికి జిజ్ఞాసులై, ఆయన సంప్రీతుడయ్యే విధముగా జీవించటానికి ప్రయత్నించేవారు పురుషులు. అట్టివాడు చేసే ప్రయత్నాన్నే పురుష ప్రయత్నం అంటారు, అందువలననే భగవంతుడిని "పుంసాం మోహనరూపాయ" అంటారు. పురుషులను సైతం మోహింపజేసే వాడు, తన దరికి చేర్చుకునే వాడు. ఆ భగవత్ స్థితిని పొందిన వాడు పురుషోత్తముడు. **అటువంటి పురుషోత్తముడి సాంగత్యము పొందిన జన్మ అన్నింటికంటే ఉత్తమోత్తమమయినది.** అటువంటి సజ్జన సాంగత్యము వలన జీవన్ముక్తి పొందవచ్చు.

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం,

నిర్మొహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తి”

“సత్పురుషుల సాంగత్యం వలన ప్రాపంచిక విషయాలు, మనుషులపట్ల విషయ వాసనలు తొలగి, వాటివలన కలిగే మోహం నశిస్తుంది. అందువలన స్థిరమైన తత్వం కలిగి, పరమాత్మపై దృష్టి ఏర్పడి, అది స్థిరమై జీవన్ముక్తి కలుగుతుంది” అంటారు జగద్గురువైన శ్రీఆదిశంకరాచార్యులు.

అటువంటి సత్సంగాన్ని కేవలము ప్రాపంచిక విషయాల కోసం ఉపయోగించుకోవటం, జ్ఞానాగ్నిని చలిమంటగా ఉపయోగించుకోవటం లాంటిది. సనాతన ధర్మ స్వరూపమైన సత్సంగానికి మన జీవితంలో ఎనలేని ప్రభావముంటుంది. సామాన్యమైన మనుషులు నిరంతరం సాటివారి సహచర్యంతో ప్రేరణ పొందుతూ జీవిస్తారు. ఎవరితో ఎక్కువ సమయం గడుపుతామో వారిలోని అంశాలు తెలీయకుండ మనపై ప్రభావం చూపెడతాయి. చిన్న పిల్లవాడితో ఎక్కువ సమయం గడిపేవారు, చిన్నారులతో కలసిపోయి వాళ్ళలాగా ఆడుతూ, మాట్లాడుతూ ఉండటం, పెద్దవారితో కలిసి తిరిగే పిల్లలు వారిగా, పెద్ద ఆరిందలాగా మాట్లాడటము మన నిత్య జీవితంలో చూడవచ్చు. పసితనంలో తల్లి తండ్రులు, ఆ తరువాత పాఠశాలలో ఉపాధ్యాయులు, స్నేహితులు, ఇట్లా జీవితంలో ఆ యా దశలలోసాంగత్యం నేర్పేవారి అభిప్రాయాలను పంచుకుంటూ, ఉభయ సంతోషం కోసం జీవించటానికి అలవాటు పడటం జరుగుతుంది. అయితే సత్పురుషులుగా మనము మారాలి అంటే, ఆ స్థితిపొందిన వారి సాంగత్యం ఎంతో మేలు చేస్తుంది. **“సత్పురుషుల సాంగత్యం లభించిన మనిషి జన్మ ధన్యం, అయితే అంతటి సత్పురుషుని దర్శన, స్పర్శన, సేవా, సాంగత్య భాగ్యము కేవలం భగవంతుని అనుగ్రహం వల్లనే లభిస్తుంది”** అని అంటాడు నారదుడు తన భక్తి సూత్రాలలో.

మనమధ్య మనలాగానే జన్మించి, జన్మ సార్ధకత కోసం అన్వేషించి, జగద్గురువు అయిన శ్రీశిరిడీసాయిబాబాను ఆశ్రయించి, తాను గృహస్తు జీవితంలోనే ఉంటూ, ఫకీరు అయిన శ్రీసాయిబాబా బోధించిన సూక్తులకు ప్రత్యక్ష నిరూపణగా మారి, సంసార సాగరములో కష్టనష్టాలు, బరువుబాధ్యతలు, సుఖదుఃఖా లనే అలలలో కొట్టుమిట్టాడుతూ, ఒడ్డుకుచేరే దారితెన్నూ తెలియక మునకలు వేసేవారి పాలిట నావ అయ్యి, జగద్గురువు అయిన శ్రీసాయి సమాశ్రయము ద్వారా ఆ అలలపై తేలియాడుతూ, సుఖజీవనంతో మహావిష్ణువులా జీవించవచ్చని తన ఆచరణ ద్వారా తెలియజేసి, సాయి బోధలను తాను ఆచరిస్తూ, ఆచరింపచేస్తూ, ఆచార్యులై, గురువై, సద్గురువై, సాయి స్వరూపులై “శ్రీసాయిమాస్టర్”గా వినుతికెక్కి, “సాయిసన్నిధి” అనే ముక్తి ధామానికి నడిచిపోయే చెక్కవంతెనగా తానుమారి, లక్షలాది మందిని నిర్దుష్టమైన శ్రీసాయి మార్గంలో పయనింపచేస్తున్న సాయిస్వరూపులయిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి సాంగత్యం లభించటము మా పూర్వజన్మ సుకృతము అని, నేను కాదు, వారివద్ద విద్య నభ్యసించినవారు, సహాధ్యాయులు, స్నేహితులు ఇంకా ఎందరో ఎందరెందరో శ్రీ భరద్వాజగారిని ప్రశంసించటము నిత్యసత్యము. అంతటి సత్పురుషునితో కొన్ని గంటలయిన సాంగత్యం లభించటము ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీసాయి-రాముడి అనుగ్రహం కాక మరేమిటి?

శ్రీదత్తావతారుడైన శ్రీసాయిబాబా స్వరూపులయిన ఎందరో అవధూతలను, మహాత్ములను దర్శించిన శ్రీ భరద్వాజమాస్టారుగారు, తన దగ్గరకు వచ్చిన వారికి, శ్రీసాయి గురించి తెలపటమే కాకుండా, ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగాలు చేయండి. శ్రీసాయి గురించి తలవండి, సాయి గురించి తెలపండి దాని ఫలితంగా సాయి స్వరూపులైన అవధూతల, మహాత్ముల దర్శన ఆశీస్సులు లభిస్తాయని చెప్పటమే కాకుండా, ఆ యా ప్రదేశాలలో ఉన్న అవధూతలు, మహాత్ముల గురించి తెలిపి, వారి దర్శనానికి వెళ్ళమని ప్రోత్సహించేవారు మాస్టారుగారు. సత్సంగాలలో పాల్గొనటము ద్వారా అద్భుతమైన అనుభవాలు, అనుభూతులు పొందిన వారెందరో కలరు. “నలుగురు ఒక్కచోట చేరి, కాలాన్ని కబుర్లతో వెలిబుచ్చేకన్నా, ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీశిరిడీసాయిని వారి స్వరూపాలైన వారి గురించి తెలుసుకుంటూ, నలుగురితో పంచుకోవటం ద్వారా మనలో తెలియకుండానే నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక శక్తి చైతన్యరూపం దాలుస్తుంది” అని చెప్పేవారు శ్రీ మాస్టారుగారు. నేను కూడ ఎందరో అవధూతలను, మహాత్ములను దర్శించి, వారి అనుగ్రహ ఆశీస్సులతోపాటుగా, వారి పాదుకలను, వారు ఉపయోగించిన వస్తు, వస్త్రములను పొందే మహాభాగ్యము కలిగింది అంటే, అది ఏ కొద్ది క్షణాలో “సాయిమాస్టర్” శ్రీ భరద్వాజగారితో గడిపిన సాంగత్య ప్రభావమే.

సత్సంగమము వలన కోరికలు తీరి కష్టాలు నెరవేరటము అతి స్వల్పమయిన విషయం. సత్సంగ ప్రాముఖ్యత ఎరిగి తగురీతిన నిర్వహించుకోవటము ద్వారా అది జీవన ముక్తికి దారి తీస్తుంది అని ఆదిశంకరాచార్యులు చెప్పిన విషయాన్ని రుజువుచేయటమే కాకుండా, సత్సంగం ఎంతటి మహత్తరమైన కార్యమో, అది జన్మ రాహిత్యానికి ఎట్లా దారి తీస్తుందో శ్రీసాయిలీలామృతములో సామాన్యులు సైతం ఆలకించి, ఆచరించేలా మనకు బోధించారు ఆచార్య శ్రీ భరద్వాజమాస్టారుగారు.

“తనను ఆశ్రయించిన వారిని, సేవించినవారిని నిరంతరము వెంటనుండి కాపాడటమే కాకుండా, చివరికంటా ఉండి గమ్యంచేర్చి, నా స్థితినే ప్రసాదిస్తాను” అంటారు జగద్గురువైన శ్రీసాయి. అయితే ఎక్కువమంది సాయి ప్రసాదించేది పొందటానికి

బదులుగా ఆశవలనో, భయం వలనో వారిని ఆశ్రయిస్తారు. వారు ఇవ్వగలిగింది పొందగలగాలి అంటే ముందుగా మనలోని బలహీనతల్ని గుర్తించి తొలగించుకోవాలి. అందుకు సాయిబాబాపై మనకు గల భావాలు, మనలోని బలహీనతలు అవరోధమవుతాయి. వీటన్నింటినీ గుర్తించి తొలగించుకోవటానికి అద్భుతమైన వేదిక సత్సంగమము. అలనాడు నైమిశారణ్యంలో మునులు కూడ ఇదే చేసేవారు, అన్ని సాధనలకు భగవత్ కథా శ్రవణమే మూలం, కనుక సత్సంగమము, సద్గురుని చరిత్ర పారాయణ, శ్రవణం చేయటం ద్వారా, అది మన హృదయలోతుల్లో పాతుకొని ఆచరణ దిశగా సాగి, సాటివారి సహచర్యంలో సాధనగా మారుతుంది" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. సామాన్యులైన వారు జరుపుకునే సత్సంగానికే అంత ప్రభావము ఉంటే, సాయి స్వరూపులైన శ్రీ భరద్వాజగారితో సత్సంగం నెరపి, జీవితంలో ఎన్నో విధాలుగా ఉత్తమ, ఉన్నతి స్థితి పొందినవారు ఒక్కచోట చేరి సత్సంగమము నిర్వహించుకుంటే! దాని కార్యరూపమే "సాయిమాస్టర్ భక్తసమ్మేళనాలు".

పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజగారి పాదాలు పట్టుకొని ప్రమాణం చేసినందుకు వారి అనుగ్రహ ఆశీస్సులతో గత 36 సంవత్సరాలు, నిరాటంకముగా నేను ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగాలు కొనసాగించుకోవటం, సత్సంగ సభ్యులందరము శ్రీ సాయిస్వరూపులయిన అవధూత, మహత్ముల అనుగ్రహ ఆశీస్సులు పొంది, అనేక గిరిజన గ్రామాలలో సాయిమాస్టర్ పేరిట సత్సంగాలు ఏర్పాటు చేయటమే కాకుండా "శ్రీభరద్వాజ సద్గురువాణి" ద్వారా గత 19 సంవత్సరాలుగా వేలాది మందికి –మాస్టారు చూపిన శ్రీసాయి సాంప్రదాయాన్ని అందరితో కలసి పంచుకునే అవకాశం కలిగింది. ఇదంతా సత్సంగ ప్రభావమే. "సత్సంగం ఈ కాలంలో సహజముగా దొరికేది కాదు, దానిని తోటలాగా పెంచుకోవలసిందే, మళ్ళీ మళ్ళీ కలుపు తీసుకుంటూ, నీరుపోస్తూ కాపాడుకోవలసిందే" అంటారు మాష్టారుగారు, నిజమే, మేము సత్సంగం నిర్వహిస్తున్నాము మాష్టారిగారి దర్శన ఆశీస్సులు పొందుతున్నాము అని అంతరాలలో దాగి ఉన్న అహాన్ని పారద్రోలటానికి 1989 ఫిబ్రవరి 2వ తేదీ సూళ్ళూరుపేటలో రైల్వేస్టేషన్‌లో మాష్టారుగారి సాంగత్యంతో వారి ప్రయాణంలో భాగముగా జరిగిన సంఘటన కారణభూతమయింది.

సూళ్ళూరుపేటలోని భాస్కరరెడ్డి ఇంట్లో సత్సంగమము, సహపంక్తి భోజనం, చిత్రకూట మండపము సందర్శనము అనంతరం ఒంగోలు బయలుదేరటానికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన మాష్టారు గారితోపాటుగా వచ్చిన వాళ్ళందరమూ రైలురాకకై వేచిచూస్తూ దాదాపు 20 నిముషాలుపాటు అక్కడే ఉన్నాము. రైలు ఆరోజు 10 నిముషాలు ఆగింది. అంతవరకు మాష్టారుగారిని, మమ్మల్ని దూరంనుంచే పరిశీలిస్తూ ఉన్న జనార్ధన్ రైలుబయలుదేరే చివరి క్షణంలో పరుగున వెళ్ళి, ఒక ఉదుటన బోగీ తలుపు దగ్గర నిల్చొని ఉన్న మాస్టారుగారి పాదాలపై పడి నమస్కరించటము, మాష్టారుగారు చిరునవ్వుతో అభయమివ్వటము, ఆశ్చర్యంలో ఉన్న మావైపు చూస్తూ మందహాసంతో చేతులు ఊపుతూ మాస్టారుగారు ప్రయాణం సాగించటము, అతను పరుగెత్తుకుంటూ వెళ్ళి, కదిలే రైలులో వేరే బోగీలో ఎక్కి ప్రయాణం చేయటము, అంతవరకు ఎన్నడూ సత్సంగాలకు రాని అతను, అటుపిమ్మట కొన్ని రోజులకు మా సత్సంగంలో పాల్గొనటమే కాకుండా, అనేక విధాలుగా సేవచేయటము చూస్తే, సత్పురుషుడి పాదాలు క్షణకాలంపాటు (హృదయపూర్వకమైన ఆర్తితో) స్పృశించినా, ఎంతటి అద్భుతమైన ఫలితం ఉంటుందో సింహావలోకనం చేసుకుంటుంటే, ఇప్పుడు తెలుస్తున్నది సాంగత్యపు ప్రభావం గురించి, దానికి నేనే ప్రత్యక్షసాక్షిని.

అవాజ్యమైన ప్రేమస్వరూపుడు భగవంతుడు. ఆయన ప్రతిరూపమైన సద్గురువు యొక్కప్రేమ, వాత్సల్యం వారు ప్రత్యక్షముగా ఉన్నప్పుడు అంతగా గమనించలేము. మాష్టారుగారు కూడ శ్రీ సాయిలీలామృతానికి విషయసేకరణ సమయంలో, సాయితో ప్రత్యక్ష సాన్నిధ్యం కలవారిని కలసి సాయిగురించి తరచి తరచి అడిగినప్పుడు "మేము అంతగా ఆలోచించలేదు, అంతగా సాయిని స్వీకరించలేదు" అని అన్నారట కొందరు. మహాత్ముల ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని మనలోని "నేను" అంతగా స్వీకరించనీయదు. అయితే వారి సన్నిధిలో వెలిగించుకున్న హృదయజ్యోతి కొడిగట్టకుండా, కొండెక్కకుండా, చూసుకుంటే, కాలగమనములో అది, దేదీప్యమై మార్గం సుగమం చేస్తుంది. అందుకు ఆలంబనే మహాత్ముల జన్మదినాలు, ఆరాధనోత్సవాలు జరుపుకోవటంలోని ఆంతర్యం. ప్రత్యేకించి "ఆరాధనోత్సవం" అంటే వారికి ఇష్టమైన రీతిలో జీవించటం. అది ప్రారంభమయిన నాడు నేను, నాది, ఇష్టం, అయిష్టం క్రమేపీ తొలగి సద్గురువు సంప్రీతుడయ్యేలా జీవనం సాగుతుంది.

సద్గురువు సన్నిధి ప్రత్యక్షంగా ఉన్నప్పుడు వారి భౌతిక రూపం, చర్యలపై నిలచి ఏర్పడే భావనలు, వారు దేహం వీడిన తరువాత కేవలం వారి బోధనలపైనే నిలుస్తాయి. భౌతికభ్రమలలో పడిపోయేవారికి, వారి తదనంతరం ఆ చర్యలలోని అంతరార్థం బోధపడుతుంది. సాయి స్వరూపులయిన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు తాను భౌతిక దేహం వీడటానికి రెండు నెలలముందు ప్రసాదించిన అద్భుతమైన అనుభవం, అనుభూతి, అటు పిమ్మట నేటికీ నిత్యసత్యులై, అలనాటి అనుభవాల అనుభూతి మాధుర్యాన్ని నేటికీ అనుభవింపచేస్తూ, వాటి మాటున దాగి ఉన్న ఆధ్యాత్మిక రత్నాలను వెలికి తీయిస్తూ, ఆ వెలుగులో గమ్యంవైపు సాగే చిరు అడుగులకు చేయూతనిస్తూ, వెంటనుండి మాస్టారుగారు నడిపిస్తున్న తీరు, అనేక రూపాలలో అనేక విధాలుగా అనుభవమవుతుంటే వారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను.

మాష్టారుగారి విద్యార్థియై, మాష్టారుగారి సాన్నిధ్యంలో ఎన్నో సంవత్సరాలు అనుభవించి, ఒకనాటి మాస్టారిగారి విద్యార్థి, లెక్చరర్ అయ్యి, కళాశాల ప్రిన్స్‌పాల్‌గా పనిచేసి, డాక్టరేట్ కూడ సాధించిన ఇ. చెన్నయ్య (తిరుపతి) గారు సత్సంగాలలో, ప్రత్యేకించి సమ్మేళనాలలో తన ప్రవచనం ప్రారంభించే ముందు "సత్సంగ సోమయాజి శ్రీ భరద్వాజమాస్టారుగారికి జై" అంటుంటే అప్పుడు అంత అర్థం కాలేదు, ఆలోచిస్తే ఆమాటలో ఎంత అర్థముందో ఇప్పుడు గోచరిస్తున్నది. అంతట తానే అయ్యి, అన్నీ తానే అయ్యి, వారి జీవితాన్నే ఉత్తమంగా నడిపేరు శ్రీ మాష్టారుగారు, దానిని నిరంతరం గుర్తుపెట్టుకొని జీవిస్తున్నారు డాక్టర్ చెన్నయ్యగారు, అటువంటి ధన్యజీవులు ఎందరో కలరు. అందరికీ వందనాలు. అప్రయత్నంగా మాస్టారుగారు దర్శించిన మహాత్ములు శ్రీపాకలపాటి గురువుగారి జీవితచరిత్రలోని (పేజీ 50) విషయం ఇక్కడ స్ఫురణకు వస్తున్నది.

శ్రీ భరద్వాజ గారు గృహస్తు అయ్యి మనమధ్య నిలవటానికి, నేటి తరానికి శ్రీ శిరిడీసాయి సాంప్రదాయాన్ని – ఆవశ్యకతను శ్రీ మాష్టారుగారికి తెలియజేసిన శ్రీ పాకలపాటి గురువుగారు భౌతికదేహం వీడే కొన్ని నెలల ముందు మాష్టారిగారి అన్నగారైన శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల గారితో "డాక్టరుబాబు నాకు మీ వాణ్ణెంతగానో చూడాలని ఉంది. ఇటీవల నాకు స్వప్నంలో కనిపించాడు, ఇలా మామూలుగా కాదు – శంఖ చక్రాలు, నామాలతో, చతుర్బాహువులతో కనిపించాడు. అయితే ముఖం మాత్రం స్పష్టంగా భరద్వాజే! అప్పటినుండి మీవాణ్ణి ఎప్పుడెప్పుడు చూస్తానా అనిపిస్తుంది. మీరు విశాఖపట్నం వెళ్ళగానే ఈ విషయం వ్రాసి, సాధ్యమైనంత త్వరలో వచ్చి, చూసిపొమ్మని వ్రాయండి. డాక్టరుబాబుకు కార్యభారంతో గుర్తుండకపోవచ్చును, ఆచారిబాబుగారు మీరైనా గుర్తుంచుకొని వెంటనే నామాటగా వ్రాయండి. తల్చుకుంటే ఆ స్వప్న దర్శనమిప్పటికీ కళ్ళకు కట్టినట్లుంది'' అని శ్రీ భరద్వాజగారి తండ్రిగారైన శ్రీ అనంతాచార్యులగారి చేతులు పట్టుకొని, గాయత్రీ మంత్రసిద్ధి పొంది, గిరిజనుల పాలిట దేవుడై వారి హృదయాలలో శ్రీరాముడిగా కొలువై ఉన్న శ్రీ దామరాజు వేంకటయోగీంద్రులు, శ్రీ భరద్వాజగారి పెద్దన్న శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులు, తండ్రి శ్రీమాన్ అనంతాచార్యుల గారితో చెప్పిన మాట ఇది, ఆవిషయం ఒక్కసారి స్మృతిపథంలో మెదలగా, సాయి స్వరూపులైన మాస్టారుగారి సాంగత్యం కొంతైనా లభించినందుకు పొంగిపోతూ, నాపై కురిసిన వారి అనుగ్రహ బిందువు సముద్రమై ఉప్పొంగగా, అప్రయత్నంగా గతంలో ఆలకించిన "అంతయూ నీవే హరిపుండరీకాక్ష" అన్న శ్రీఅన్నమయ్య కీర్తన జ్ఞప్తికి రాగా, స్మృతిపథంలో మెదిలే ఆ కీర్తనను మననం చేసుకుంటూ, మనోఫలకంపై కదలాడుతున్న "శ్రీవారిని" దర్శించుకుంటూ, ఆనందానుభూతితో ఉండిపోయాను.

అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ
కులమును నీవే గోవిందుడా! నా
కలిమియు నీవే కరుణానిధి
తలపును నీవే ధరణీధర! నా
నెలవును నీవే నీరజనాభ
అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ
తనువును నీవే దామోదర! నా
మనికియు నీవే మధుసూదన
వినికియు నీవే విట్ఠలుడా! నా
వెనకముందు నీవే విష్ణు దేవుడా
అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ
పుట్టుగు నీవే పురుషోత్తమ
కొన నట్టనడుమ నీవే నారాయణ
ఇట్టి శ్రీ వేంకటేశ్వరుడా! నాకు
నెట్టన గతి ఇంక నీవే! నీవే!
అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ

**మీ - వేంకట పూర్ణచంద్రరావు. వి.**



# సంసారవృక్షం

సంసారమంటే భార్యాపిల్లలనేది కాక సృష్టిలో కనిపించే నానాత్వమే సంసారమని చెప్పారు. నేను వేరు, నీవు వేరు అని అంటూ రాగము, భయము, అసూయ, ద్వేషము అనేవి ఎందులో వుంటాయో అట్టి దాన్ని సంసారం అంటారు. దానివల్ల వేరువేరనే భావము, ద్వేషము, మమకారము మొదలైనవి పెరిగిపోతూ ఉంటాయి. కాని వాటంతట అవి తరగడం అంటూ జరగదు. అలాగాక అన్ని రూపాలలోనూ ఒక్కటే వున్నదనే జ్ఞానం కలిగినప్పుడు దేనియందు దేనికి మమకారం? మమకారము, ద్వేషము లయించి అన్నింటిలో నేనే ఉన్నాననే భావం కలగడమే ప్రేమ అంటే.

అట్లా సర్వత్రా అన్నింటా తానే ఉన్నానని తెలిసిన వాడికి నానాత్వం గోచరించదు కనుక సంసారం అనే వృక్షం కల్పవృక్షంగా తయారవుతుంది. వాడికి సకల శ్రేయస్సును గూర్చిన తలంపులు కలిగి, ఆ ఆలోచనలన్నింటినీ నెరవేర్చుకుంటూ, సకల సృష్టికీ, తనకూ శ్రేయస్సు చేకూర్చుకుంటూ పోతుంది వాడి జీవితం. అందుకు మహాత్ముల జీవిత చరిత్రలన్నీ ఉదాహరణలే!.

– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం
## (2019 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. అందులో ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్. లక్ష్మి పూర్ణచంద్రరావు పాల్గొనటము జరిగింది.

అక్టోబరు 8వ తేదీ విజయదశమి మరియు శ్రీ శిరిడీసాయి 101వ మహాసమాధి సందర్భాన్ని పురస్కరించుకొని, శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో ఉదయం సామూహిక పూజలు నిర్వహించి, విశేష సమారాధన చేసి అనంతరం శ్రీ శిరిడీసాయి మహాసమాధి చెందిన సమయములో "ధ్యానపూర్వక సత్సంగాన్ని" నిర్వహించటం జరిగింది. ఆ కార్యక్రమములో స్థానికులు విశేషముగా పాల్గొన్నారు.

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌లోని 300 మంది నిరుపేదలకు అన్నదాన నిమిత్తము అక్కడి సమితివారికి బియ్యం, పాలు, కూరగాయలు అందజేయటమైనది.

అక్టోబరు 30వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు మరియు వస్త్రాలు బహుకరించటమైనది. ఈ కార్యక్రమములో ట్రస్టు ఛైర్మన్ దంపతులు మరియు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అక్టోబరు 30వ తేదీ శ్రీ భరద్వాజమాస్టారిగారి జన్మదినాన్ని పురస్కరించుకొని, స్థానిక బాబా మందిరములో అన్నదానము నిర్వహించటమైనది. అంతేకాక, శ్రీకాకుళం జిల్లాలో లావేరు మండలంలోని అప్పాపురం గ్రామంలోని ఎలిమెంటరీ స్కూలులోని నిరుపేద బాలబాలికలకు నోట్సు పుస్తకాలు, పెన్నులు మొదలైన విద్యా సామాగ్రిని ట్రస్టు తరపున శ్రీ నాగకిరణ్ అందజేయటమైనది.

మాస్టారుగారి జయంతిని పురస్కరించుకొని శ్రీకాకుళంజిల్లా నరసన్నపేటలోని గోఖలే అనాథ నిరుపేద బాలుర, శిశుసదనమునకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ట్రస్టు తరపున అందజేయటమైనది.

అక్టోబరు 30వ తేదీ మాస్టారిగారి జయంతిని పురస్కరించుకొని శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో "మాస్టారుచూపిన సాయిబాట" అనే అంశముపై ప్రత్యేక సత్సంగమము నిర్వహించి, భక్త సమారాధన చేయటమైనది.

నవంబరు 3వ తేదీ మాస్టారిగారి జన్మదినం (తిథి) సందర్భముగా శ్రీకాకుళంజిల్లా అరసవిల్లిలోని బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రానికి కూరగాయలు అందజేయటమైనది. అంతేకాక మహాత్ముల ఆరాధన, జయంతుల సందర్భములలో కూడ నిత్యాన్నదానానికి ఆర్థిక సహాయము మరియు కూరగాయలు అందజేయటమైనది.

నవంబరు 6వ తేదీ అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో సామూహిక పారాయణ నిర్వహించి సమారాధన చేయటమైనది.

కార్తీకమాసం సందర్భముగా నవంబరు 10వ తేదీ శ్రీసద్గురుపాదుకాక్షేత్రంలో "వనసమారాధన" నిర్వహించమైనది. ఉదయం రావి, తులసి, ఉసిరి చెట్లకు మరియు శ్రీదత్త, సాయి, భరద్వాజులకు సామూహిక పూజలు నిర్వహింపజేసి, అనంతరం దీపోత్సవము నిర్వహించటమైనది. సామూహిక సమారాధన అనంతరం "సమ - ఆరాధన-సాయి చూపిన మార్గం" అనే అంశముపై గోష్ఠి నిర్వహించి, కృతజ్ఞతోత్సవము పేరిట అందరికీ శిరిడీ ప్రసాదము, చిత్తరువులు, జ్ఞాపికలు బహుకరించటము జరిగింది. ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రస్టు సత్సంగ సభ్యులు, అనుబంధ సంస్థల సభ్యులతో పాటు, స్థానికులు విశేషముగా పాల్గొని, శ్రీసాయి సన్నిధిలో, ఆధ్యాత్మిక భావనతో కూడిన వన సమ - ఆరాధన జరగటం ఇదే ప్రథమమని, అందులో పాల్గొనటము ఎనలేని మానసిక-ఆధ్యాత్మిక-శారీరక పుష్టిని, శక్తిని కలగజేసిందని పాల్గొన్నవారు తమ అభిప్రాయం తెలియజేశారు.

నవంబరు 12వ తేదీ కార్తీకపౌర్ణిమను పురస్కరించుకొని ఉదయం "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 40 మంది దివ్యాంగుల నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ట్రస్టు ఆవరణలో ట్రస్టు ఛైర్మన్ అందజేయటం జరిగింది.

సాయంత్రం జరిగిన కార్యక్రమములో పౌర్ణిమి దీపోత్సవం, సత్సంగమము నిర్వహించి, ప్రసాద వితరణ చేయటమైనది.

నవంబరు 23వ తేదీ శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో శ్రీసాయిదీక్షలు ప్రారంభించటమైనది. ఆ దీక్షలకు స్థానికులతోపాటు, వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన వారిచేత శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు సామూహిక గురుపూజలు నిర్వహింపచేసి, మాలాధారణ చేశారు. ఆ సందర్భముగా గిరిజనులకు ఉచితముగా సాయి చిత్రపటాలు, దీక్షావస్త్రాలు, మాలలు అందచేయటమైనది. అనంతరం సత్సంగమము నిర్వహించి, భక్తసమారాధన చేశారు.

డిసెంబరు 9వ తేదీ శ్రీభరద్వాజ పబ్లికేషన్స్ అధినేత్రి శ్రీమతి వి.యస్.లక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకొని, శ్రీకాకుళంలోని నిరపేద గర్భిణీ స్త్రీలకు రిమ్స్ హాస్పిటల్‌లో నిర్వహించే అన్నదానము నిమిత్తము సుమారు 400 మందికి సరిపడా బియ్యం, కాయగూరలు, పాలు తదితరములు అక్కడి నిత్యాన్నదాన సమితివారికి అందజేయటమైనది. మరియు శ్రీకాకుళం అరసవిల్లిలోని అనాధ బాలబాలికల శిశుసదనమునకు సీలింగ్‌ఫ్యాన్‌లు బహుకరించటమైనది.

డిసెంబరు 11 మరియు 12 తేదీలలో శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం నందు శ్రీదత్తజయంతి మహోత్సవము అత్యంత వైభవోపేతముగా

నిర్వహించటమైనది. డిసెంబరు 11వ తేదీ ఉదయం శ్రీ దత్తసాయిభరద్వాజులకు అభిషేక పూర్వక షోడశోపచారపూజ అనంతరం శ్రీ లలితా, విష్ణు సహస్రనామ పారాయణ చేయటమైనది. అనంతరం సామూహిక 'శ్రీగురుచరిత్ర' పారాయణ ప్రారంభించడమైనది. ఆ పారాయణలో 158 మంది దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం విశేష అన్నదానము నిర్వహించి, సాయంత్రం పారాయణ ముగింపు అనంతరం ప్రసాద వితరణ చేయటమైనది.

అనంతరం జరిగిన ఆధ్యాత్మిక సభలో " శ్రీ దత్తావతార విశిష్టత" అనే అంశముపై శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు ప్రవచనము చేయగా, "శ్రీ భరద్వాజ మాస్టారు-వారు చూపిన దత్త తత్త్వం" పై రాజమండ్రికి చెందిన శ్రీ మౌనానందస్వామి ప్రవచనం చేశారు.

డిసెంబరు 12వ తేదీ ఉదయం శ్రీదత్తసాయిభరద్వాజులకు అభిషేకం, షోడశోపచారపూజ అనంతరం, 'శ్రీదత్త, సాయి, భరద్వాజ' చాలీసా పారాయణ చేసి, అనంతరం ఉభయస్మార్త శ్రీ కోటరామశాస్త్రి ఆధ్వర్యములో సామూహిక 'గురుపూజలు', 'శ్రీదత్త సాయి భరద్వాజ'హోమము శాస్త్రోక్తముగా నిర్వహించి శ్రీసాయిదీక్షలు విరమణ చేయటమైనది. ఈ కార్యక్రమములో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలోని అనేక ప్రాంతాలలోని సాయిదీక్షాపరులతో పాటు, ట్రస్టు అనుబంధ సంస్థల సభ్యులు, అనేక మారుమూల ప్రాంతాలనుంచి విచ్చేసిన గిరిజనులు మరియు స్థానికులతోపాటు, అధికార, అనధికారులు, అనేక సంఘాల నాయకులు విశేషముగా పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన వేలాది మందికి విశేష సమారాధన నిర్వహించటమైనది.

సాయంత్రం 'శ్రీసాయి ఆపన్నహస్తం' పేరిట దివ్యాంగులు, నిరుపేద 40 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను, "భరద్వాజ పబ్లికేషన్స్" అధినేత్రి శ్రీమతి వి.యస్.లక్ష్మీ మరియు వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన వారిచేత అందింపజేయటమైనది.

అనంతరం గిరిజనులకు, శ్రీమతి వి.యస్. లక్ష్మీ చీరలు బహుకరించారు. తదుపరి ''సాయి సాంప్రదాయములో శ్రీగురుచరిత్ర ప్రాముఖ్యత" అనే అంశముపై శ్రీ మౌనానందస్వామి, శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు. అనంతరం శ్రీమౌనానందస్వామిని ట్రస్టు ఛైర్మన్ సత్కరించగా హారతి అనంతరం సమారాధన ఏర్పాటు చేయటమైనది. రెండురోజులపాటు అత్యంత వైభవంగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శ్రీదత్తజయంతి మహోత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమములో పాల్గొన్న వారికి, అల్పాహారము, రెండు పూటల భోజనాదులతో పాటు, సుదూరప్రాంతాలనుంచి విచ్చేసిన వందలాది మంది గిరిజన మరియు అనుబంధ సంస్థల సభ్యులందరికీ ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు చేయటమైనది.

డిసెంబరు 19వ తేదీ అనఘాష్టమి సందర్భముగా శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో ప్రత్యేక సత్సంగమము నిర్వహించి సమారాధన చేయటమైనది.

డిసెంబరు 24వ తేదీ నర్సీపట్నం శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమములో జరిగిన 59వ సహజీవనయోగా సదస్సులో ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు పాల్గొని "శ్రీ సాయి-హనుమ" అనే అంశముపై ఆధ్యాత్మిక ప్రవచనము చేశారు.

స్థలాభావము ననుసరించి, ఆ యా కార్యక్రమాల వివరాలు సంక్షిప్తముగా తెలియజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

## దత్త జయంతి మహోత్సవములు














# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవాకార్యక్రమాలలో భాగముగా శ్రీశిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2019 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. అందులో భాగముగా స్త్రీ సంక్షేమ వసతి గృహాలకు, వంటసామాగ్రి, స్వెట్టర్లు అనాథ బాలుర సంక్షేమ వసతి గృహమునకు ఫ్యాన్‌లు, పిల్లలకు నోట్సు పుస్తకాలు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు ఆ యా సందర్భాలననుసరించి, అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారములు, సాయి దీక్షలపేరిట గిరిజనులకు దీక్షావస్త్రాలు, మాలలు, శ్రీసాయి చిత్రపటాలు, పారాయణ గ్రంథాలు మొదలైనవి, ప్రతి నెల 'శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం' పేరిట దివ్యాంగుల, అతి నిరుపేద 40 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఇంకా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటము జరిగింది. వాటి పూర్తి వివరాలు, ఆధ్యాత్మిక - సామాజిక సేవాకార్యక్రమాల వివరాలు 23వ పేజీలో చూడగలరు.

**సహాయ సహకారములు అందించిన సహృదయులు**

| | |
|---|---|
| శ్రీ జి. నాగమల్లేశ్వరరావు, దువ్వాడ, వైజాగ్ | రూ. 10,000/- |
| శ్రీ బి. రఘు, విశాఖపట్నం | 10,000/- |
| చి॥ వై. వెంకట సాయిరాజ్, బెంగుళూరు (కర్ణాటక) | 5,000/- |
| శ్రీ కె. శరత్ చంద్రబాబు, కూర్మన్నపాలెం | 3,348/- |
| శ్రీ సిహెచ్. నరసింహరావు, హైదరాబాదు | 3,000/- |
| శ్రీ కె. శ్రీనివాసరావు, కేరళ | 3,000/- |
| శ్రీ కె. రమేష్ కుమార్, శ్రీనగర్, వైజాగ్ | 3,000/- |
| శ్రీ ఆర్. సూర్య శ్రీనివాస్, హైదరాబాదు | 2,700/- |
| ఒక సాయి భక్తుడు, విశాఖపట్నం | 2,000/- |
| ఒక సాయి భక్తుడు, జంగారెడ్డిగూడెం | 4,000/- |
| శ్రీ ఆర్. అప్పలరాజు, విశాఖపట్నం | 2,050/- |
| శ్రీ కె. అప్పలరాజు, ఎన్.టి.పి.సి. పరవాడ | 2,001/- |
| శ్రీ జె.డి. పూర్ణచంద్రరావు, పవర్‌సిటీ, వైజాగ్ | 1,016/- |
| శ్రీ కె. సత్యన్నారాయణ, పవర్‌సిటీ, వైజాగ్ | 1,005/- |
| ఒక సాయిభక్తుడు, విశాఖపట్నం | 1,000/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 1,000/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 900/- |
| శ్రీ టి.వి. రాజశేఖరరావు, ఎన్.టి.పి.సి.వైజాగ్ | 501/- |
| శ్రీ సిహెచ్. వెంకటేశ్వర్లు, పవర్‌సిటీ, వైజాగ్ | 500/- |
| చి॥ బి.సాయిగీతాన్‌శ్రీ, లంకెలపాలెం, వైజాగ్ | 500/- |
| శ్రీ చిలుకూరు వెంకట సంతోష్, విశాఖపట్నం | 500/- |
| శ్రీమతి బి. అరుణ, శ్రీకాకుళం | 500/- |
| శ్రీ బి.వి.యస్. గణేష పట్నాయక్, శ్రీకాకుళం | 500/- |
| శ్రీ టి. నరసింహమూర్తి, ఈవూరు, కృష్ణాజిల్లా | 400/- |
| శ్రీమతి ఎస్. హారిక, గుంటూరు | 300/- |
| శ్రీ హెచ్. నందికేశ్వరరావు, విశాఖపట్నం | 300/- |
| శ్రీ ఎన్. యజ్ఞశ్రీ, తణుకు | 200/- |
| శ్రీ యల్. వి. జగన్నాధం, శ్రీనగర్, వైజాగ్ | 116/- |
| శ్రీమతి బి. లక్ష్మి, విశాఖపట్నం | 108/- |
| శ్రీ బి. కృష్ణారావు, విశాఖపట్నం | 108/- |
| శ్రీ బి. రామారావు, ఎన్.టి.పి.సి. వైజాగ్ | 100/- |
| శ్రీ డి. సింహాద్రిరావు, పరవాడ, వైజాగ్ | 100/- |

**మీ విరాళములు పంపవలసిన చిరునామా**
**మరియు బ్యాంక్ అక్కౌంటు**

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్ట్ (రిజిష్టర్డ్)**
**ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం)**
**విశాఖపట్నం - 531 021. సెల్ : 9849645224**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492

**"శ్రీ భరద్వాజ సద్గురువాణి" పత్రిక చందా నిమిత్తము**
**రుసుము పంపించవలసిన బ్యాంక్ అక్కౌంటు**

**SRI BHARADWAJA PUBLICATIONS**
Online A/C No. 095510011006491
IFSC Code: ANDB0000955
Andhra Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

E-mail : poorna.sai09@gmail.com
Website : www.saisadguruvani.org
Facebook : SriShiridiSaiSevaTrust

## వినమ్ర విన్నపము


**"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** చందా నిమిత్తము మనియార్డరు ద్వారా రుసుము చెల్లించేవారు **"శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్"** పేరున మనియార్డరు పంపవలెను. బ్యాంక్ ద్వారా చెల్లించేవారు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ అక్కౌంటు నెం. **095510011006491** ఖాతాలో జమచేయవలెను.

**మేము సహితం :** శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు నిర్వహించే సామాజిక సేవాకార్యక్రమాలలో తమవంతు ధన రూపేన సహాయము అందించేవారు, **"శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు"** పేరున మనియార్డరు చేయవలెను. బ్యాంక్ ఖాతాలో జమచేయువారు శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు అక్కౌంటు నెం. **0955 100 11006492** ఖాతాలో జమచేయవలెను.

మీరు పంపిన అక్కౌంటు ననుసరించి సద్గురువాణి సభ్యులుగా గాని, లేక మేము సహితం - సేవాకార్యక్రమంలో గాని నమోదు చేయుటం జరుగుతుంది, గమనించి సహకరించగలరు. **- మేనేజర్**

# స్ఫూర్తి ప్రదాత - స్వామి వివేకానంద

చాలామంది సులభంగా నిరాశకు లోనవుతూవుంటారు. జీవితంలో చిన్న పరీక్షలకు, సమస్యలకే వారు భయపడి విచారగ్రస్తులవుతారు. అటువంటి వారికి స్వామి వివేకానందుని జీవితంలోని ఒక సన్నివేశం చక్కని గుణపాఠంగా ఉపకరిస్తుంది. స్వామీజీయే ఈ సంఘటనను యిలా వివరించారు : "నేను వారణాసిలో వున్నాను. ఒకప్రక్క పెద్ద నీటికొలను, మరొకప్రక్కన ఎత్తయిన గోడవున్న మార్గంలో నేను నడిచిపోతున్నాను. ఆ పరిసరాల్లో చాల కోతులు వుండేవి. వారణాసి కోతులంటే దుండగాలకు పెట్టింది పేరు. తమ వీధిగుండా నన్ను పోనీయకూడదని అవి నిర్ణయించుకున్నాయి. అవి గట్టిగా పట్టుకొనడంతో నేను పరుగెత్తడం ప్రారంభించాను. నేను ఎంత వేగంగా పరుగెత్తానో, ఆ కోతులు అంతకంటే వేగంగా పరుగెత్తుకొచ్చి నన్ను కరవసాగినై. తప్పించుకొనడం అసాధ్యమనిపించింది నాకు. అంతలో 'దుండగుల్ని ఎదుర్కో' అని ఎవరో నన్ను ఉద్దేశించి గట్టిగా అరిచారు. నేను వెనక్కి తిరిగి కోతులను ఎదుర్కొనగానే కాస్త తగ్గి చివరకు పారిపోయాయి. మనం కష్టాలకు వెరువక పారిపోవడం, ఆపినప్పుడు అవికూడా ఆ కోతులవలె వెనకకు తగ్గుతాయి. మనం ఏనాటికైనా విముక్తి సంపాదించుకోవాలంటే అది ప్రకృతిని జయించడం ద్వారానే సాధ్యమవుతుంది తప్ప పారిపోవడం ద్వారా జరగదు. **"పిరికిపందలెన్నడూ విజయాలు సాధించలేరు. భయాలు, యిబ్బందులు, అజ్ఞానం మననువదలి పారిపోవాలంటే మనం వాటితో పోరాడాల్సిందే".**



దేశసంచారం చేస్తూ స్వామిజీ ఆళ్వార్ సంస్థానానికి వెళ్ళారు. మహారాజు ఆయనను రాజమర్యాదలతో స్వాగతించాడు. మహారాజు పాశ్చాత్య ప్రభావానికి లోనైన ఆలోచనలు కలవాడు. విగ్రహారాధనలో ఆయనకు నమ్మకం లేదు. స్వామీజీతో మాట్లాడుతూ దేవాలయాలలో పూజింపబడే రాతి విగ్రహాలనుగురించి మూర్ఖమైన ప్రశ్నలు వేశాడు. విగ్రహాలను ఆరాధించడంకూడా భగవదారాధనలో ఒక విధానమని, అందులో హానిలేదని స్వామీజీ వివరించారు. మహారాజుకు యీ సమాధానం నచ్చలేదు. తన దృక్పథంలోని ఉద్దేశాన్ని స్పష్టం చేయడానికై స్వామిజీ మంత్రివైపు తిరిగి గోడమీద వ్రేలాడుతున్న మహారాజుగారి చిత్రపటాన్ని తీసుకురమ్మన్నారు. మంత్రి ఆ పటంతెచ్చి స్వామిజీకి యిచ్చాడు. మహారాజు చిత్రం మీద ఉమ్మివేయమని స్వామిజీ మంత్రికి చెప్పారు. ఆ మాటకు మంత్రితల తిరగనారంభించింది. "అబ్బే ఆపని నేనెలా చేయగలను?" అన్నాడు. అప్పుడు స్వామిజీ మహారాజువైపు తిరిగి, ఆ చిత్రపటం నిజానికి నిర్జీవమైనదని, కాని నిజమైన మహారాజుకు అది ప్రతీకం కావడం వలన మంత్రి దానిపై ఉమ్మి వేయడానికి నిరాకరించాడని, అదేవిధంగా విగ్రహాలను ఆరాధించడం కూడా దైవారాధనకు ప్రతీకమని, తద్వారా సాధారణ మానవులు ఆధ్యాత్మిక అన్వేషణ చేయగల ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు.

అన్నిచోట్ల స్వామిజీ ప్రసంగాలు ప్రజలకు ఉత్తేజకరం, విజ్ఞానదాయకం అయినాయి. పాశ్చాత్య దేశాల ధనవంతులు, ఉన్నతవ్యక్తులు ఆయనకు అసంఖ్యాకంగా ఆహ్వానాలు పంపారు. ఎక్కడకు వెళ్ళినా ఆయనను ఎంతో గౌరవంగా స్వాగతించి ఆయనపట్ల అపూర్వమైన శ్రద్ధను, ఆదరణను వ్యక్తంచేశారు. కాని తనకు లభించిన సుఖభోగాలేవీ ఆయనకు సంతోషాన్ని యివ్వలేదు. దానికిమారుగా ఆయన భారతదేశంలోని లక్షలాదిమంది పేదల, నిర్భాగ్యుల దైన్యస్థితిని తలచుకొని ఎంతో వేదన అనుభవించారు. అట్టి ఆలోచనలు వచ్చినప్పుడల్లా ఆయన ఎంతో అసౌకర్యాన్ని ఆందోళనను అనుభూతి చెందుతూండేవారు. అప్పుడు తనకివ్వబడిన సౌఖ్యవంతమైన శయ్య దిగి కటిక నేలపై పవ్వళించేవారు. తన దేశ ప్రజలపట్ల వారికున్న ఆత్మీయత యొక్క తీవ్రత అటువంటిది. వారికోసం ఆయన హృదయం ద్రవించింది. వారికోసం ఆయన కన్నులవెంట అశ్రువులు రాలాయి.

1893 సెప్టెంబరు 27న విశ్వమత మహాసభల చివరి సమావేశం జరిగింది. నాటి సమావేశంలో స్వామిజీ పలికిన తుదిపలుకులు స్మరించదగినవి: "ఈ మత మహాసభ ప్రపంచానికి ఏమైనా తెలియజేసివుంటే యిదే: పవిత్రత, విశుద్ధత, దయాగుణాలనేవి, ఏ ప్రత్యేక మతానికి గుత్త ఆస్తులు కావని, ప్రతి జాతిలోను మహోన్నత సౌశీల్యవంతులైన స్త్రీ పురుషులు జన్మించారని రుజువుచేసింది. ఇంతగా సాక్ష్యం వున్నాకూడా ఎవరైనా తమ మతం ఒక్కటి మాత్రమే ప్రపంచంలో నిలవాలని, యితరుల మతాలు వినాశం చెందాలని కలలు గంటూవుంటే అతనంటే నేను హృదయపూర్వకంగా జాలిపడతాను. అనతికాలంలో అన్నిమతాల పతాకాలమీద 'సమరంకాదు-సహకారం', అర్థంచేసుకో - అనర్థం కలిగించకు', కలతలుకాదు - కలకాలపు శాంతి' అని వ్రాయబడతాయని అతనికి తెలియజేయదలుస్తాను". జ్ఞాన సాక్షాత్కారం పొందిన వ్యక్తి నోటినుండి వెలువడి, గొప్పదిగా అభివర్ణించదగిన యీ సామరస్య సహకారం సందేశం ప్రపంచ నాయకులందరిని ఎంతగానో కదిలించివేసింది. "లెమ్ము, మేలుకొనుము, లక్ష్యము చేరువరకు విశ్రమింపకుము", భయపడకుము, ఏలయనగా మానవచరిత్ర అంతయు ప్రజల వెనుక నున్నది. ప్రజలనుండే ప్రపంచపు మహామేధావులెల్లరు ఆవిర్భవించారు. చరిత్ర పునరావృతమే అగును. దేనికి

భయపడకుము.

శ్రీ వివేకానందులు గొప్ప తాత్వికుడు. అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్త్వ శాస్త్రములోనే కాకుండా, సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుంది. రామకృష్ణుడు నేర్పిన ముఖ్యమైన పాఠాలలో 'జీవుడే దేవుడు' అనేది అతని మంత్రముగా మారింది. 'దరిద్ర నారాయణ సేవ' (పేదవారి సేవతో భగవంతుని సేవ) అనే పదాన్ని ప్రతిపాదించాడు. "విశ్వమంతా బ్రహ్మం నిండి ఉండగా మనము మనని గొప్ప వారని తక్కువ వారని ఎలా అనుకుంటాము?" అనే ప్రశ్న తనకు తాను వేసుకుని ఈ తేడాలన్నీ మోక్షము సమయములో కలిగే దివ్యజ్యోతిలో కలిసి పోతాయని తెలుసుకున్నాడు. అప్పుడు పుట్టే ప్రేమ నుండి తమలోని బ్రహ్మాన్ని తెలుసుకోలేని మనుష్యులను ఆదుకునే సత్ప్రవర్తన పుడుతుంది. అందరు తనవారనుకుంటేనే నిజమైన స్వేచ్ఛ లభిస్తుందనే వేదాంత తత్వానికి చెందిన వ్యక్తి వివేకానందుడు. వ్యక్తిగత మోక్షముపై వ్యామోహము కూడా వదిలివేసి, ఇతరులను బంధవిముక్తులను చెయ్యడమే మనిషికి జ్ఞానోదయము అని నమ్మిన మనిషి. శ్రీరామకృష్ణా మిషన్ (రామకృష్ణా మఠము)ను "వ్యక్తి మోక్షమునకు, ప్రపంచ హితమునకు" అనే నినాదము మీద స్థాపించాడు.

సంప్రదాయాలు, దేవాలయాలు మున్నగువాటిని గురించి ఆలోచించకు. మనిషి హృదయంలో జీవిస్తూన్న ఆత్మ వస్తువుతో సరిపోల్చితే అవి ఎందుకూ కొరగావు. ఆ వస్తువే ఆధ్యాత్మిక శక్తి. మొదట ఈ శక్తిని సముపార్జించండి. ఇతర ధర్మాలను నిందించవద్దు. ప్రతి మతంలోను, ప్రతి సిద్ధాంతంలోను, ఎంతోకొంత మంచి వుంటుంది. సోదర ప్రేమ గురించి ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శించండి. త్యాగ, సాక్షాత్కారాలను పొందినవాడే ప్రపంచంలోని సర్వమతాలలోని ఏకత్వాన్ని దర్శించగలడు. వ్యర్థ వాదాలకు ఆస్కారం లేదని గ్రహింపగలడు. అపుడే మానవాళికి సహాయం చేయగలడు. వాస్తవానికి అన్ని మతాలు ఒక సనాతన ధర్మం యొక్క అంశాలు అని స్వామి ప్రబోధం.

- గమ్యం చేరేవరకు ఆగవద్దు. జాగృతులు కండి.
- ఆరంభం అతి స్వల్పంగా ఉందని నిరాశపడవద్దు. ఘనమైన ఫలితాలు క్రమంగా సమకూరుతాయి. సాహసాన్ని ప్రదర్శించండి.
- మీ సహచరులకు నాయకత్వం వహించే తలంపువద్దు. వారికి మీ సలహాలను అందించండి.
- మందలో ఉండకు.... వందలో ఒకడిగా ఉండటానికి ప్రయత్నించు
- ప్రయత్నం చేసి ఓడిపో, కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు...
- కెరటం నాకు ఆదర్శం.... లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు

మొదలైనవి స్వామి వివేకానంద ప్రబోధాలలో కొన్ని.

(మానవాళికి స్ఫూర్తి ప్రదాతగా నిలచిన, ప్రత్యేకించి యువతలో తన ఆచరణాత్మకమైన బోధల ద్వారా స్ఫూర్తి కలిగించి, ఉత్తేజితులను చేసి, ఉన్నత పథంవైపుకు నడిపిస్తున్న స్వామి వివేకానంద జయంతి (జనవరి 12వ తేదీ) సందర్భముగా సమర్పణ.)

సౌజన్యం : **శ్రీ స్వామి వివేకానంద జీవిత చరిత్ర**

సమర్పణ : **శ్రీమతి ఆర్. సాయిసృజన**, బెంగుళూరు.

## దీవెన

ఒక వేటగాడు అడవిలోకి వెడుతున్నాడు. దారిలో అతడికి గుర్రపుస్వారీ చేస్తూ అడవిలోకి వెడుతున్న ఒక రాజకుమారుడు కన్పించాడు. ఇద్దరూ అడవిలోకే వెళుతున్నారు. కనుక కలిసి వెళ్ళసాగారు. వారలా వెడుతుండగా వారికి ఒక తాపసి, ఒక సన్యాసి కనబడ్డారు. వారు కూడా అరణ్యంలోకే వెడుతున్నారని తెలుసుకొని, అందరూ కలిసి ప్రయాణించసాగారు. దారిలో వారికి ఒక కుటీరం కనపడింది. అందులో ఒక ఋషి కూర్చొని ఉన్నారు. ఈ నలుగురు ఆ ఋషికి నమస్కరించారు. ఆయన నలుగురిని నాలుగు రకాలుగా దీవించారు.

రాజకుమారుని "చిరంజీవివై జీవించు నాయనా" అని, తాపసిని "నీకు శీఘ్రమే మృత్యువు ఆసన్నమగుగాక" అని, సన్యాసిని "నీ ఇష్టానుసారం జీవించు లేదా మరణించు" అని, వేటగాన్ని "నీవు చావనూవద్దు, బ్రతకనూ వద్దు" అని ఆశీర్వదించారు. ఆ ఋషి ప్రవర్తన ఆ నలుగురిని ఆశ్చర్యపరిచింది. వారు ఆ ఋషికి నమస్కరించి, "స్వామీ! దయతో మీ ఆశీర్వాదంలోని అంతరార్థాన్ని అజ్ఞానులమైన మాకు వివరించండి" అని ప్రార్థించారు.

ఆయన చిరునవ్వు నవ్వి - అధర్మబద్ధంగా రాజ్యాన్ని పరిపాలించే రాజులకు మరణించిన తరువాత నరకం తప్పదు. "రాజ్యాం తే నరకం ధ్రువమ్". పూర్వజన్మలో భోగభాగ్యాలను ఆశించి తపస్సు చేసినవాడు రాజుగా జన్మిస్తాడు. కోరుకున్న భోగాలను అనుభవిస్తాడు. మరణించిన తరువాత నరకానికి చేరుకుంటాడు. "తపేశ్వరి రాజేశ్వరి; రాజేశ్వరి నరకేశ్వరి" అందువలననే ఈ రాజును చిరకాలం జీవించమని ఆశీర్వదించాను. బ్రతికినంతకాలం సుఖాలను అనుభవిస్తాడు కదా.

తాపసి బ్రతికిఉన్నంత కాలం తపస్సు చేస్తూ, శరీరాన్ని కష్టపెడతాడు. మరణించిన తర్వాత తపఃఫలంగా స్వర్గభోగాలను అనుభవిస్తాడు లేదా మరు జన్మలో మహారాజు అవుతాడు. అందువల్ల తాపసిని శీఘ్రముగా మరణించమని దీవించాను.

సన్యాసి బ్రతికినంతకాలం భగవంతుని సేవలోనో, తోటివారికి ఉపకారం చేస్తూనో గడుపుతాడు. మరణిస్తే పరమాత్మను చేరుకుంటాడు. సన్యాసి జీవించినా, మరణించినా ఆనందముగానే గడుపుతాడు. అందుచేతనే అతడి చావుబ్రతుకులు అతని ఇచ్ఛానుసారమే కలగాలని ఆశీర్వదించాను.

ఇక చివరిగా వేటగాడు, అతడు బ్రతికుంటే మూగజీవులను చంపుతాడు. మరణిస్తే నరక బాధలు అనుభవిస్తాడు. అందువల్ల అతడిని "జీవించనూ వద్దు, మరణించనూ వద్దు" అని దీవించాను అన్నారు ఆ ఋషి.

**సేకరణ : శ్రీమతి కె. సీతాకుమారి**

# అనుగ్రహమూర్తి - శ్రీ బాబుగారు

మహారాష్ట్రలో కాటేల ఆశ్రమ వాసులు శ్రీ గులాబ్‌బాబా, బహుళ ప్రసిద్ధి పొందిన మహాత్ములు. వారు నెల్లూరు దగ్గర విద్యానగర్‌లోని సాయి మందిరములో బాబా పాలరాతి విగ్రహప్రతిష్టకు వచ్చినప్పుడు వారు నన్ను "శ్రీ పాకలపాటి గురువుగారికి సంబంధించిన చిన్న గుడ్డముక్క అయినా యిమ్మని" కోరేరు. అప్పటికి గురువుగారు శరీరం త్యజించి చాలా కాలమైంది. "గురువుగారి ఆదేశం లేనిదే నేనివ్వలేనని, వారి ఆజ్ఞ వుంటే నేనే వారి ఆశ్రమానికి పట్టుకువచ్చి ఇస్తాననీ గురువుగారి ఆస్తి పంచటానికి నేనెవర్నీ" అని అన్నాను. ఇది జరిగి చానాళ్ళయింది. నేనీమధ్య తిరుపతి వెళ్ళినప్పుడు నేను ఒక చిన్న గోడమీద కూర్చున్నాను. శ్రీ గులాబ్‌బాబాగారు ఎక్కడి నుంచి వచ్చారో స్వయంగా అక్కడికి వచ్చి "నాయనా! నా బాకీ తీర్చావు కాదే" అన్నారు. "నేనెవణ్ణి సార్ తీర్చటానికి. అది గురువుగారి ధనాగారం. వారి అనుజ్ఞ లేదు. వారినొక్కసారి కోరండి వారి అనుమతి లభిస్తే ఒక జత బట్టలు నేనే తెచ్చి మీకు సమర్పిస్తాను" అన్నాను. "వారినిప్పుడు నీ ప్రక్కనే కూర్చోబెట్టి చెప్పిస్తాను. ఇస్తావా" అని అడిగారు. సంతోషంగా ఇస్తానన్నాను. ఆయన నాప్రక్కన ఉన్న పిట్టగోడ మీద కూర్చున్నారు. అవతలనుంచి(శ్రీపాకలపాటి) గురువుగారు నడచివస్తున్నారు. గోడ దిగి నమస్కారం చేసుకున్నాను. "శ్రీగులాబ్‌బాబా ఆతృతగా వున్నాడు. చినబాబూ! నా బట్టలేమైనా వుంటే వారికివ్వు" అన్నారు. కొద్దిసేపటికి ఈ అనుభూతి అంతరించింది. శ్రీ గులాబ్‌బాబా లేరు. గురువుగారు లేరు. ఇదంతా సత్యమేనని నాకు తెలుసు. ప్రత్యక్షంగా వారితో సంభాషించాను గదా. ఇది ఏ స్థితిలో జరిగిందో నేను చెప్పలేను. జరగటం మాత్రం నిజం. మేము యింటికి తిరిగివచ్చిన తరువాత శ్రీ గులాబ్‌బాబా యిక్కడ సుబ్బయ్యగారనే ఒక భక్తునకు నాకు చూపించమంటూ ఒక ఉత్తరం వ్రాశారు. . "ఒక తువ్వాలు కాని, చింకిగుడ్డైనా, చివరకు బాబుగారి లంగోటా తాడు ముక్కయినా ఏదో ఒకటి నాకు త్వరగా తెచ్చియివ్వు". నీకు గూడా ఏవైనా ఇస్తే భద్రపరచుకో. వాటి విలువ ఆశ్రమానికి వచ్చినప్పుడు నీకు చెబుతాను. వీటి వలన ప్రయోజనం ఏమిటి? అని చినబాబూ నన్నడిగాడు. ఆ వస్తువులు ఎవరి ఇంట్లో వుంటాయో, మామూలుగా సంభవించే కష్టాలన్నీ తట్టుకొని నిలబడగలిగిన ఆత్మస్థయిర్యాన్నిస్తాయి. చచ్చిపోయిన వాడికి గూడా ఆ బట్టలు ప్రక్కన పెడితే లేచి కూర్చుంటాడు. (అని వ్రాస్తూ దానితోపాటు మరో యిలాంటి 6 అంశాలు కూడ వ్రాశారు). ఆ వస్తువులంత ఉన్నతమైనవి గనుకనే, నేనుగా అడుక్కుంటున్నాను. అడుక్కుంటున్నాను అని 9 సార్లు రాసి సంతకం పెట్టారు. ఆ ఉత్తరము చదవగానే బాబుగారి ఆదేశంతో వెంటనే ఒక తుండు, లంగోటా, పంచె ప్యాక్‌చేసి వారికిచ్చాను. అది అందిన తరువాత వారు ఫోన్‌చేసి చెబుతూ, ఈ ఆశ్రమం షిరిడీ తరువాత అంతటిది అవుతుందని, దివ్యత్వంతో కూడిన ఆలయాల సమూహమవుతుందనీ, రోజుకు 10 బస్తాలు వార్చి అన్నదానాలు జరుగుతాయని భవిష్యవాణి వివరించారు శ్రీ గులాబ్‌బాబా. గురువుగారి తాలూకూ 150 వస్తువులుండగా, ఈ రోజు నాకంటూ ఒక్కటీ లేదు. ఫరవాలేదు. వారే నా హృదయమంతా నిండి వున్నారు. అవి మామూలు వస్తువులు కావు. ఒక దైవనిర్ణీతమైన ఆజ్ఞతో, అవి ఎవరికి చేరాలో వారికి చేరతాయి. మనం దాచుకుందామన్నా వుండేవి కావు. "ఇదొక దైవశక్తి ప్రవర్తన" అంటారు శ్రీ పాకలపాటి గురువుగారిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ దామరాజు వేంకటరామయోగీంద్రులను అతి చిన్న వయస్సు నుండి అచంచలంగా సేవించుకున్న, శ్రీ చినబాబుగా ప్రసిద్ధికెక్కి శ్రీ పొక్కునూరి నరసింహరావుగారు.



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారికి, మార్గనిర్దేశకులై, శ్రీ భరద్వాజగారు వివాహితులై మనందరి మధ్య నిలవటానికి కారణమై, గిరిజనుల పాలిట దైవమైన యోగిరాజు శ్రీ దామరాజు వేంకటరామయోగీంద్రుల (శ్రీపాకలపాటి గురువుగారు) పాదుకలు మరియు వారు ధరించిన వస్త్రాలు, మొట్టమొదటిసారిగా 1995వ సంవత్సరము శ్రావణ బహుళ విదియ రోజున విశాఖపట్నంలోని శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ప్రాంగణములోని సత్సంగమందిరానికి రావటం జరిగింది. ఆ సేతు హిమాచల పర్యంతం పర్యటించి, కొండలు, కోనలు దాటుతూ దుష్ట శక్తులను అణగద్రొక్కి, గిరిజనులకు ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడై, శ్రీ భరద్వాజగారి ద్వారా నేటి యుగావతారమైన శ్రీ శిరిడీసాయి సంప్రదాయ ఔనత్యాన్ని గురించి, కోటానుకోట్ల మందికి తెలియజేసిన శ్రీ పాకలపాటి గురువుగారి పాదుకలు, వస్త్రము, చిత్రపటము సత్సంగ మందిరమునకు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ శిరిడీసాయి సంప్రదాయములో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న పాదుకల ప్రాశస్త్యాన్ని తెలియచేస్తూ ఆనాడు పాదుకామహోత్సవము నిర్వహించటము జరిగింది. . కార్యక్రమము అనంతరము బాబుగారి దివ్యాదేశము అనుగ్రహ ఆశీస్సులతో వారి చిత్రపటము, స్వయముగా ధరించిన వస్త్రములను సత్సంగ మందిరానికి శ్రీ చినబాబుగారు బహుకరించటము జరిగింది. అప్పటినుంచి శ్రీ దత్తావతారుల, అవధూతల, మహాత్ముల పాదుకలు, వారి దివ్య వస్తు, వస్త్ర సముదాయమును ఒక్కచోట

చేర్చి విశాఖపట్నంలోనే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలోను, ఇతర రాష్ట్రాలలో కూడ గత 26 సంవత్సరాలుగా సద్గురువుల పాదుకామహోత్సవాలు శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు విశాఖపట్నం వారి ఆధ్వర్యములో మాత్రమే నిర్వహించటము జరుగుతున్నది. అంతేకాదు గత 16 సంవత్సరాలుగా ప్రతి శ్రావణ పౌర్ణమి నాడు నర్సీపట్నంలోని శ్రీ బాబుగారి ఆశ్రమములో కూడ సద్గురువుల పాదుకామహోత్సవము నిర్వహించటము మాపై బాబుగారికి గల కృపానుగ్రహానికి ప్రతిరూపమే. శ్రీ బాబుగారి విషయ సేకరణ సందర్భముగా శ్రీ చిన్నబాబుగారి ద్వారా బాబుగారు ధరించిన వస్త్రపు విలువను, ఔన్నత్యాన్ని మరొక్కసారి ఆలకిస్తూ (చదువుతూ) ఉంటే శ్రీ పాకలపాటి గురువుగారు ఎంతగా తమ కృపావర్షాన్ని మాపై కురిపించారో అర్థమవుతున్నది.

ఈ ఆశ్రమం గురించి రెండు ముక్కలు చెప్పాలి. “సబ్బవరం దారిలో దేవీపురం అనే గ్రామం. ప్రహ్లాదశాస్త్రి గారని ఆ గ్రామవాసులు, గురువుగారి సమాధి దర్శించి యిక్కడ ఒక్క గాయత్రి చేస్తే లక్ష గాయత్రి చేసినంత ఫలితం కలుగుతుందన్నారు. నీవొక్క కార్యం చేస్తే లక్ష కార్యాలు చేసిన ఫలితం దక్కుతుంది అన్నారు. ఇక్కడ అపారమైన శక్తి నిక్షిప్తమై ఉన్నది. ఇక్కడ మేము అన్నదానానికి 3 బస్తాలు వారుస్తాము. ఎవరెవరిద్వారానో, నాలుగు బస్తాలు వచ్చి చేరతాయి. కార్యక్రమాలు జరుగుతుంటాయి. భోజనాల పంక్తులు లేస్తాయి. వెళ్లేవాళ్లు వెళుతుంటారు. వచ్చేవారు వస్తుంటారు. కార్యక్రమం పూర్తయ్యేసరికి సాయంత్రానికి మళ్ళీ ఎవరిద్వారానో, మా ధాన్యాగారం నిండుతుంది. ఇది ఎవరిశక్తి? అన్నీ చేసేది ఆయనే. ఆ శక్తి లుప్తమైపోలేదు. ఆయన చేసిన కార్యక్రమాలూ ఆగలేదు. అవి కొనసాగుతూనే వున్నాయి. వుంటాయి. వారి కరుణా దృక్కులు మానవాళిని కాపాడుతూనే వుంటాయి. ఇది నిరంతర ప్రక్రియ” అంటారు చిన్నబాబుగారు.

(ఫిబ్రవరి 21వ తేదీ శుక్రవారము శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము సందర్భముగా, శ్రీ చిన్నబాబు తెలియజేసిన విషయాన్ని మీతో పంచుకుంటున్నాము.)

సంకలనము : **'విరించి'**

## ఆదర్శమూర్తి - స్వామి దయానంద సరస్వతి

శ్రీ మూల శంకర్ ఫిబ్రవరి 12, 1824లో గుజరాత్‌లోని ఠంకార అనే గ్రామంలోని ఒక వర్తక కుటుంబంలోని కర్షన్‌ఓలాల్‌జీ శ్రీమతి యశోదాబు దంపతులకు జన్మించాడు. ఆయన తండ్రి ఒక మహా శివభక్తుడు. తన పద్నాలుగేళ్ల వయస్సులో శ్రీశంకర్ ఒక శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి, భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లాడు. ఈ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి “దయానంద” అన్న నామం పొందాడు. భగవంతుని తపనలో అనేక క్షేత్రాలు దర్శిస్తూ మధురలోని స్వామి విరజానంద సరస్వతి దగ్గరకు చేరుకున్నాడు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి, గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలుదేరెరు శ్రీ దయానంద. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నాడు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది, ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన దేశం ఇప్పుడు, అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులెడుతుండటం చూసి శోకించాడు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగుచున్నది. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు, ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసిచలించి పోయి, వాటిని ఛేదించడానికి 'పాఖండ ఖండిని' అన్న పతాకాన్ని ఆవిష్కరించాడు.

భారతదేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి, ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టాడు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించాడు. స్త్రీ విద్య పరిచయం చేసాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం పోవాలని నమ్మి (స్వరాజ్) స్వయం పరిపాలన అని మొదటి సారి గొంతెత్తినాడు. దయానందుడు వ్రాసిన సత్యార్థ ప్రకాశ్‌లో భారతదేశం నుండి సమస్త భారతీయుల మనసులలోని మూఢ నమ్మకాలు, అంధవిశ్వాసాల నిర్మూలన గూర్చి వ్యాఖ్యానించాడు.

ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘ సంస్కరణకు పునాదిగా, 10 ఏప్రిల్ 1875న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజము స్థాపించాడు. ఈ క్రమంలో దయానంద సరస్వతి ఎక్కువమందికి కంట్లో నలుసు అయినాడు. పూర్వం ఏడుసార్లు విషప్రయోగాలు జరిగిననూ బస్తి, న్యోళి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనము చేసుకొని వాటిని విఫలము చేసినను చివరిసారిగా అక్టోబర్ 30, 1883 దీపావళి సాయంత్రము జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకారనాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందాడు. ఆయన తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యంచేసిన వేద భాష్యకారుడు శ్రీ దయానంద సరస్వతి.


(ఫిబ్రవరి 12వ తేదీ శ్రీ దయానందసరస్వతి జయంతి సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **శ్రీ దయానంద వీకీపీడియా**

సేకరణ : **'సత్యేంద్ర'**

# అవతార మెహర్‌బాబా బోధామృతం - నిస్వార్థసేవ

భగవంతుని సాకార, నిరాకార రూపాల పై చేసే ధ్యానానికి, చైతన్యాన్ని ప్రతి హృదయమనే ఆలయంలోకి మరల్చుకోవడం అవసరం. మానవాళికి చేసే నిస్వార్థసేవ ద్వారా విశ్వవ్యాప్తి స్థితిలోని భగవంతుని యందు ఏకాగ్రత కుదురుతుంది. మానవాళి సేవలో పూర్తిగా మునిగిన వానికి ధ్యానంలో లాగే తన శరీరం, మనస్సు మరియు వాటి కర్తవ్యాల యొక్క ధ్యాసే ఉండదు. అందువలన క్రొత్త సంస్కారాలు ఏర్పడవు. అంతేగాక మనస్సుకు బంధనాలుగా ఉన్న పాత సంస్కారాలు చెదిరిపోయి నిర్వీర్యమై పోతాయి. ఇప్పుడు వ్యక్తి యొక్క ధ్యాస తన స్వంత బాగోగుల పైన కాకుండా ఇతరుల సంక్షేమం పైనే కేంద్రీకరించబడినందున అహంకారం తన మూల శక్తిని కోల్పోతుంది. అందువలన నిస్వార్థసేవ, సంస్కార బంధనాల్లో చిక్కుకున్న శక్తిని మళ్ళించి మంచికి వినియోగించుకోవడానికి ఉపకరించే మంచి సాధనం.



ఇసుమంతయినా ప్రతిఫలాపేక్ష లేకుండా, తన సుఖాలు, సౌకర్యాలు కూడా లెక్కచేయకుండా, ఏ రకమైన పొరబాటుకు తావివ్వకుండా సేవ చేసినప్పుడే నిస్వార్థసేవ అవుతుంది. ఇతరుల క్షేమం కోసమే పూర్తిగా అంకితమైతే మీకు మీగురించిన ఆలోచనే ఉండదు. మీ సుఖం, సౌకర్యం గురించి, మీ ఆరోగ్యం, ఆనందం గురించి మీరు పట్టించుకోరు. అంతేగాక మీరు వారి కోసంసర్వం త్యాగం చేయడం కోసం సంసిద్ధులై ఉంటారు. వారి సౌఖ్యమే మీ సౌకర్యం, వారి ఆరోగ్యమే మీ ఆనందం మరియు వారి ఆనందమే మీ సంతోషం. వారి కోసం మీ జీవిత సర్వస్వాన్ని ధారపోయడంలోని మీ జీవితాన్ని కనుగొంటారు. మీరు వారి హృదయాల్లో నివసిస్తూ మీ హృదయాన్ని వారికి ఆశ్రయంగా చేస్తారు. హృదయాల కలయిక నిజంగా జరిగినప్పుడు మీరు ఇతరులతో ఏకత్వాన్ని అనుభవిస్తారు. మీ సహాయం, ఓదార్పు మాట వారికి లేని దానిని సమకూరుస్తుంది. వారి కృతజ్ఞతా భావం ద్వారా, సుహృద్భావం ద్వారా మీరు యిచ్చిన దానికన్నా ఎక్కువే పొందుతారు.

అలా ఇతరుల కోసం జీవించడం ద్వారా మీ జీవితం విస్తరించి విశాలమౌతుంది. నిస్వార్థ సేవాపూరిత జీవితం గడిపే వ్యక్తికి తను సేవ చేస్తున్నాననే భావం కూడా ఉండదు. అతను సేవ జేసే వారు తనకు ఏవిధంగాను ఋణపడి యున్న భావాన్ని కలుగజేయడు. అంతేగాక, సేవ జేసే వారిని సంతోష పెట్టే అవకాశాన్ని తనకు వారు కలిగించినందులకు వారికే ఋణపడినట్లు భావిస్తాడు. ప్రదర్శన కోసం గాని, పేరుప్రతిష్టల కోసంగాని అతడు వారికి సేవ జేయడు. తనకు ఇతరులు సేవ చేసినప్పుడు కలిగే ఆనందాన్నే ఇతరులకు సేవ జేస్తున్నప్పుడు పొందినట్లయితే ఆ వ్యక్తికి నిస్వార్థసేవ పూర్తిగా సాధ్యమౌతుంది. నిస్వార్థసేవ అనే ఆదర్శం ద్వారా అతనికి ఆస్తులు, అధికారం కోసం ఉండే వాంఛలు, స్వార్థంవల్ల చేసే చెడు పనులు న్యూనత మరియు ద్వేషాలు అనే కుసంస్కారాల నుండి విడివడి, పూర్తి స్వేచ్ఛగా జీవిస్తారు.

ఆధ్యాత్మిక అవగాహనతో నిస్వార్థసేవ చేస్తే ఆత్మలాభం చేకూరడమే గాక దానితో సంబంధ మేర్పరచుకొన్న వారికి ఇహపరాలలో కూడ మంచి స్థితికి దోహదపడుతుంది. అందరికి నిష్కళంకమైన వరంగా నిస్వార్థ సేవ కావాలంటే అది అతని ఆధ్యాత్మిక అవగాహనపై ఆధారపడియుండాలి.

సేవ చేయడమనే ప్రక్రియ ఆరంభంలో "నేను ఒకరి కోసం చేస్తున్నాను" అనే భావన చైతన్యంలో ఉంటుంది. దానికి ప్రతికూలమైన భావనను అనగా "ఒకరు నాకు (సహాయం) సేవ చేసే అవకాశాన్ని కల్పించారు" అనే భావన ద్వారా మొదటి భావాన్ని రద్దు చేసుకోవచ్చు. ఈ రెండవ భావం ద్వారా విరక్తి భావం కలిగి మరియు మంచి కర్మల వల్ల ఏర్పడే బంధనాల నుండి కూడా స్వేచ్ఛ లభిస్తుంది. విస్తారమైన పూర్తి అవగాహనతో చేసే సేవ నిస్వార్థంగా ఉండడమే గాక, పూర్ణ వైరాగ్యముతోను చేయబడింది గనుక సేవను స్వీకరించేవాడి ఆధ్యాత్మిక అవసరాలకు సరిపడేదిగా ఉంటుంది. అలాంటి సేవ సాధకుని గమ్యం వైపునకు శీఘ్రగతిని తీసుకొని వెళ్ళుతుంది. సేవయొక్క విలువ దాని ద్వారా పొందే మంచి పైన ఆధారపడి ఉంటుంది. ఇతరుల శారీరక అవసరాలను తీర్చడం సేవే; ఇతరులలో వివేకాన్ని కలిగించడం సేవే; ప్రజల హృదయాలకు ఆహారం అందించడం సేవే; సమాజపు కళాత్మకమైన అవసరాలను తీర్చడం సేవే. ఈ అన్ని రకాల సేవల విలువ ఒకే రకంగా ఉండదు. వాటన్నింటిలోని ఉద్దేశ్యం నిస్వార్థతే అయినా వాటి విలువ సమానంగా ఉండదు. సేవ ద్వారా సాధించ దలచిన సంక్షేమం ఆవ్యక్తి యొక్క దూరదృష్టి పైన ఆధారపడి ఉంటుంది. ఆఖరికి చేకూరే మేలు గురించిన స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి చాలా ముఖ్యమైన మరియు విలువైన సేవను అందించగలడు. ఉన్నతమైన సత్యానుభూతిని పొందని వారు అలాంటి ఉన్నత సేవను అందించలేరు. ఆధ్యాత్మిక అవగాహనలో ఆఖరి మెట్టును అధిరోహించిన వారి లాగా ఇతరుల సృష్టికోసం వారు చేసే సేవతో సమాన విలువ గల సేవనందించలేరు. ఒక రకంగా యదార్థమైన సేవ భగవదైక్యం పొందిన తర్వాతనే ప్రారంభమౌతుంది.

అయినప్పటికి సద్గురువు యొక్క పనితో అనుసంధాన పర్చబడినప్పుడు, సాధకులలోను, మంచివారిలోను ఉన్న సేవాదృక్పథం సద్వినియోగం చేయబడి సృజనాత్మకంగా ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం వాడుకోబడుతుంది. అనంతచైతన్యపు పూర్ణస్థాయి నుండి యావత్ సృష్టికి సేవజేస్తాడు గురువు, **గురువుకు సేవ జేస్తూ గురువు గారికి విధేయులై ఉండేవారు, ఆయన చేసే విశ్వాత్మక పనిలో భాగస్వాములౌతారు. వారి సేవకు ఆయన విజ్ఞత, అంతర్దృష్టి అండగా ఉంటాయి. సద్గురువు పనిలో ఆసక్తితో పాల్గొనడం వల్ల సేవ యొక్క విలువ పెరగడమే గాక ఆధ్యాత్మిక జ్ఞానోదయం కలిగి, ఉన్నతస్థితి లభిస్తుంది.**

(ఫిబ్రవరి 25వ తేదీ అవతార మెహర్‌బాబా జయంతి మరియు జనవరి 31 వారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం : **అవతార మెహర్‌బాబా జీవితచరిత్ర**

సేకరణ : **శ్రీ వి.వి. సత్యన్నారాయణ**, విశాఖపట్నం

# నిత్యజీవితంలో యోగసాధన

యోగసాధన అనేది మన నిత్య జీవన నిర్వహణలో వ్యక్తం కావాలి. రోడ్డుమీద నడుస్తున్నాము. రోడ్డు ఎడమ వైపున నడవాలి అన్న విషయం నియమం ఉన్నది కదా! అది ఎవరు చూస్తున్నా చూడకపోయినా అప్రయత్నంగా మనచేత పాటింపబడాలి. రోడ్డుమీద బూట్లు వేసుకొని నడుస్తున్నాం. మరొకరి కాళ్ళు తొక్కకుండా నడవడం అన్నది చేతకావాలి. తొక్కి 'సారీ' చెప్పుకోవలసిన స్థితి రాకూడదు. 'సారీ' చెప్పినా అవతలవాడి బాధ పోదుకదా! అది మనకు గుర్తుండాలి. అలాగే రోడ్డుమీద గొడుగును పట్టుకొని నడుస్తున్నాం. మరొకరికి ఇబ్బంది కలుగకుండా ఆ గొడుగును పట్టుకోవటం మనకు చేతకావాలి. కొందరు గొడుగును ముడిచి అడ్డంగా చంకలో పెట్టుకొని తిప్పుకుంటూ నడుస్తారు. రోడ్డుమీద రద్దీ వేళలో అలా నడుస్తూ ఉంటే, మీ గొడుగు యొక్క ఇనుపకొన వెనుక వాళ్ళ కళ్ళను తోడివేసినా ఆశ్చర్యపడనక్కరలేదు. కనుక గొడుగును పట్టుకోవడంలో మరొకరికి ఇబ్బంది కలుగకుండా పట్టుకోవడం కూడా అంతే ముఖ్యం. సాయంత్రంపూట నాలుగు వీధులూ కలసిన చోట గుంపులుగా నిబడి మాట్లాడుతూ ఉంటాం. రోడ్డున్నది నడవటానికా మనం అలా నిలబడటానికా? అన్న విచక్షణ మనలో పనిచేయాలి. మామూలుగా నిబడటం చాలక, కొందరు తమ వాహనాలతో సహా నిలబడి మాట్లాటుతూ ఉంటారు. మనవల్ల మిగిలినవారికి ఎంత ఇబ్బంది కలుగుతున్నదో అన్న ఆలోచన కూడా రావడం లేదు. అదీ ఆశ్చర్యం. అలాగే ఇంటిలో చెడిపోయిన, పగిలి పాడైపోయిన వస్తువులన్నీ రోడ్డుమీదకు విసిరే వాళ్ళుంటారు. ఆ రోడ్డుమీదే కొంచెం దూరంలో చెత్తకుండీ ఉంటుంది. అక్కడ దాకా తీసుకువెళ్ళి పడవేసి వచ్చే ఓర్పు మనకు అలవడడం లేదు. అది అలవడాలి. అలాకాక అరటితొక్కలు, గాజుముక్కలు, డబ్బారేకులూ మొదలైనవన్నీ రోడ్డుమీదకు విసరివేస్తే మళ్ళీ ఆ రోడ్డు మీద మనమూ, మన పిల్లలే నడువవలసి ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఇంటితోపాటు రోడ్డుకూడా మనదేనని, అది కూడా శుభ్రంగా ఉండాలని మనకు గుర్తుండాలి. రోడ్డు మనదికాదు అనిపించటంతో మనం చేయకూడని పనులన్నీ దానిమీద చేస్తున్నాం. అలాకాక ఎవరి ఇంటిముందు రోడ్డు వారు చక్కగా ఉంచుకునే ప్రయత్నం చేస్తే అంత బాగుంటుంది! మొత్తం వాడవాడంతా కలిసి వీధి యెడల శ్రద్ధ వహిస్తే ఎంత బాగుంటుంది! మనకా శ్రద్ధ కలగాలి.



కొందరికి ధూమపానం అలవాటు. రద్దీ ప్రాంతంలోని దానిని తీర్చుకోవాలనుకుంటాం. మనతోపాటు ఆప్రదేశంలో ఇంకా అనేకులు ఉన్నారని, వాళ్ళు కూడా క్షేమంగా ఉండాలని మనకు గుర్తుండాలి. వారిలో ఈ పొగపడనివారు ఉండవచ్చు. ఆ వాసనకు తలనొప్పి వచ్చేవారు ఉండవచ్చు. వాంతులు చేసికొనేవారు ఉండవచ్చు. మన చేష్టలకు ఫలితంగా అన్ని జరుగుతున్నా, విలాసంగా ఏమీ పట్టనట్లుగా చూస్తూ, ఇంకా ధూమాన్ని గ్రోలుతూనే ఉండేవారు మనలోనే ఉంటున్నారు. మనసరదా మన అలవాటు అంత మందికి కష్టాన్ని కలిగించకూడదు. అన్న వివేకం మనలో ఉదయించాలి.

అలాగే రైల్లో వెళుతూ ఉంటాం. ఏవేవో తింటూ త్రాగుతూ ఉంటాం. ఆ తొక్కలూ, తోళ్ళూ, పెచ్చులు, పీకలు మొదలైన అవశేషాలన్నీ ఆ బోగీలోనే వదిలివేసి, 'ఎక్కబోయే ప్రయాణీకులారా! స్వీకరించండి. ఇవి మా సంస్కారానికి గుర్తులు' – అన్నట్లుగా మనస్టేషన్లో మనం దిగిపోతూ ఉంటాం. ఆ తరువాత ఆ సీట్లలో కూర్చోవడానికి వచ్చిన వారేమైపోవాలి? ఏమనుకోవాలి! మనమే కొద్ది శ్రద్ధ చూపించి, వాటిన్నింటినీ ఎప్పటికప్పుడు బయటపడవేసి ఉంటే ఎంత బాగుండేది? 'ఎవర్రా ఇక్కడ కూర్చుని వెళ్ళింది?' అని మరొకరు బాధపడేటట్లుగా మనం ప్రవర్తించ వచ్చునా?

ఈ చెప్పబడిన వన్నీ చిన్న చిన్న అంశాలుగానే ఉంటాయికాని, మనలో జరుగుతున్న యోగసాధనకు అను దినమూ ఎదురయ్యే పరీక్షలివి. మనలో సాధన ఏమేరకు జరుగుతున్నదో, వీటిలోని ప్రతి సన్నివేశం పట్టి చూపుతూఉంటుంది. నిత్యజీవిత నిర్వహణను ఇలా నియమబద్ధం చేసుకుంటున్న కొద్దీ మనలో జరుగుతున్న యోగసాధనకు తగిన భూమికను మనం రాపొందించుకోగలిగిన వాళ్ళమవుతాం.


సౌజన్యం : **కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులగారి బోధామృతం**

సేకరణ : **సి.హెచ్. నాగకిరణ్**, శ్రీకాకుళం

# శివస్వరూపి - శ్రీ త్రైలింగస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలానికి చెందిన కుమిలి గ్రామంలో శివభక్తులయిన శ్రీ నరసింగరావు శ్రీమతి విద్యావతీదేవి దంపతులకు 1607వ సంవత్సరములో ఒక మగబిడ్డ జన్మించాడు. అతనికి శివరాముడు అనే పేరుపట్టేరు తల్లితండ్రులు.

1647లో శివరాముని 40వ యేట తండ్రి మరణించాకా, కుటుంబ సంపద, బాధ్యతలు తన సోదరుని వరసయ్యే శ్రీధరునికి అప్పగించారు. శివరాముని తల్లి యొక్క తండ్రి కాళీ ఉపాసకులు. ఆయన తన కూతురు కడుపున జన్మించి తన కాళీ సాధనను కొనసాగిస్తూ, లోకోపకారం చేస్తానని ఆమెకు చెప్పారు. శివరాముని తల్లి ఆయనతో తన స్వంత తాతయ్య (ఆమె తండ్రి) ఇలా శివరాముని రూపంలో పునర్జన్మ పొందినట్టుగా చెప్పి, కాళీ సాధన స్వీకరించమని సూచించారు. తల్లి నుంచి కాళీ మంత్రాన్ని స్వీకరించి దగ్గరలోని కాళికాలయంలోనూ, తల్లినుంచి మరీ దూరంకాని దాపుల్లోని పుణ్యక్షేత్రాల్లో ప్రయాణాలు చేస్తూ కాళికా సాధన కొనసాగించారు. 1669లో ఆయన తల్లి మరణించారు. ఆ తర్వాత ఆమె చితా భస్మాన్ని దాచిపెట్టి ఆమె చితాభాస్మాన్ని శరీరంపై ధరించి అహోరాత్రులు తీవ్రమైన కాళికా సాధన సాగించారు. తల్లి అంత్యక్రియలు చేసిన శ్మశానానికి సమీపంలోనే తన సోదరుడు నిర్మించి ఇచ్చిన ఆశ్రమంలో ఆయన జీవించేవారు. 20 సంవత్సరాల ఆధ్యాత్మిక సాధన తర్వాత తన గురువైన భగీరథానంద సరస్వతిని 1679లో పంజాబ్ ప్రాంతంలో కలిశారు శ్రీ శివరాముడు. భగీరథానంద 1685లో శివరామునికి సన్యాసమిచ్చి, "స్వామి గణపతి సరస్వతి"గా దీక్షానామమిచ్చారు. గణపతి స్వామి తీవ్రమైన తపస్సు చేసి, తీర్థయాత్ర ప్రారంభించి 1737వ సంవత్సరములో వారణాసికి వచ్చి అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. 'త్రిలింగ' ప్రాంతంగా పిలిచే తెలుగు రాష్ట్రం ప్రాంతం నుంచి వచ్చినవారు కనుక శ్రీశివరాముడుని (శ్రీ గణపతిసరస్వతి స్వామి) 'త్రైలింగ' స్వామి అని అక్కడి ప్రజలు పిలిచేవారు.



క్రీ.శ. 1887 సంవత్సరములో పరమపదించేవరకూ శ్రీ త్రైలింగస్వామి వారణాసిలోని అసి ఘాట్, హనుమాన్ ఘాట్, వేదవ్యాస ఆశ్రమం దశాశ్వమేధ్ ఘాట్ వంటి ప్రాంతాల్లో నివశించారు. ఆయన తరచుగా ఘాట్లు, రోడ్లపై నగ్నంగా, పసిపిల్లాడికి ఉండే మనస్తత్వంతో సంచరిస్తూ కనిపించేవారు. గంగానదిపై గంటల పాటు తేలుతూనో, ఈదుతూనో కనిపించేవారని చెప్తారు. ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. కొన్ని కొన్ని సందర్భాల్లో అసలు మాట్లాడేవారే కారు. తమ బాధలను ఉపశమింపజేయగల, నివారించగల యోగశక్తి ఆయనకుంది అని తెలుసుకొని చాలామంది ఆకర్షితులయ్యారు.

శ్రీ త్రైలింగస్వామిని చూశాకా శ్రీ రామకృష్ణ పరమహంస, "తన శరీరాన్ని అభివ్యక్తిక వాహకంగా ఉపయోగించుకుంటూ పరమేశ్వరుడు తానే స్వయంగా వాడుకోవడం చూశాను. ఆయన జ్ఞానంలో అత్యున్నత స్థాయిలో ఉన్నారు. ఆయనకు శరీర స్పృహ లేదు. అక్కడి ఇసుక సూర్యుని వేడిమికి చాలా వేడెక్కి పోయి ఎవరూ పాదం కూడా మోపేలా లేదు, కానీ ఆయన హాయిగా దానిపై పడుకున్నారు" అన్నారు." అంతేకాదు శ్రీ త్రైలింగస్వామి నిజమైన పరమహంస" వారు నివసించినందువల్ల మొత్తం కాశీ వెలుగుతోందని శ్రీ రామకృష్ణ పరమహంస అన్నారు. స్వామి శివానంద సరస్వతి మాట్లాడుతూ "పంచభూతాలు ఆయనను ఏమీ చేయలేని భూతజయ సిద్ధి పొందారని, అగ్ని ఆయనను తగలబెట్టలేదు, నీరు ముంచలేదు" అన్నారు.

త్రైలింగ స్వామి ఎవరినీ ఏమీ అడగరాదన్న "అయాచక దీక్ష" స్వీకరించారు – అడగకున్నా లభించినది ఏదైనా దానితోనే సంతృప్తి పడేవారు. ఆయన ప్రఖ్యాతి వ్యాపించి ఎందరో తీర్థయాత్రికులు, భక్తులు గుంపులుగా సందర్శించటం ప్రారంభించారు. ఆయన 280 ఏళ్ళ పాటు జీవించినట్టు రికార్డులు చెప్తుండగా, అతి తక్కువ ఆహారం తీసుకునే ఆయన శరీరం 140 కేజీలు బరువు ఉండేది. ప్రజల ఇంగితాన్ని పుస్తకం చదివినట్టు చదివేసేవారు. భయంకరమైన కాలకూట విషాలను ఏ దుష్ప్రభావం లేకుండా స్వీకరించేవారు. చివరిరోజుల్లో అజాగరవృత్తి అనుసరించి కొండచిలువలాగా ఏ కదలిక లేకుండా ఉండిపోయే వారు. అలాంటి స్థితిలోని ఆయనపై భక్తులు తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ శివుని ప్రత్యక్షావతారంగా భావించి అభిషేకం చేశారు.


త్రైలింగస్వామి గురించి, ఆయన ఆధ్యాత్మిక శక్తుల గురించి అనేక కథలు గాథలు ఉండేవి, ఆ కథలు దేశమంతటా వ్యాపించి ఆయన భారతదేశంలో ధార్మిక, ఆధ్యాత్మిక వ్యక్తిగా ప్రఖ్యాతులయ్యారు.

గంగా నదిపై రోజులపాటు వాయుస్తంభనం చేసి కూర్చునివుండడం వేలాదిమంది ప్రజలు చూసినట్లు చరిత్ర పుటల్లో ఉంది. కెరటాల కిందకు మాయమై, ఏ ఇబ్బందీ లేకుండా మళ్ళీ కొన్నాళ్ళకు ప్రత్యక్షమయ్యేవారు.

"మనిషి పంచేంద్రియాలు శత్రువులను, ఇంద్రియ నిగ్రహం స్నేహితులనీ" శ్రీస్వామి వర్ణించేవారు. "అసూయపరుడే పేదవాడనీ, ఎప్పుడూ ఒకేలా ఉండగల స్థితప్రజ్ఞుడు అత్యంత సంపన్నుడని" చెప్పేవారు. "మన స్వచ్ఛమైన మనస్సు అతి గొప్ప పుణ్యక్షేత్రమని, వేదాంత సత్యాన్ని గురువు నుంచి పొందమని" సూచించేవారు. "బంధాలు, భ్రమల నుంచి విముక్తి పొందినవాడు సాధువని" పేర్కొనేవారు. "అహమన్న దాన్ని చేయించినవాడే నిజమైన ఋషి" అనేవారు శ్రీత్రైలింగస్వామి. డిసెంబరు 26, 1887 సోమవారం సాయంత్రం ఆయన పరమపదించారు. దశనామి సంప్రదాయానికి చెందిన సాధువులు అంత్యక్రియలు చేసే విధానం ప్రకారం ఎందరో భక్తులు ఘాట్లలో హాజరై ఉండగా ఆయన శరీరాన్ని గంగానదిలో నీటితో సమాధి చేశారు. (పవిత్ర పుణ్యక్షేత్రమైన వారణాసిలో, సాక్షాత్తు శివస్వరూపముగా భక్తులచే కొలువబడిన తెలుగువారైన 'శ్రీత్రైలింగస్వామి' వారి సంక్షిప్త జీవితచరిత్రను ఫిబ్రవరి 21వ తేదీ మహాశివరాత్రి సందర్భముగా మీకందిస్తున్నాము)

సౌజన్యం : **శ్రీ త్రైలింగస్వామి జీవిత చరిత్ర**

సేకరణ : **శ్రీమతి రూపిణి**, మద్రాసు



# జీవిత పాఠాలు

జీవితం అంటేనే బహుముఖ పోరాటం. అందులో సందేహం ఏ మాత్రం లేదు. అయితే అందుకు మనం సన్నద్ధం కావాలి. "అందుకు ఏం చేయాలి"? అన్న ప్రశ్నకు సమాధానం ఎప్పుడూ మనకు తెలుస్తూనే ఉంటుంది.

మన జీవనశైలి మనం తీసుకునే ఆహార వ్యవహారాల మీద, మన ఆలోచనలో నియంత్రణ, సత్సంగం, మంచి పుస్తకాలు చదవటం, సంగీతం, సాహిత్యం, ఆటలు, పాటలు, దైవచింతన, ధ్యానం, యోగం మనకు మన పూర్వీకుల నుంచి ప్రాప్తించిన జీవన ధాతువులు (DNA) ఇత్యాది ఎన్నో విషయాల మీద ఆధారపడి ఉంటుంది.

మనం ఎప్పుడూ ఒంటరిగానే జీవించలేము. మనం సంఘజీవులమే. సంఘానికి దూరంగా మనం కొద్దిసేపే ఉండగలం. మనం ఎప్పుడు మన కుటుంబాలతో విడదీయలేని సంబంధాలు కలిగి ఉంటాం. బాల్యంలో అమ్మనాన్న అక్కలు చెల్లెళ్ళు, అన్నయ్యలు, తమ్ముళ్ళు ఇతర బంధువులతో కలిసి జీవిస్తాము. కాలం గడిచే కొలదీ ఎవరి బ్రతుకులు వారు బ్రతకవలసిందే. దీన్ని మనం త్రోసి రాజనలేం. ఈ క్రమంలో మనం మనల్ని అద్భుతమైన జీవన విధానాలతో తీర్చిదిద్దుకోవాలి.

ఇందుకు మన అమ్మనాన్నల ప్రభావం మన మీద ఎంతగానో పనిచేస్తుంది. ఆ తర్వాత మన చదువు సంధ్యలు తరగతి గదులే జీవిత పాఠాల్ని మనకు బోధిస్తాయి. ఈ విషయంలో అధ్యాపకుల ప్రభావం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అత్యుత్తమ శిక్షణ పొందిన అధ్యాపకులు మన జీవితాల్ని అద్భుతంగా తీర్చిదిద్దుతారు. అమ్మనాన్నల తర్వాత వారి పాత్రే ప్రధానం.

తరగతి గదుల పాఠాలు మనకు అద్భుతమైన విశ్లేషణాత్మక శక్తులు పొంగిపొర్లేలా చేస్తాయి. ఇందుకు సందేహించాల్సిన పనిలేదు. జేమ్సువాట్ ఆవిరిశక్తి కనుగొనటానికి వాళ్ళ అమ్మకుంపట్లో కాస్తున్న వేడినీళ్ళ గిన్నె మీది మూత ఎగిరి ఎగిరి పడటం కారణమయింది, అది జేమ్సువాట్‌ను ఎంతగానో ఆలోచింపచేసింది.

అట్లాగే న్యూటన్ మహాశయుడు చెట్టునుంచి క్రిందపడుతున్న ఆపిల్ కాయను చూసి భూమ్యాకర్షణ శక్తిని సిద్ధాంతకరించాడు. ఇవి చాలు మనం సూక్ష్మ పరిశీలన మనల్ని ఎంత ఎత్తుకు ఎదిగేందుకు సహకరిస్తుందో, సక్రమమయిన ఆలోచనలు మన జీవితాల్ని అద్భుతంగా ముందుకు నడిపిస్తే, నకారాత్మక ఆలోచనలు మనల్ని వ్యతిరేక దిశలో పయనించేటట్లు చేస్తాయి.

ఇప్పుడే మనం జాగ్రత్త వహించాలి. ఇందుకు మన శాస్త్రవేత్తల జీవిత కథలు, ఆత్మకథలు పరిశీలనాత్మక దృష్టితో చదవాలి. అవి ఆవిష్కరించే సత్యాలు మనం మన జీవితాల్లో ప్రవహింపచేసుకోవాలి. ఇక్కడే మన అధ్యాపకులు తమ దృష్టిని కేంద్రీకరించాలి. విద్యార్థులూ తమవంతు కృషి త్రికరణశుద్ధిగా చేయాలి. అప్పుడే మనం మన జీవితాల్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోగలం.

వివేకానందుడి పాఠం ఎన్నిసార్లు చదివినా, విన్నా మనం పొందే ఉత్సాహం అంతా ఇంతా కాదు. ఇంకా ఎందరో మహానుభావులు వారి జీవితచరిత్రలు నీ జీవితరహదారుల్ని కాంతిమయం చేస్తాయి. ఈ విధంగానే మనం మన జీవితాల్ని కాంతిమయం చేసుకోగలం. తమ లక్ష్యాలతో మమేకం అయ్యే స్నేహితుల్తో మన జీవితం నిండిపోవాలి.

పుస్తకాలు, అద్భుతమైన స్నేహితులు, పాఠాల్ని అద్భుతంగా బోధించగల అధ్యాపకులు, క్రమశిక్షణ, అద్భుతమైన జీవనశైలి భౌతికంగా, మానసికంగా, మన వ్యక్తిత్వాల్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాయి. భావోద్వేగాలు సకారాత్మకంగా నీ జీవితంలో అద్భుతాల్ని ఆవిష్కరించటానికి పునాదిరాళ్ళుగా మారిపోతూ మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. ఈ అనుభవం ప్రతి ఒక్కరు పొంది తీరాలి.

ఈ అనుభవంలో పిసరంతే ఎంతో ఆనందాన్నిస్తే అదే కొండంత అయితే దాన్ని మాటల్లో చెప్పలేం! జీవిత అనుభవాలే అక్షరాలై, పదాలై, వాక్యాలై ఈ పేజీలు నిండిపోతూ ప్రవహిస్తుంటే అదే ఆత్మానందం. ఆ ఆనందాన్ని ప్రతి ఒక్కరు ఒడిసి పట్టుకొని తమ జీవితాన్నిండా పొంగిపొర్లేలా కృషిచేయాలి. పండంటి జీవితంలో ప్రతిక్షణం ఆస్వాదిస్తూ కడగంటా అద్భుతంగా జీవించాలి.

తన జీవితం తనకే కాదు. ఇంకా ఎందరిలోనో జీవితం అంటే ప్రేమమయం, ఆనందమయం అన్న కొత్త అనుభూతులు వాళ్ళ జీవితం అంతా నిండి పొంగి ప్రవహించి ఈ విశ్వమంతా నిండిపోవాలి. ప్రతిక్షణం ఉత్సాహభరితంగా మారిపోవాలి. అందుకు ఈ అక్షరాలు నూతనోత్సాహాన్ని నింపుతూ ప్రేరకంగా పనిచేయాలి. అప్పుడే దీనికి సార్థకత అని బలంగా నమ్మటం వల్లే ఈ పనికి పూనుకొన్నాను.

సౌజన్యం : **"మై సిగ్నేచర్"**

రచన : **శ్రీ చెన్నాప్రగడ నరసింహారావు**
విశ్రాంతి కార్యనిర్వాహక ఇంజనీరు (ఎ.పి), సికింద్రాబాదు

# మన సాంప్రదాయాలు

"మా సాంప్రదాయమే వేరు నేను చెవిలో ఉపదేశించను" అన్నారు శ్రీ శిరిడీసాయి బాబా. అయితే వారి సాంప్రదాయమేమిటి? "చూసి నేర్చుకోమని" తెలియజేశారు. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునే వాడు నన్నసలు చూడనట్లే, నీవు చూసేదంతా కలసి నేను" అని బోధించటమే కాకుండా, సకల దేవత, జీవ స్వరూపుడనని ప్రత్యక్ష నిరూపణ చేశారు శ్రీసాయి. మనము కళ్ళు తెరచి చూస్తే ఎదుట నిలచిన సకల చరాచర దృశ్యమానము తన స్వరూపమేనని ప్రత్యక్ష నిరూపణ చేశారు శ్రీసాయిబాబా. అలనాడు అవధూత "సృష్టిలోని 24 మంది గురువుల నుండి జ్ఞానము సముపార్జించానని" శ్రీ యయాతి మహరాజుతో అన్నారు. నేడు సాయి "సహస్ర ముఖాలుగా, సహస్ర విధాలుగా బోధిస్తున్నారు, అయితే చూడటము, వినటం చేతకావాలి" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజ గారు. నిత్య జీవితములో మనకు ఎదురయ్యే ప్రతి వ్యక్తి, మాట, చర్య, సంఘటన చివరకు ప్రకృతి సహితం అనేక రూపాలలో అనేక విధాలుగా బోధిస్తూనే ఉంటుంది, గ్రహించగలుగుతున్నామా? లేదా అనేది, వ్యక్తిగతము. సృష్టిలో నిరంతరం మార్పు జరుగుతూనే ఉంటుంది. మనలో కూడ జరిగే ఆమార్పును ప్రత్యేకించి మన ఆలోచనలను, దానికి అనుగుణమైన చర్యలు మొదలైనవి నిరంతరం గమనిస్తూ సరిచేసుకుంటూ, ఉత్తమ పథంవైపు సాగటము మన కర్తవ్యం. "సృష్టిలో మార్పు అనివార్యం అయితే ఆ మార్పు పండు పండటము లాగా కావాలి గాని, కుళ్ళిపోవటము కాకూడదు" అంటారు మాస్టర్ ఇ.బి. పూత, పిందె అయ్యి, కాయగా మారి, పండుగా అవ్వటం సక్రమము అయితే కాయ కుళ్ళిపోయి మధ్యలో చెట్టునుండి రాలి పోవటం అక్రమము. "మనిషిగా జన్మించినందుకు, జన్మసార్ధకత చెందించుకోవటము సక్రమము కాగా, మనిషిగా పుట్టి, హీన జన్మకు దిగజారే విధముగా జీవించడం అక్రమము" అంటారు అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు.

మానవ జన్మ సార్ధకత చెందించుకునే రీతిలో మనుగడ సాగించమని, భావగర్భముగా బోధించి, మనచేత శ్రీసాయి చెప్పి చేయించిన పండుగ, గురుపూర్ణిమ అనే వ్యాసపూర్ణిమ. విష్ణు స్వరూపమైన వ్యాసుడు జన్మించిన ఆషాడ పౌర్ణమిని వ్యాస పూర్ణిమ అంటారు. అపారమైన వేదరాశిని, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము అనే నాలుగు భాగాలుగా విభజించి, వాటి ఉపాంగాలు, శాఖలు, ఏర్పాటుచేసి, ఇంకా సరళీకృతముగా, అష్టాదశ పురాణాలుగా అందించి, కలియుగములో మానవజాతి తనను తాను ఉద్ధరించుకోవటానికి అనేక శాస్త్రాలు అందించటమే కాకుండా, నిత్య నైతిక కర్మలను కూడ మానవాళికి తెలియజేసి ఆది గురువైనాడు శ్రీ వేదవ్యాసుడు. ప్రత్యేకించి జననం నుండి మరణం వరకు మనిషి చేయవలసిన సంస్కారాల పంచదశ సహిత, షోడశ సంస్కారము గురించి, కూడ అత్యంత విపులముగా మనకందించారు శ్రీవేదవ్యాసుడు. శాస్త్రాలను వారి సంస్కారాలు, అవసరాలననుసరించి వ్యాఖ్యానిస్తూ, ఆచరిస్తూ, సామాన్యులను సందిగ్ధంలో పడవేస్తున్న వారికి వాటి అంతరార్ధాన్ని తెలియజేసి ఆచరింపచేయటానికే అవతరించారు, త్రిమూర్త్యాత్మకుడు శ్రీదత్తావతారుడు అయిన శ్రీ శిరిడీసాయిబాబా. "శాస్త్రాలు ఎన్నటికీ అబద్ధము కాదు, మంత్రాలు ఎన్నటికీ అబద్ధంకాదు, పనికిమాలిన అన్వయాన్ని బుర్రలో పెట్టుకొని ప్రవర్తిస్తున్నావు" అన్నారు ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీసాయిబాబా. ఒక ఏకాదశినాడు ఉల్లిపాయ తినటం తప్పుకాదు అంటూ వాదించిన భక్తుడిని, వారించలేదు. కటిక ఉపవాసము ఉంటానన్న శ్యామాను కాదనలేదు శ్రీసాయి, వేరొక భక్తుడితో "ఒక్కరోజు భోజనం లేకపోతే అంత బాధ పడిపోతున్నావేమిటి? 12 సంవత్సరాలు కేవలం వేపాకు తిని నా గురువును సేవించాను" అన్నారు శ్రీసాయిబాబా. అటువంటి ఉదాహరణలు శ్రీ సాయిచరిత్రలో అనేకం కలవు. వారి వారి గతజన్మ సంస్కారాలను ఎరిగిన సాయి, తగురీతిన వారికి బోధ చేయటము జరిగింది. గురువెన్నడూ శాస్త్రాలను త్రోసివేయడు, వాటిని నిజం చేయటానికి, వాటి ఆంతర్యం గోచరింపచేసి, ఆచరింపచేయటానికే మనమధ్యకు వస్తారు, ఒకవేళ వారు బోధించినది శాస్త్ర విరుద్ధముగా అనిపించినా, గురువాక్యమే ప్రమాణికము. "సద్గురువు సన్నిధికి చేరిన తరువాత శాస్త్రషట్కంతోగాని, సాధన సంపత్తితోగాని అవసరం లేదు" అని శాస్త్రవాక్యం.

సాయి బోధలలోని అంతర్యాన్ని, ఆంతరార్ధంతో పాటు మన హైందవ ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాలు ప్రత్యేకించి తెలుగు సాంప్రదాయాల గురించి, మన పూర్వీకులు తెలియజేసిన విషయాలను శ్రీసాయి సాంప్రదాయాన్ని అనుసరించి మీతో ముచ్చటించుకోవాలనే సదుద్దేశ్యమే "మన సాంప్రదాయాలు" అనే శీర్షిక ముఖ్య ఉద్దేశ్యము. ఒకసారి చిన్నారులతో సత్సంగమము నిర్వహిస్తూ, మనము నిత్యము త్రాగే పాలు ఎక్కడనుంచి వస్తాయి

అని అడిగితే 'ప్యాకెట్ల ద్వారా' వస్తాయి అన్న వారి సమాధానము విని అందరూ నవ్వుకున్నాము. పరిస్థితి అట్లుంటే, మన సనాతన భారతీయత మాటేమిటి? నేటి ప్రచార ప్రసారమాధ్యాలు, చలన చిత్రాలు, అంతర్జాలము ద్వారా అనవసర విషయాలలో ఆసక్తి కనిపించే నేటి యువతరం, కొందరు తల్లి, తండ్రి, గురువుపట్ల కూడ కనీస గౌరవ మర్యాదలు చూపకపోగా, అగౌరవంగా ప్రవర్తించటము జరుగుతుంది. వినయము, సౌశీల్యము, సౌభ్రాతృత్వము, సేవ, సామాజిక స్పృహ కలిగించాల్సిన విద్యను, కేవలము సంపాదన కొరకు మాత్రమే అని భావిస్తూ, అభ్యసించటము జరుగుతున్నది. అటువంటి పరిస్థితులలో మనసాంప్రదాయ, ఆచార వ్యవహారాలు అపహాస్యము కాకుండా మరేమవుతాయి. వాటిని ఆచరించి, ఆదరించకపోయినా ఫరవాలేదు అపహాస్యము చేయరాదు, చేయకూడదు అని, వాటి అంతరార్ధాన్ని మీ అందరితో కలిసి పంచుకునే చిరుప్రయత్నమే ఈ శీర్షిక లక్ష్యం. తద్వారా ఆచరించే వాటిని సరిచూసుకోవటముతో పాటు, విషయ సేకరణలో భాగముగా మరిన్ని విషయాలు మేము తెలుసుకుంటూ, మీతో పంచుకునే అవకాశం మాకు కలుగుతుంది. విషయం తెలుసుకోవటములో తప్పులేదు, అది తప్పా, వప్పా, ఆచరించటమా, లేదా అన్నది వారి వారి అవకాశాలు, శారీరక, మానసిక, భౌగోళిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

సకల వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాల సారమైన 'శ్రీగురుచరిత్ర'లో 1వ అధ్యాయము నుండి 24వ అధ్యాయం వరకు 'జ్ఞానకాండ' గాను, 25వ అధ్యాయం నుండి 37వ అధ్యాయం వరకు 'కర్మకాండ' గాను, 38వ అధ్యాయం నుండి 52వ అధ్యాయము వరకు 'భక్తికాండ' గాను విభజించి శ్రీగురుచరిత్రను కాండత్రయాత్మకమైన పవిత్ర గ్రంధముగా శ్రీ వాసుదేవానంద సరస్వతిస్వామి మనకు అందించటము జరిగింది. వీలువెంట శ్రీగురుచరిత్రలోని అంశాలను కూడ ప్రస్తావించుకొనటానికి ప్రయత్నిద్దాం.

'శ్రీ భరద్వాజ సద్గురువాణి' 20వ వసంతములోనికి అడుగిడే శుభసందర్భములో 2020 జనవరి సంచికతో, "మన సాంప్రదాయాలు'' అనే శీర్షిక ప్రారంభిస్తున్నామని తెలియజేసుకుంటూ మరిన్ని విషయాలు వచ్చే సంచికలో మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తాము. అందుకు మీ సలహాలు, సూచనలు, విషయ విశేషాలు మాకు పంపటము మరువకండి

**– సంపాదకులు**

# అరచేతులు ఎందుకు చూసుకోవాలి..?

ఉదయం నిద్ర లేవగానే అరచేతులు చూసుకోవాలంటారు.

**వివరాల్లోకి వెళితే :**

సాధారణంగా మనం ఏదైనా పని చేసినప్పుడు ఆ పని మనకు కలిసిరాకపోతే పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూసానో అని అనుకుంటూ బాధపడతాం కదా. అలా బాధ పడకుండా ఉండాలంటే, ఉదయం నిద్ర లేచిన వెంటనే మీ అరచేతులు చూసుకుంటూ ఈశ్లోకాన్ని పఠిస్తూ దిన చర్యను ప్రారంభిచాలి.

**శ్లోకం**
**కరాగ్రే వసతే లక్ష్మీ...**
**శ్రీకరమధ్య సరస్వతి...**
**కరమూలే తూ గోవిందః....**
**ప్రభాతే కరదర్శనం. ...**




అంటే మన చేతి వేళ్ళ చివరన లక్ష్మీదేవి, మధ్యలో సరస్వతి, ముంజేతి దగ్గర సాక్ష్యాత్తూ ఆ విష్ణుమూర్తి కొలువై యున్నారని అర్థం. అందుకే ప్రాతఃకాలమున నిద్రనుండి మేల్కొనగానే పై శ్లోకం చదివి మన రెండు చేతులను కళ్ళకు అద్దుకుని మూడుసార్లు శ్రీహరి, శ్రీహరి, శ్రీహరి అని తలుస్తూ మన ముఖాన్ని నిదానంగా తుడుస్తూ కళ్ళు తెరచి అరచేతులను చూడటం వలన ఆధ్యాత్మిక భావన మనలో కలుగుతుంది. కాబట్టి ఉదయం లేవగానే కరదర్శనం చేసుకోవాలని, అలా చేస్తే అంతా మంచే జరుగుతుందని మన పురాణాలు చెప్పుతున్నాయి.

**ఇక సైన్సు పరంగా చూస్తే :**

మనిషి శరీరం ఒక విద్యుత్ కేంద్రం. రాత్రంతా నిద్రపోయి మెలకువ రాగానే కన్నులు తెరచినప్పుడు మన దేహంలోని విద్యుత్‌శక్తి (ఎనర్జీ) మన కన్నుల ద్వారా బయటకు వస్తుంది. మనకు ఎదురైన మనిషిలో దేహశక్తి ఎక్కువైతే ఆ ప్రభావం మనమీద పడుతుంది. అదే మన ఎదుటివారి దేహశక్తి తక్కువైతే మన ప్రభావం వారి మీద పడుతుంది. ఈ ప్రభావం వలన శరీరం, మనస్సు అదుపు తప్పి చేయకూడని కార్యాలు చేసి ఊహించని సమస్యలు తెచ్చుకుంటారు. అలా కాకూడదని లేవగానే అరచేతులు రుద్దుకుని కళ్ళకద్దుకుని ఆపై లేచి భగవంతుడి చిత్రపటాన్ని చూడమంటారు. దీనివల్ల మనలోని పాజిటివ్ ఎనర్జీ కాని, నెగెటివ్ ఎనర్జీ కాని మనలోనే మిళితమై ఎలాంటి వత్తిడికి మనం లోనుకాము.

ఏది ఏమైనా ఉదయాన్నే కరదర్శనం శ్రేయోదాయకం అని తెలుస్తుంది. అలాగే మన హైందవ ధర్మానికి పట్టుకొమ్మలు మన ఆచారాలే కాబట్టి ఆచారాలను ఆచరిస్తే మన స్వీయ రక్షణను కూడా మనం పొందగలుగుతామనేది అక్షర సత్యం.

# పెనుమత్స శ్రీ మహాయోగిని

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలోని పమిడి ముక్కల మండలము, పెనుమత్స గ్రామములో నివాసియైన శ్రీ చెరుకూరి బ్రహ్మయ్య, శ్రీ రామమ్మ పుణ్యదంపతులకు 1921వ సంవత్సరము ఆగష్టు 27వ తేదీ శుక్రవారము రోజున 4వ సంతానముగా ఆడపిల్ల జన్మించెను. తల్లిదండ్రులు ఆ బిడ్డకు పెట్టిన పేరు సీతమ్మ. తన ఐదవ ఏట అక్షరాభ్యాసము ప్రారంభించిన సీతమ్మ కేవలము 4వ తరగతి వరకు చదవగానే తల్లిదండ్రులు గండిగుంట గ్రామ వాస్తవ్యులైన 15 సంవత్సరాల శ్రీసీతారామయ్య కిచ్చి 1929లో వివాహము జరిపించిరి. 1937వ సంవత్సరములో 16 సంవత్సరాల వయస్సులో శ్రీసీతమ్మ 23 సంవత్సరాల తన భర్త దగ్గరకు మొట్టమొదటి సారిగా కాపురానికి వెళ్ళెను. భార్యాభర్తలు ఇద్దరు అన్యోన్యముగా సంసార జీవితము కొనసాగిస్తుండగా, 1939లో కుడిచేతిమీద లేచిన పుండు కారణముగా తీవ్ర జ్వరము వచ్చి ఎన్ని వైద్యాలకు లొంగక, శ్రీ సీతారామయ్య శివరాత్రి పర్వదినాన శివైక్యము చెందెను.



పుట్టింటికి తిరిగి వచ్చిన శ్రీ సీతమ్మ ఒంటిపూటే భోజనము చేస్తూ, నామాన్ని జపిస్తూ, రామకోటి వ్రాయటం మొదలు పెట్టేరు. తనలో కలిగిన తీవ్ర సంకల్పము ద్వారా 1942 సంవత్సరములో దాదాపు కఠిన నియమాలతో రోజూ 6 గంటలపాటు 6 నెలలు సూర్యోపాసన కొనసాగిచ్చారు.

1945వ సంవత్సరము తాను పూర్తి చేసిన రామకోటి వ్రాతప్రతిని, భద్రాచల రాముని సన్నిధిలో సమర్పించి వచ్చారు. 1946 సం॥లో యోగ, వ్యాయామ విద్యా ప్రవీణులు శ్రీ కమ్మల అప్పన్నగారి వద్ద యోగాభ్యాసము నేర్వటం ప్రారంభించిన శ్రీ సీతమ్మ అనతి కాలంలోనే దాదాపు 25 ఆసనాలు అతి సులభముగా నేర్చుకొని ప్రదర్శించేవారు. శ్రీసీతమ్మ ఒక చెక్క పెట్టెలో కూర్చొని, దానిని మూసివేసి, వాయుబంధనము గావించి, తన యోగాభ్యాసము కొనసాగించిరి. 1948వ సంవత్సరములో శ్రీసీతమ్మ యొక్క అద్భుతమైన యోగాన్ని చూసిన వారందరు పెనుమత్స శ్రీమహాయోగినిగా కీర్తించసాగేరు. శ్రీ రామావధూత దీవెనలతో, ధృఢసంకల్పముతో ఒక తడికెల గదిలో 4నెలలపాటు కదలక మెదలక నిర్వికల్ప సమాధి స్థితిలో నిలిచారు. శ్రీయోగిని శరీరమంతా జల్లెడవలె రంధ్రములు పడి రక్తము కారుచుండెను. అది చూసి భయపడి శ్రీ అప్పన్నగారికి కబురు చేయగా, ఆ స్థితిని చూసిన శ్రీ అప్పన్నగారు "భయపడవలసినది లేదు. ఆమె యోగనిష్ఠలో ఉన్నది, త్వరలో అది పూర్తయి, ఆమె శరీరము యధాస్థితికి వచ్చును" అని చెప్పెను. శ్రీయోగిని యధావిధిగా తడికెల గది(కుటీరము) మూసివేసి దాదాపు 1951వ సంవత్సరము వరకు సమాధి స్థితిలోనే ఆగదిలోనే గడిపెను. అటువంటి సమయములో అనేకమైన అద్భుతమైన దర్శనాలు తనకు కలిగెనని, "సత్యాత్మ జ్ఞాన యోగసాధన మోక్ష గ్రంథము"లో శ్రీయోగిని తెలియజేశారు. 1952వ సంవత్సరములో శ్రీ అప్పన్నగారి కోరికమేర తన గది వీడి బయటకు వచ్చి ప్రజలకు దర్శనమిచ్చేరు శ్రీయోగిని. నిరంతరము యోగనిష్ఠలో ఉండటము వలన శరీరము ఎముకల గూడువలె తయారయింది. దివ్య వర్చస్సుతో వెలిగిపోతున్న ఆమె ముఖము, పడగాకృతి వలె ఆమె తలపై గల శిరోజాలను చూసి ప్రజలు అచ్చెరువు పొందేరు. ఆమె చుట్టూ సుగంధ పరిమళం వ్యాపించి ఉండేది. 5రోజుల పాటు ప్రజలకు దర్శనమిచ్చి తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయారు. 1953, 1954, 1955, 1956 సంవత్సరాలలో కూడ కొన్నిరోజులు బయటకు వచ్చి, ప్రజలకు దర్శనమిచ్చేవారు. ఆ సమయములో శ్రీయోగిని తాను వ్రాసిన హఠయోగము, రాజయోగము, ఆత్మ రామాయణము, పిండోత్పత్తి, నిర్గుణపు పుత్రేషణ మొదలైన స్వహస్త లిఖిత గ్రంథములు బయటకు ఇచ్చేవారు.

చిన్న వయస్సులోనే జీవితంలో జరిగిన విషాద సంఘటనకు కృంగిపోక, అత్యంత పట్టుదలతో, పురుషులకే పరిమితమైన యోగాభ్యాసములో అత్యున్నత స్థానానికి ఎదిగి, కేవలము తన దర్శనంతోనే ప్రజలలో ఉత్తమమైన మార్పుకు కారణమై, స్త్రీజాతికే తల మానికముగా నిలచిన, శ్రీశ్రీశ్రీపెనుమత్స మహాయోగినిగా ప్రసిద్ధికెక్కిన, శ్రీసీతమ్మ 1957వ సంవత్సరము ఫిబ్రవరి 9వ తేదీన తెల్లవారుఝామున మేళతాళములతో, భజనతోనూ వేలాది ప్రజలతో ఊరేగింపుగా తన స్వగృహము నుండి, ఆ పచ్చటి పొలాల మధ్యగల తన యోగగది వరకు ఊరేగింపుగా వచ్చి, వేలాదిమంది చూస్తుండగా, ఆ గదిలో తాను యోగముద్రలో కూర్చుని, బ్రహ్మరంధ్రము ద్వారా తుదిశ్వాస విడిచారు. ఆమె శరీరముపై అద్భుతమైన సమాధి నిర్మించారు. తిరిగి 1958 మార్చి 5వ తేదీన సజీవముగా సమాధిలో కూర్చుని అందరికీ యోగిని దర్శనమిచ్చారు. లక్షలాదిమంది ఆ జీవన్ముక్తురాలిని దర్శించి పునీతులయినారు. పెనుమత్స గ్రామములోకి అడుగిడుతూనే ఆహ్వానము పలుకుతూ దర్శనమిచ్చే ఆమె సమాధి మందిరము మనలను ఉన్నత స్థితికి ఎదగమని తెలియజేస్తూ ఉంటుంది.

(కృష్ణాజిల్లా విజయవాడ నుండి గుడివాడ వెళ్ళు రహదారిలో పెనుమత్స గ్రామం కలదు)

(ఫిబ్రవరి 9వ తేదీ శ్రీపెనుమత్స మహాయోగిని సమాధిమందిర ప్రవేశ సందర్భముగా ప్రత్యేక వ్యాసము)


సౌజన్యం : **'పెనుమత్సయోగిని జీవితచరిత్ర'**

సేకరణ : **శ్రీమతి వి.ఎస్.లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# సిద్ధులు - వ్యాధులు

"శ్రీ రామకృష్ణ పరమహంసకి గొంతు కేన్సరు వచ్చిందట. భగవాన్ రమణమహర్షికి కూడా కేన్సరు వచ్చిందట. పూర్వజన్మలో చేసిన పాపం వ్యాధి రూపంలో పీడిస్తుందని కొందరు చెబుతారు. మరికొందరు శ్రీ రామకృష్ణ పరమహంసని, శ్రీ రమణమహర్షిని అవతారమూర్తులు అంటారు. ఇదంతా గందరగోళంగా ఉంది. ఇలాంటి విషయాలను గూర్చి ఏమని అర్ధం చేసుకోవాలి?"

మొదటిది శ్రీ రామకృష్ణ పరమహంసకి, శ్రీ రమణమహర్షికి పూర్వజన్మలు లేవు అని అనకోనక్కరలేదు. పూర్వజన్మలుంటే అవతారం కాదు అనీ భావించనక్కరలేదు. తనకీ, అర్జునుడికీ కూడ చాలా జన్మలు గడచినవనీ, తాను వానినెరుగుదునని శ్రీ కృష్ణుడు భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడు. అవతారం అన్నది దిగివచ్చే వెలుగుకి సంబంధించేది కాని, దేహానికి సంబంధించినది కాదు. దేహం భౌతిక ద్రవ్యంతో ఏర్పడి ఉన్నది, కనుక దాని ధర్మాలు దానికి వర్తిస్తాయి. దాని కర్మననుసరించి అది పరిణామాన్ని చెందుతుంది. దేహం ధర్మసాధకమైన ఒక పనిముట్టు. దానికి కలిగిన పరిణామాలకీ, ఆ దేహంలో నివాసం ఉన్న అవతారమూర్తియైన వెలుగుకీ ఏమీ సంబంధం లేదు.




ఇక పూర్వజన్మ కృతమైన పాపం వ్యాధి రూపంలో పీడిస్తుంది అన్న విషయం సత్యమే. కాని అది దేహంలో ఉన్నవాడు పీడింపబడే స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే సత్యమవుతుంది. శ్రీ రమణ మహర్షి దేహానికి వ్రణం కలిగినప్పుడు ఆయన పీడింపబడలేదు అన్న విషయం అందరికీ తెలిసిందే. దానిని ఆపరేషన్ చేసేటప్పుడు కూడా ఆయన పీడింపబడలేదు. మత్తుమందు అక్కరలేకుండానే ఆయన ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ చేస్తూ ఉన్నంతసేపూ తాను ఆ భాగంలో ఉండటం మానివేశారు. అది అప్పటివారు కళ్ళారా చూచినదే. ఇక బాధపడే వారికి వ్యాధులు పూర్వజన్మకృత పాపం వల్ల కలుగుతాయి. కానీ అందరికీ కాదు. వ్యాధులు అందరికీ ఒకే కారణం వల్ల కలుగవు. కర్మబద్ధులైన వారికి పూర్వకర్మ వల్ల కలుగుతాయి. సిద్ధ పురుషులకు వేరే కారణాల వల్ల కలుగుతాయి. వారు చేసిన ఆధ్యాత్మిక సాధన వలన ప్రాణామయ శరీరంలో జరిగిన మార్పులకు భౌతిక శరీరం ఒక్కొక్క పరిస్థితులలో వ్యాధిగ్రస్తం అవుతుంది. జీవుడు భౌతిక శరీరాన్ని అనేక పర్యాయాలు ధరిస్తూ వదులుతూ ఉంటాడు అనే సత్యం అనుభవానికి వచ్చాక, కొందరు శరీర కర్మను గూర్చి అంతగా పట్టించుకోరు. కొందరు యోగాభ్యాసం వల్ల శరీరాన్ని కూడా పరిశుద్ధి చేసుకోవటానికి కృషిచేస్తారు. కొందరికి దానిమీద అంత పట్టింపు ఉండదు. ఒక్కొక్కప్పుడు వారు అవతరించిన పని వలన కొందరికి దేహసేవ చేసుకునేందుకు తీరుబడి కూడా ఉండకపోవచ్చును. అప్పుడు శరీరం దాని కర్మ అది అనుభవించి తీరుతుంది.

ఇక సిద్ధులకు అవతార పురుషులకు ఇలాంటి వ్యాధులు ఎందుకు రావాలి అనే ప్రశ్న ఉండదు. వారికి పూర్వకర్మ బంధం తొలగిపోయిన తరువాత ఇంక ఏ కర్మవలన ఇలాంటి వ్యాధులు కలుగుతాయి అన్నది ఒక ప్రశ్న. ఒక్కొక్కప్పుడు ఆ సిద్ధుడు దేహం ధరించిన జాతికి సంబంధించిన కర్మ అతని దేహం ద్వారా వ్యక్తమై ఇలాంటివి జరుగుతాయి. మరొక్కప్పుడు యావన్మానవ జాతి విమోచనాన్ని గూర్చి ధ్యాన తపస్సులు చేసేవారికి కూడా వారి దేహం ద్వారా కొంత జాతి దుష్కర్మ ఇలా వ్యక్తం అవటం కద్దు. మరొక్కప్పుడు తమను ఆశ్రయించిన వారి దుష్కర్మ కూడా ఈ విధంగా వ్యక్తమై పరిష్కారం జరుగుతుంది. వారి అవతార తత్వానికి దీని వలన ఏవిధమైన లోపం కలుగదు. ఇతర మానవులు ఆశ్రయించేది దేనికోసమో, అదే వారి జీవిత పరమార్ధం.

శ్రీ శిరిడీ సాయిబాబా కూడ ఉబ్బస వ్యాధితో బాధపడేవారు. అది భౌతిక శరీరానికే గాని, ఆత్మస్వరూపులైన వారికి ఆ బాధలు అంటవు. భక్తులను కాపాడటము కోసం, వారి వ్యాధులను కూడ జగద్గురువులు స్వీకరించటం జరుగుతుంది. ఉడికే అన్నాన్ని కలిపినా కాలని బాబా చేయి, మండే కొలిమిలో పడ్డ బిడ్డను రక్షించటం కోసం ధునిలో చేయి పెట్టి శ్రీ సాయి తన చేయిని కాల్చుకోవటం చరిత్రలో చూడవచ్చు. అంతే కాక శిరిడీలో ప్రవేశించినపుడు తనను అన్నగా భావించి, సేవించిన బయ్యాజీబాయికి ఇచ్చిన మాట కోసం, ఆమె కుమారుడైన తాత్యాకోతేపాటిల్‌ను తన ప్రాణం అడ్డుపెట్టి కాపాడిన విషయం కూడ శ్రీ శిరిడీ సాయిబాబా చరిత్రలో చూడవచ్చు.

కనుక సిద్ధపురుషులు, వ్యాధులు అనుభవించటము బాహ్యానికే గాని, వారి ఆంతర్యానికి, ఆత్మకు, అవతారానికి సంబంధించింది కాదు. అవి వ్యక్తం అవ్వటము, తనను ఆశ్రయించిన వారిలోని మానవత్వాన్ని మేల్కొల్పటానికి, అది తనను ఆశ్రయించిన వారి సంస్కారముననుసరించి తెలియజేయటము జరుగుతుంది.

సౌజన్యం : **శ్రీమాన్ కులపతి కృష్ణమాచార్యుల ఉపన్యాసములు**
సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష,** గోవా




## పంచభక్ష్యాలు

పంచభక్ష్యాలు అనగా ఐదు రకాలైన ఆహార పదార్థాలు. ఎవరైనా మంచి భోజనం పెడితే పంచభక్ష్య పరమాన్నాలుతో భోజనం పెట్టారు అనటం పరిపాటి. అవి

1. భక్ష్యం – భక్ష్యం అనగా నమిలి తినే పదార్థము
2. భోజ్యము – భోజ్యము అనగా చప్పరిస్తూ తినేది
3. చోష్యము – చోష్యము అనగా జుర్రుకునేది
4. లేహ్యము – లేహ్యము అనగా నాకబడేవి
5. పానీయము – త్రాగేవాటిని పానీయాలు అని అంటారు.

## భస్మం అనగానేమి?

భస్మం అంటే మన పాపాలను ప్రక్షాళన చేసుకుని, భగవంతుడిని స్మరించడం. భగవంతునికి అర్పించే హోమంలో సమర్పించే గంధపు చెక్కలు, నెయ్యి, ఇతర ఔషధాల నుంచి వచ్చే బూడిదను భస్మం అంటారు. అంతేగాని ప్రతి బూడిదను "భస్మం" లేదా "విభూతి" అనరు. భస్మాన్ని స్వీకరించినప్పుడు చిటికెడు భస్మాన్ని తీసి నోట్లో వేసుకోవడం హిందువుల ఆచారం. "భ" భరత్సానాం (పాప నాశనానికి) "స్మ" స్మరణానికి ప్రతీకలు. అంటే దుష్టశక్తి నాశనం, దైవత్వస్మరణ అని అర్థం, ఈ భస్మాన్నే మనం "విభూది"గా పిలుస్తాం. జనన మరణ పరిధుల నుంచి బయటపడి, శారీరక అహంకారాల్ని మసి చేయడానికి గుర్తుగా కూడా విబూది ధారణ స్ఫురణకు తెస్తుంది. శరీరం అంతా భస్మాన్ని పూసుకునే శివునికి అత్యంత ప్రీతికరమైనది ఈ "విబూది". దీనికి ఔషధ విలువలు కూడా ఉన్నాయి. విబూది అనగా "ఐశ్వర్యము".

## ఓంకారం విశిష్టత :

ఓం అన్నది మంత్రం కాదు... మత సంబంధమైనది అసలే కాదు.. వేదాలలో నిక్షిప్తమైన ఓంకార నాదం మానవ ఆరోగ్య రహస్యానికి ఒక సూత్రం. ప్రాచీన ఋషులు వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఉపవాస దీక్షలలో కూడా ఆరోగ్యవంతులుగా ఉండటం వెనుక ఓంకార నాదమే రహస్యం. విదేశాల్లోని అనేక యూనివర్సిటీల్లో ఓంకారనాదంపై జరిపిన పరిశోధనల్లో ఓంకారం మృత్యుంజయ జపం అని తేలింది.

- ఓం నాభిలోనుంచి లయబద్ధంగా ఓంకార పదాన్ని పలక గలిగితే మానవుడి ఆరోగ్యం పరిపూర్ణంగా ఉంటుంది.
- ఓం ఓంకారం పదిహేను నిముషాలపాటు ఉచ్చరించగలిగితే రక్తపోటు తగ్గుతుంది.
- ఓం రక్త ప్రసరణ సక్రమంగా జరిగి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ఓం మానసిక అలసట, అలజడి తగ్గి ప్రశాంతత కలుగుతుంది.
- ఓం ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది.
- ఓం జీర్ణ ప్రక్రియ దారిలో పడుతుంది.
- ఓం కిడ్నీ వ్యవస్థ క్రమబద్ధంగా పనిచేస్తుంది
- ఓం థైరాయిడ్ పనితీరుని క్రమబద్ధం చేస్తుంది.

ఓంకారంలో ఉన్న మహత్యం అదే.

## 'యోగా' అనగానేమి?

తలక్రింద పెట్టి కాళ్ళు పైన పెట్టటం యోగాకాదు. శ్వాసబంంధించడం, శరీరాన్ని మెలితిప్పటం మాత్రమే యోగా కాదు. యోగాసాధనలో పలు రకాలు ఉన్నాయి. యోగా అనేది ఒక ప్రత్యేక తరహా కలిగినది. యోగా అంటే ఐక్యం. ఈ విశ్వంలో నీవు ఎవరో తెలుసుకుని జీవించడం ఒక యోగము. నవీన విజ్ఞానశాస్త్రం యోగా మనం చూస్తున్నదంతా ఒకేరకమైన శక్తి అని అది భిన్నరూపాలలో కనిపిస్తుందని చెబుతున్నది. అదేవిధంగా మీరుకూడా ఈలోకం అంతా ఒక్కటేనన్న భావన తెచ్చుకోగలగటమే యోగా. యోగా ఒక విజ్ఞానశాస్త్రం.

భౌతిక శరీరం బాగుకు విధానాలు ఉన్నట్టే, అంతర్గత బాగుకోసం అందించినదే యోగా. యోగా అనేది భారతదేశంలో పుట్టిన ఒక శాస్త్రం. ఇక్కడి సంస్కృతికి అందించిన వరం. దీనిని హిందువులు తొలుత కనుక్కున్నారు. అందుకు పతంజలి మహర్షి రచించిన యోగశాస్త్రము ప్రామాణికము.

## నమస్కారం

'నమస్తే' అనే పదం 'నమరి', 'తె' అన్న వాటిని కలపడం ద్వారా వచ్చింది. 'నమరి' అన్నదానికి అర్థం శిరస్సు వంచడం, 'తె' అంటే 'మీకు' అని అర్థం, పదం చిన్నదైనా వినయవిధేయతల చిహ్నామైనది. భారతీయ సంస్కృతిలో తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు పెద్ద వారి నందరిని గౌరవించుటకు శిరస్సు వంచి నమస్కరించడం ఒక సంస్కారముగా భావిస్తారు. నిజానికి ఇద్దరు వ్యక్తులు కలిసి 'నమస్తే' అని ఒకరి కొకరు పలుకరించుకోవడమంటే వారి వారి మనస్సులు కలిసినవని సూచించుకోవడమన్న మాట. చాతీ ముందు చేతులు జోడించడం దీన్నే సూచిస్తుంది. తలవంచడమంటే స్నేహాన్ని ప్రేమానురాగాల రూపంలో వినమ్రంగా అందించడం. ఇదే మాదిరి నమస్కరించి 'జై శ్రీరాం, 'సాయిరాం' 'జై శ్రీకృష్ణ', నమోనారాయణ' వంటి మాటలను కూడా దైవత్వ గుర్తింపుగా అంటూ ఒకరి నొకరు పలకరించుకోవడం, వీడ్కోలు చెప్పుకోవడం అనేది ఆనవాయితీగా ఉంది. 'నమస్తే' అన్న మాటకు ఆధ్యాత్మిక అర్థం జీవనశక్తి, దైవత్వం. నమస్కారము అనెడి సుగుణము సంస్కారులను వరించును. నమస్కారము బ్రతుకులో ఆనందమును నింపును. అజ్ఞానమును అంతమొందించును. అహంకారమును ధ్వంసమొనర్చును.



# ఋణానుబంధం



ఒక రైతు తన పొలంలో పనిచేసుకుంటుంటే ఏవో అరుపులు వినిపించాయి. వెంటనే అటువైపు వెళ్లి చూస్తే అక్కడ ఒక అబ్బాయి బావిలో పడి "HELP, HELP" అని అరుస్తూ ఉన్నాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే రైతు బావిలోకి దూకి ఆ అబ్బాయిని కాపాడి ధైర్యంచెప్పి ఇంటికి పంపించివేశాడు.

ఆ మరునాడు వాళ్ళింటి ముందు ఒక ఖరీదయిన గుర్రపుబండి వచ్చి ఆగింది. అందులో నుండి ఖరీదయిన దుస్తులు ధరించిన పెద్ద మనిషి దిగి నేరుగా రైతు వద్దకు రాగా ఆయనను చూస్తూ "ఎవరు బాబు మీరు? ఎవరు కావాలి?" అని అడిగేడు ఆ రైతు. "నమస్తే నేను పక్క ఊరిలో ఉంటాను, నిన్న మీరు ఒక అబ్బాయి బావిలో పడితే రక్షించారే, ఆ అబ్బాయి తండ్రిని నేను, నాబిడ్డ ప్రాణాన్ని కాపాడిన మీకు కృతజ్ఞతగా ఏమిచ్చినా మీ ఋణం తీరదు, దయచేసి ఈ ధనం తీసుకోండి" అంటూ ఒక ఇనప్పెట్టె ఆ రైతు ముందు ఉంచేడు ఆ అబ్బాయి తండ్రి. "క్షమించండి, నేను ప్రతిఫలం ఆశించి చేయలేదు ఆపని, ఒక వ్యక్తి ఆపదలో ఉంటే నా చేతనయిన సాయంచేసాను, అది మనిషిగా నాధర్మం" అంటూ సున్నితంగా ఆ బహుమానాన్ని స్వీకరించలేదు ఆరైతు. ఇంతలో ఆ రైతు కొడుకు అక్కడకు వచ్చి ఆ పెద్దమనిషికి నమస్కరించగా, ఈ అబ్బాయి నీ కొడుకా? ఏం చదువుతున్నాడు? అని అడిగేడు ఆ పెద్దమనిషి. నా కొడుకే, పెద్ద చదువులు చదివించే స్తోమతలేక కొంత వరకే చదివించాను, ఇపుడు నాతోపాటే పొలానికి వచ్చి పనుల్లో సాయపడుతుంటాడు" అన్నాడు ఆరైతు. "అలాగా, అయితే నా మాట విను, నీ కొడుకుని నేను చదివిస్తాను, నా కొడుకుతో పాటు పెద్ద చదువులు చదువుకుంటాడు, ఖర్చంతా నేను భరిస్తాను. నా మాట కాదనకు, నా కొడుకుని కాపాడిన నీ ఋణం కొంతయినా తీర్చుకోనివ్వు" అన్న ఆ పెద్దమనిషి అభ్యర్థనను కాదనలేక "సరే" అన్నాడు ఆ రైతు. పెద్దమనిషి పిల్లలిద్దరిని వారికి ఇష్టమయిన చదువులు చదివించాడు. వాళ్ళిద్దరూ చాలా గొప్ప వాళ్ళు అయ్యి, వారి వారి వృత్తులలో స్థిరపడ్డారు.


కొంతకాలానికి ఆ పెద్ద మనిషి కొడుక్కి ఒక అంతు తెలియని వ్యాధి రాగా, అతన్ని పరీక్షించిన డాక్టర్లు అందరూ వ్యాధి నిర్ధారణచేసి అందుకు తగిన ఔషధం లేక చేతులెత్తేసారు, అప్పుడు ఆ రైతు కొడుకు వచ్చి తాను కనిపెట్టిన మందుతో ఆ వ్యాధిని నయం చేస్తాడు.

ఆ రైతు కొడుకు ఎవరో తెలుసా? పెన్సిలిన్ మందుని కనిపెట్టిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్త అలెగ్జాండర్ ఫ్లెమింగ్.. !! ఇంతకు ఆ రెండో వ్యక్తి ఎవరో తెలుసా?? బ్రిటిష్ ప్రధాన మంత్రి..!! "విన్‌స్టన్ చర్చిల్"

" చేసిన పుణ్యం వూరికే పోదు, కలకాలం తోడొస్తుంది" అని ఆర్యోక్తి. "ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో" శ్రీ శిరిడీసాయిబోధ.

సేకరణ : **డా॥ ఓ. మహమ్మద్ రఫీ**


ఓం సమర్ధ సద్గురు సాయినాధాయనమః



శ్రీ భరద్వాజ గురువేనమః





## ఆహ్వానము

## 27వ వార్షికోత్సవము

**శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు,** పవర్ సిటీ, విశాఖపట్నము - 531021.

**తేదీలు :**
**2020 ఫిబ్రవరి 1 మరియు 2**
**(శని, ఆదివారములు)**

**వేదిక : శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
ప్లాట్ నెం.13, పవర్ సిటీ, చిన్నగొర్లివానిపాలెం,
పరవాడ మండలము, విశాఖపట్నం - 531021

**2020 ఫిబ్రవరి 1 మరియు 2 తేదీలలో (శని, ఆదివారములు) జరిగే కార్యక్రమాలు**

ప్రతిరోజు, నాలుగు హరతులు, అభిషేకము, భక్తుల గోత్ర నామాదులతో పూజ, ప్రత్యేక ఆహ్వానితులచే ఆధ్యాత్మిక ప్రవచనములు, సద్గోష్టి, వివిధ సేవా కార్యక్రమాలతో పాటు **1వ తేదీ** సామూహిక పారాయణ, నామలిఖితం **2వ తేదీ** సామూహిక గురుపూజలు మొదలుగా అనేక విశేష కార్యక్రమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించబడును. కార్యక్రమాల రెండు రోజులు వేదిక వద్ద, శ్రీ దత్తావతార, అవధూత, మహత్ముల పాదుకలతో పాటు దివ్య వస్తు, వస్త్ర దర్శనము కలదు. ఆయా కార్యక్రమాలలో పాల్గొని శ్రీ దత్త సాయి భరద్వాజుల కృపను పొందటానికి

**అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము**

**గమనిక :** కార్యక్రమము జరిగే రెండు రోజులు సుదూర ప్రాంతాల నుండి విచ్చేసే భక్తులకు సామాన్య ఉచిత భోజన వసతి ఏర్పాట్లు చేయడమైనది.

వివరములకు : **శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు,** పవర్ సిటీ
సెల్ : 98496 45224 , 94414 67648

# 2020 సం॥లో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు (పవర్‌సిటీ) నిర్వహించే / పాల్గొనే ముఖ్య కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| జనవరి | 1 | ఆంగ్ల నూతనసంవత్సర ప్రత్యేక సత్సంగం |
| | 16 | అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము |
| ఫిబ్రవరి | 1 & 2 | శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు 27వ వార్షికోత్సవము – పవర్‌సిటీ, విశాఖపట్నం |
| | 7,8&9 | 21వ అఖిలాంధ్ర శ్రీ సాయిమాస్టర్ భక్తసమ్మేళనము – |
| | 21 | మహాశివరాత్రి – శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధనోత్సవము – నర్సీపట్నం |
| మార్చి | 25 | "ఉగాది" శ్రీ " శార్వరి " నామసంవత్సరము ప్రత్యేక సత్సంగమము – పవర్‌సిటీ |
| ఏప్రిల్ | 2 | శ్రీరామనవమి |
| | 12 | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము |
| మే | 7 | బుద్ధజయంతి |
| | 17 | హనుమజ్జయంతి |
| | 25 | పేద విద్యార్థులకు పుస్తక–వస్త్ర బహూకరణ, వివిధ సేవాకార్యక్రమములు – పవర్‌సిటీ |
| | 29 | అవధూత శ్రీ చివటంఅమ్మ ఆరాధనోత్సవము |
| జూన్ | 5 | శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి మహోత్సవము |
| జూలై | 4 & 5 | గురుపూర్ణిమ మహోత్సవములు – పవర్‌సిటీ, విశాఖపట్నం |
| | 5 | గురుపూర్ణిమ |
| ఆగష్టు | 3 | సద్గురువుల పాదుకామహోత్సవము – శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమము, నర్సీపట్నం |
| | 11 | శ్రీ కృష్ణ జయంతి, కృష్ణాష్టమి |
| | 17 | శ్రీ తాజుద్దీన్‌బాబా ఆరాధనోత్సవము |
| | 22 | వినాయక చవితి<br>శ్రీపాద శ్రీవల్లభుల జయంతి |
| | 24 | అవధూత శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవము |
| సెప్టెంబరు | 3 | అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము (తేదీ ప్రకారము) |
| | 26&27 | త్రయోదశ (13వ) అఖిలాంధ్ర సాయిభక్త సమ్మేళనము మరియు<br>26వ సద్గురువుల పాదుకామహోత్సవము – పవర్‌సిటీ |
| అక్టోబరు | 25 | విజయదశమి 102వ శ్రీ శిరిడీసాయి మహాసమాధి మహోత్సవము |
| | 30 | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి |
| నవంబరు | 14 | దీపావళి |
| | 19 | శ్రీ సాయిదీక్ష (మండలం) ప్రారంభం – పవర్‌సిటీ |
| | 30 | కార్తీకపూర్ణిమ |
| డిసెంబరు | 9 | శ్రీ సాయిదీక్ష (అర్ధమండలం) ప్రారంభం – పవర్‌సిటీ |
| | 27,28&29 | శ్రీ దత్త జయంతి మహోత్సవములు – పవర్‌సిటీ |
| | 29 | శ్రీ దత్త జయంతి, శ్రీ సాయి దీక్ష విరమణ |
| | 30 | భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి |
| | 31 | ఆంగ్ల సంవత్సర (2020) వీడ్కోలు ప్రత్యేక సత్సంగమము – పవర్‌సిటీ |

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో ఈ పేజీ సమర్పించిన వారు :

**శ్రీ కె. అశోక్ కుమార్, శ్రీమతి అరుణ కుమారి, కుమారి సాయి సౌభాగ్య శ్రీ, చి॥ మేధా సాయి - శ్రీకాకుళం**

# ఏరిన ముత్యాలు

### ఓటమి

గెలవకపోవటం కాదు ఓటమి
తిరిగి ప్రయత్నించకపోవటమే నిజమైన ఓటమి
– విలియమ్స్

### విజయం

ఓటమిని అంగీకరించేవాడు
ఎప్పటికైనా విజయానికి దగ్గర అవుతాడు.

### గ్రంథాలయం

ఒక మంచిపుస్తకం వందమంది మిత్రులతో సమానం, కాని ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయముతో సమానము.

### సద్వినియోగం

ఒక మంచి వ్యక్తి కోసం వెచ్చించిన సమయం,
ఒక మంచిపని కోసం వెచ్చించిన ధనం
ఎప్పటికీ వృథాకాదు.

### విలువ

గొంతు పెంచటం కాదు, మాట విలువ పెంచుకో
వాన చినుకులకే తప్ప, ఉరుములకు పంటలు పండవు.

### మొదలు

ఆశించటం ఆపితే ఆనందం మొదలవుతుంది
శాశించటం ఆపితే సంతోషం మొదలవుతుంది.

### ప్రయత్నించు

శ్రీరాముడు అంతటి వాడే రావణాసురిడికి నచ్చలేదు
శ్రీకృష్ణుడుని, కంసుడు మెచ్చలేదు, కనుక
ఇతరులమెప్పుకోసం కాక,
నీకు నీవులా జీవించి, సద్గురు మెప్పు పొందు.

### గొప్పకళ

అందంగా మాట్లాడటం ఒక కళ
అనవసరంగా మాట్లాడకుండా ఉండటం ఇంకా గొప్ప కళ.

### అద్దం

పైవారితో గౌరవంగా, సాటివారితో స్నేహంగా మెలగటం కాదు, తనకన్నా తక్కువవారితో మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

### ఆలోచించు

జీవితంలో ఎప్పుడైనా, ఎవరినైనా పనికిరానివానిగా పరిగణించవద్దు, ఎందుకంటే చెడిపోయిన గడియారం కూడ రోజుకు రెండుసార్లు సరియైన సమయం సూచిస్తుంది.

### ఆధ్యాత్మికత

మనకు రెండు రకాల విద్య అవసరం ఒకటి
జీవనోపాధి ఎలా కల్పించుకోవాలో నేర్పేది
రెండవది ఎలా జీవించాలో నేర్పేది. అదే ఆధ్యాత్మికత.

### ఆగి - సాగు

సత్యం తెలుసుకోవటానికి నీ గురువు దగ్గరే ఆగిపో
తత్వం నేర్చుకోవాలంటే ఆ గురువుతోనే సాగిపో.

### ప్రేమ

ప్రేమ అంటే అవతలవారిని అర్థంచేసుకోవటం కాదు
అవతలవారిచే అర్థంచేసుకోబడటం కూడ.

### గీతావాక్యం

అందరిలోనూ ఆత్మ ఒక్కటే కనుక
ఒకరిని ద్వేషించటము, అంటే తనను తాను
నిందించుకున్నట్లే అవుతుంది.

### గురువు

చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో
భూమినిచూసి ఓర్పు నేర్చుకో
చెట్టును చూసి ఎదుగుదల నేర్చుకో
నీ చుట్టూ ఉన్నవాళ్ళను చూసి
వారిలోని సుగుణాలను నేర్చుకో

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



ఫిబ్రవరి 7వ తేదీన సింగపూర్‌లో పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ బి. యశోభరత్ శ్రీమతి ప్రతిమ** లకు

మరియు ఫిబ్రవరి 15వ తేదీన

ఎన్.టి.పి.సి., విశాఖపట్నంలో పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ బి. చంద్రశేఖర్ శ్రీమతి సుశీల**

దంపతులకు శ్రీదత్త సాయి భరద్వాజుల కృపానుగ్రహముతో
సుఖమయ ఆనంద ఆన్యోన్య జీవితాలను గడపాలని
కోరుకుంటూ

శభాకాంక్షలతో శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు
శ్రీమతి వి.యస్.లక్ష్మి మరియు శ్రీ భరద్వాజ సద్గురువాణి

## జన్మదిన మరియు పెళ్ళిరోజు శుభాకాంక్షలు



మార్చి 17వ తేదీన
పుట్టిన రోజు జరుపుకుంటున్న

**శ్రీ ఎల్. తరణిసేన్** కు

మార్చి 17వ తేదీన
పెళ్ళి రోజు జరుపుకుంటున్న

**శ్రీ ఎల్. తరణిసేన్, శ్రీమతి జయలక్ష్మి** లకు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



ఫిబ్రవరి 2వ తేదీన పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ వి. వెంకటరమణ, శ్రీమతి వి. నాగమణి** ల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని
అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.

నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు




**శ్రీ డి. మల్లేశ్వర రావు**
**శ్రీమతి శ్రీదేవి**
**చి|| వాగ్దేవి**
**చి|| జ్ఞాన ప్రసూన**

శ్రీకాకుళం



నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు



Since : 1996

డివైన్ క్లాత్ షోరూం

Divine Tailors

లేడీస్ టైలర్స్

పాలకొండ రోడ్, శ్రీకాకుళం

మా వద్ద : Raymonds, Digjam, OCM, Siyaram, Vimal, Aravind Cotton, 100% Cotton Jeans, Birla Lenin, Italian Suitings & Shirtings

మొ॥నవి హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా లభించును.



మహిళలకు శుభవార్త
మా కస్టమర్ల కోరికమేరకు
లేడీస్ డిజైనర్స్
ప్రారంభించడమైనది.

Specialist in :
Suits, Safaries & Jeans

మీ
E. అప్పారావు
Cell : 9440320317
ఫోన్ : 229997



నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

**డా॥ మధు విలేకర్** చైర్మన్
మరియు సత్సంగ సభ్యులు

**శ్రీ షిర్డీ సాయిబాబా సేవా సత్సంగం (రి)**

విశాఖ 'బి' కోలనీ, శ్రీకాకుళం. ఫోన్ : 652515

## జన్మదిన శుభాకాంక్షలు



జనవరి 7వ తేదీన శ్రీకాకుళంలో పుట్టిన రోజు జరుపుకుంటున్న

**శ్రీ గుడ్ల లక్ష్మీకాంతారావు** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...

**శ్రీ సాయి మణికంఠ**
**మెడికల్స్ & జనరల్ స్టోర్స్**

పాత బ్రిడ్జ్ రోడ్, 7 రోడ్ జంక్షన్, శ్రీకాకుళం.
సెల్ : 9492299906, 9492207906

## జన్మదిన మరియు పెళ్ళిరోజు శుభాకాంక్షలు



జనవరి 5వ తేదీన పుట్టిన రోజు జరుపుకుంటున్న

**శ్రీమతి ఆర్. స్రవంతి** కు

ఫిబ్రవరి 24వ తేదీన

**పెళ్ళి రోజు** జరుపుకుంటున్న

**శ్రీ ఆర్. సూర్య శ్రీనివాస్, శ్రీమతి స్రవంతి** లకు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Plot No. 13, Power City, Near Gowthu Lachanna Nagar, Parawada Mandal, Visakhapatnam-21 and Printed at **M/s. UNITED POWER ENTERPRISES,** # 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka, Visakhapatnam-26 and Published at Power City, Visakhapatnam, Editor : **V.V. POORNA CHANDRA RAO**